# శ్రీపద్మావతీ పరిణయ పురం
# నారాయణవరం

రచన
జూలకంటి బాలసుబ్రహ్మణ్యం
తిరుపతి

ప్రచురణ
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.
2016

**SRI PADMAVATHI PARINAYAPURAM**
**NARAYANAVARAM**

*by*

**Julakanti Balasubrahmanyam**

T.T.D. Religious Publications Series No. 1231
© All Rights Reserved
*First Edition : 2016*

*Copies :* 3000

*Published by*
**Dr.D.SAMBASIVA RAO,** I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati - 517 507

***D.T.P:***
Publications Division,
T.T.D, Tirupati.

*Printed at :*
**Tirumala Tirupati Devasthanams Press,**
Tirupati - 517 507

# ముందు మాట

**శ్లో॥ సత్యం సత్యం పునస్సత్యం నదేవో వేంకటేశ్వరాత్,**
**బ్రహ్మాండే నాస్తి యత్కించిత్ న భూతం న భవిష్యతి.**
**– భవిష్యోత్తరపురాణం**

"సత్యంగా చెబుతున్న ఒక మాట! ఒక్కసారి కాదు. మళ్లీ మళ్లీ చెబుతున్న సత్యమైన మాట ఇది. ఏమిటీ ఆ సత్యం? అంటే! అటు భూతకాలంలోనూ, ఇటు భవిష్యత్కాలంలోనూ ఈ బ్రహ్మాండాల్లో ఎక్కడా శ్రీవేంకటేశ్వరుని వంటి దేవుడు లేడు. లేనే లేడు! కనపడడు కూడా"– అని.

ఆ స్వామివారు, భక్తులకు కొంగుబంగారం! పిలిస్తే పలికే ప్రత్యక్షదైవం! కోరినవారి కల్పవృక్షం! భావించువారి పరబ్రహ్మ! ఆర్తులపాలిటి ఆపన్నదైవం! తన్మయించి నుతించే వారి ఆనందరూపం!

ఇలా భక్తులకు, యాత్రికులకు వారి వారి అభిష్టాలమేరకు అనుభవాలను, అనుభూతులను పంచిపెడుతున్న దేవదేవుడు ఆనందనిలయుడు.

వేంకటాచలక్షేత్రం చుట్టూరా ఆ బ్రహ్మాండనాయకుడు సంచరించిన దివ్యమైన, భవ్యమైన పుణ్యస్థలాలు నాలుగు వున్నాయి.

శ్రీనివాసుడు ప్రత్యక్షంగా కొలువై దర్శనం ప్రసాదిస్తున్న 'తిరుమలక్షేత్రం' వాటిల్లో మొదటిది.

ఇక రెండవది "నారాయణవరం". ఆకాశరాజు పుత్రిక 'పద్మావతి'గా అవతరించిన శ్రీమహాలక్ష్మిని, శ్రీనివాసుడు వివాహమాడిన పుణ్యక్షేత్రం ఇది.

ఆ తర్వాత నూతన వధూవరులైన శ్రీ పద్మావతీ శ్రీనివాసులు ఇరువురు ఆరునెలలపాటు అగస్త్యమహర్షి ప్రార్థనపై విడిది చేసిన "శ్రీనివాసమంగాపురం" మూడవ క్షేత్రం.

ఇక నాలుగవది తిరుచానూరుక్షేత్రం. శ్రీవైకుంఠం నుంచి అలిగి భూలోకానికి వచ్చి కొల్హాపురం (మహారాష్ట్ర)లో వెలసిన శ్రీమహాలక్ష్మి

దర్శనంకోసం, తిరుచానూరులో శ్రీ వేంకటేశ్వరుడు తపస్సు చేశాడు. ఇచటి పద్మసరోవరంలో బంగారు పద్మంలో ఆవిర్భవించినందువల్ల ఆ తల్లిని 'పద్మావతి' అనీ, 'అలమేలుమంగ' అనీ అంటారు.

శ్రీజూలకంటి బాలసుబ్రహ్మణ్యంగారు, ఇప్పటికే తిరుమల, తిరుచానూరు, శ్రీనివాసమంగాపురం క్షేత్రాలను గురించి అనేక రచనలు చేశారు. దేవస్థానం ప్రచురించిన ఈ గ్రంథాలన్నీ భక్తలోకంలో విస్తృత ప్రచారాన్ని పొంది, ఆనందాన్ని పంచి పెడుతూ వున్నాయి.

ప్రస్తుతం వీరి రచన **"శ్రీపద్మావతీ పరిణయపురం నారాయణవరం".**

తిరుమల పుణ్యక్షేత్రం తర్వాత అత్యంత ప్రధానమైన దివ్యక్షేత్రం "నారాయణవరం". "శ్రీపద్మావతి" ఆవిర్భవించిన పుణ్యభూమి ఇది! ఏడుకొండలవాడు ఎరుకలిసాని వేషంలో ఈ పురవీధుల్లోనే తిరిగాడు. ఆకాశరాజు, పద్మావతీ శ్రీవేంకటేశ్వరులకు పరిణయం చేసిన దివ్యస్థలం కూడా ఇదే!

ఈ విషయాలతో పాటు, ఈ పుస్తకంలో శ్రీ కల్యాణ వేంకటేశ్వరుని ఆలయ విశేషాలను ఇంకా నారాయణవరంలోని శ్రీ చంపకవల్లీ పరాశరేశ్వరస్వామి, శ్రీ గణపతి, శ్రీకల్యాణ వీరభద్రస్వామి, శ్రీ ఆమ్నాయాక్షి (అవనాక్షమ్మ), శ్రీమరకతాంబా అగస్త్యేశ్వర ఆలయాలను గూర్చి ఆసక్తి దాయకమైన విషయాలను సమగ్రంగాను సంక్షిప్తంగాను సరళంగాను అందించిన రచయిత ధన్యులు. ఈ గ్రంథాన్ని కూడ భక్తులు అందుకొని ఆనందించగలరని ఆకాంక్షిస్తూ....

*సదా శ్రీవారి సేవలో....*

**కార్యనిర్వహణాధికారి**
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి.

# కృతజ్ఞతాంజలి

**శ్లో॥ శ్రీ వేంకటేశమతి సుందర మోహనాంగం**
**శ్రీ భూమికాంతమరవింద దళాయతాక్షమ్**
**ప్రాణప్రియం ప్రవిలసత్కరుణాంబురాశిం**
**బ్రహ్మేశ వంద్య మమృతం వరదం భజామి**

**– శ్రీ వేంకటాచల మాహాత్మ్యం**

ఆ దేవుడు సమ్మోహింప జేసే సుందరాంగుడు. ఆయనకు పద్మాలవంటి వెడల్పాటి కన్నులు వుంటాయి. ఆ దేవదేవుడు శ్రీదేవి భూదేవులతో కూడి వుంటాడు. అత్యంత ప్రాణప్రదమైనవాడు. కరుణా సముద్రునిగా భాసిస్తుంటాడు. ఆయనను బ్రహ్మదేవుడు, శివుడు పూజిస్తుంటారు. మోక్షాన్ని ప్రసాదిస్తాడు. అలాంటి పరంధాముడైన శ్రీవేంకటేశ్వరుణ్ణి భజిస్తాను.

బాగుంది. ఇంతకూ ఆ స్వామి ఎక్కడ వుంటాడు? అంటే!

ఏడుకొండలపైన 'బంగారుమేడ'లో వుంటాడు. అదే 'ఆనందనిలయం'. దాని వర్చస్సు, తేజస్సు సర్వే సర్వత్రా వ్యాపించి, చూసిన వాళ్లకు అవ్యక్తమైన ఆధ్యాత్మి కానందం కలుగుతుంటుంది. ఆనందనిలయుడు కేవలం ఆ గుళ్లో మాత్రమే కాదు. ఆ పర్వత సానువుల్లోనే కాదు. ఏడుకొండలు దిగి విహరిస్తుంటాడు కూడా!

పూర్వం ఒకసారి ఆ కొండలరాయడు, దగ్గర్లోని ఆకాశరాజు రాజధాని 'నారాయణవరం' వెళ్లాడు. అక్కడ రాజపుత్రిక పసిడి బొమ్మ 'పద్మావతి'ని చూసి ప్రేమించాడు. ఈయన్ను చూసిన యువరాణి పద్మిని (మరోపేరు) పరిస్థితి కూడా అంతే! వేంకటేశ్వరుడు తన తల్లి వకుళమాతకు చెప్పాడు. 'పద్మావతి' లేకపోతే బతకలేనన్నాడు. తప్పుతుందా నాయనా! అంటూ నారాయణవరం బయలుదేరింది వకుళమాత!

'పద్మావతి' ఆడపిల్ల కదా! పాపం. ధైర్యం చేసి ఇంట్లో చెప్పలేకపోయింది. దిగులుతో మంచం పట్టింది. ఇంతలో 'ఎరుకలసాని'గా విచిత్రవేషంతో నారాయణపుర వీధుల్లో ప్రత్యక్షమయ్యాడు ఏడుకొండలరేడు. 'సోది'

చెప్పమని పిలిపించింది రాణి. ఆ ఎరుకలి వచ్చి పద్మావతి హస్తం పట్టుకొంది. ఎన్నెన్ని యుగాల అనుబంధమో అది. పులకించిపోయింది పద్మావతి.

"ఈ పెంటి కూన మీ బిడ్డ కాదే తల్లె! సాచ్చాత్తు ఆదిలచ్చిమి! ఈమెను ఆదినారాయణుడు జూసిండె. ఇద్దరూ వలపుగొన్నారె తల్లె! తొందర్లో లగ్గం సెయ్యండె తల్లె!" అంటూ ఎరుకలిగద్దెను చెప్పిన వేంకటేశ్వరుడు పద్మావతిని వూరించి వూరించి వెళ్లాడు. ఇంతలో వకుళమాత వచ్చి పెండ్లికి ఒప్పించి ఆనందంగా వెళ్లింది.

ఎలాగైతే ఏం! పెళ్లి కుదిరింది. విలంబినామసంవత్సరం వైశాఖ శుద్ధదశమీ శుక్రవారం ఉత్తరఫల్గునీ నక్షత్రం అభిజిత్ లగ్నంలో పెళ్లి.

వరుడు వేంకటేశ్వరుని పక్షాన శివుడు, బ్రహ్మేంద్రాది అఖిల దేవతలు అన్ని లోకాలవాండ్లు అందరూ వచ్చారు. ఆకాశరాజు తరుపున చిన్నా, పెద్దా, ఆడా, మగా మానవులందరూ వచ్చారు.

భూలోకంలో అందులోను, కలియుగంలో వైకుంఠనాథుడైన నారాయణుని పెండ్లి ప్రత్యక్షంగా జరుగుతున్న "పరిణయవేదిక", నారాయణవర మహానగరం కిటకిటలాడింది. ఆకాశమంత ముత్యాలపందిరి కింద, ధరణి అంత అందాల అరుగుమీద జగత్కల్యాణ చక్రవర్తి శ్రీనివాసునికీ, పెండ్లి కూతురు పద్మావతితో అంగరంగ వైభవంగా పరిణయం జరిగింది. ఆ పెండ్లి వేడుకలను వీక్షించినవారు భాగ్యవంతులు. వివాహ విందును ఆరగించిన వారి ఆనందమే ఆనందం!

సుమారు ఐదువేల ఏండ్ల కిందట, లోకకల్యాణంకోసం జరిగిన ఆనాటి పవిత్రమైన పరిణయ వేదికే నారాయణవరంలోని నేటి శ్రీకల్యాణవేంకటేశ్వర స్వామి ఆలయం. ఆ గుడిలో నిత్యనూతన వధూవరులైన శ్రీపద్మావతీ శ్రీనివాసులు కల్యాణకంకణాలతో నేటికీ దర్శనం ఇస్తున్నారు. ఏడుకొండలమీది ఎరుకలసాని తిరుగాడిన నారాయణవరం పురవీధులూవున్నాయి. ఆ వీధుల్లోనే దేవతలు తిరుగాడిన దివ్యస్థలాలు వున్నాయి.



పరమపుణ్యధామమైన నారాయణవరక్షేత్రాన్ని సందర్శించండి! వివాహం కావలసినవారు వివాహ ప్రాప్తినీ, సంతానంకోరేవారు సంతాన సిద్ధినీ పొందండి! ఇంకా ఇష్టార్థాలను అనుభవించండి! ఆనందించండి!

నారాయణవరంక్షేత్రం లోని శ్రీ పద్మావతీసమేత శ్రీ కల్యాణవేంకటేశ్వర స్వామివారి ఆలయ వైఖానసాగమ ఆర్చకులు శ్రీధర భట్టాచార్యులు, శ్రీనివాస భట్టాచార్యులు, శ్రీనరసింహరాఘవ భట్టాచార్యులు, శ్రీకౌశిక్‌శౌరి భట్టాచార్యులు గారలు; శ్రీ చంపకవల్లీ సమేత శ్రీపరాశరేశ్వరస్వామి ఆలయం శైవాగమఅర్చకులు శ్రీ.టి.వి.రవిచంద్రగురుకుల్‌గారు; శ్రీమరకతాంబికా సమేత శ్రీఅగస్త్యేశ్వరస్వామివారి ఆలయ శైవాగమఅర్చకులు శ్రీ టి.వి.రమేష్ గురుకుల్‌గారు; శ్రీ భద్రకాళీ సమేత శ్రీకల్యాణవీర భద్రస్వామివారి ఆలయ వీరశైవాగమఅర్చకులు శ్రీ గురుప్రకాష్ గారు; శ్రీ అవనాక్షమ్మ(ఆమ్నాయాక్షి) అమ్మవారి ఆలయం వీరశైవాగమఅర్చకులు శ్రీఎం.పన్నీరుసెల్వంగారు; శ్రీవల్లభగణపతి ఆలయ వీరశైవాగమఅర్చకులు ఇలా ఆ యా ఆలయాల అర్చకవరేణ్యులు ఆలయాల విషయాలను, విశేషాలను, ఓపికగా, ఓర్పుగా ఆశీర్వదిస్తూ అనుగ్రహించారు. తెలియజేశారు.

తరతరాలుగా నారాయణవరక్షేత్రంలో నిరంతరం అర్చనాది కార్యక్రమాలతో తరిస్తున్న అర్చక ప్రముఖులు అందరికీ అత్యంత భక్తిపూర్వక నమస్కారాలు.

అహరహం అవిశ్రాంతంగా 'భక్తుల సేవే భగవంతుని సేవ' అంటూ పరమార్థంగా భావిస్తూ, భక్తుల సౌకర్యాల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న పరిపాలనాదక్షులు, పరమభక్తులు, తి.తి.దేవస్థానం శ్రీకార్యనిర్వహణాధికారులు డా॥ దొండపాటి సాంబశివరావు, ఐ.ఎ.ఎస్.గారు, కల్యాణ పరంపరల్ని గుప్పించే **'నారాయణవరం'** క్షేత్రాన్ని గూర్చిన రచనను తొందర్లో అందివ్వవలసిందంటూ నన్ను ఆదేశించారు.

వారితోపాటు, తి.తి.దేవస్థానం తిరుపతి సంయుక్త కార్యనిర్వహణాధికారులు, పరిపాలనానిమగ్నులు, సాహితీ ప్రియులు అయిన శ్రీ పోల భాస్కర్,ఐ.ఎ.ఎస్ గారు కూడా, ఏమాత్రం అలసత్వం లేకుండా ఈ

రచనను త్వరగా అప్పచెప్పమని ఆనతిచ్చారు. ఆ ఇరువురి అధికారుల ఆదేశాన్ని ఆనందనిలయుని ఆజ్ఞగా శిరసావహించి అందించాను. ఆ వెనువెంటనే వారు, ఈ పుస్తకాన్ని దేవస్థానం ప్రచురణగా వెలువరించడం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తూ, ఆ అధికారవరేణ్యు లిరువురికీ భక్తి పూర్వక నమస్కారాలు సమర్పించుకొంటున్నాను.

ఇటీవలే దేవస్థానం 'ప్రచురణలవిభాగం' ప్రత్యేకాధికారులుగా నియమితులైన శ్రీ ప్రయాగ రామకృష్ణ గారు త్రివేణీ సంగమం లాంటివారు. "నా ఆధ్వర్యంలోకూడ మరోమంచి పుస్తకాన్ని తొందరగా ఇవ్వండి" అంటూ ప్రోత్సాహపరుస్తున్న, సహృదయులు సరససంభాషణాచతురులు, సరళమైన సాహిత్యరచనాశీలి అయిన శ్రీ ప్రయాగవారికి కృతజ్ఞతాపూర్వక నమస్కారాలు.

ఇక ఈ పుస్తక రచనకు ఎన్నో విధాలుగా చేదోడు వాదోడుగా సహకరిస్తూ తోడ్పడిన ఆత్మీయ మిత్రులు, దేవస్థానం ఉపసంపాదకులు డా॥నొస్సం నరసింహాచార్య గారికి కృతజ్ఞతాభినందనలు.

ఈ పుస్తకం తయారీలో మిక్కిలి శ్రమించిన, దేవస్థానం ప్రచురణల విభాగంలోని డి.టి.పి ఆపరేటర్లకు, చక్కగా ముద్రించిన దేవస్థానం ప్రెస్సు సిబ్బందికి కృతజ్ఞతాంజలులు.

చివరగా ఒక్కమాట!

ఇందులోని ప్రతి అక్షరం 'శ్రీ పద్మావతీ కల్యాణ వేంకటేశ్వరునిదే అయినప్పుడు, **"శ్రీ పద్మావతీ పరిణయపురం నారాయణవరం"** పుస్తకం కూడ శ్రీనివాసునిదే అని ప్రత్యేకంగా చెప్పవలసిన పనిలేదు.

**శ్లో॥ నారాయణ పురే రమ్యే పద్మావత్యా సహాఽనిశమ్**
**రమమాణాయ కల్యాణ వేంకటేశాయ మంగళమ్.**
**– శ్రీ కల్యాణవేంకటేశ్వరస్వామి సుప్రభాతం**

**శ్రీదుర్ముఖి సంవత్సరం**
**విజయదశమి,**
**11-10-2016**

రచయిత
**జూలకంటి బాలసుబ్రహ్మణ్యం**
తిరుపతి

# విషయసూచిక


| | |
|---|---|
| ముందుమాట | III |
| కృతజ్ఞతాంజలి | V |
| శ్రీపద్మావతీ పరిణపురం నారాయణవరం | 1 |
| ఆకాశరాజు | 3 |
| బంగారు పద్మంలో పసిపాప | 4 |
| చూపులు కలిసిన శుభవేళ | 6 |
| తొలివలపు | 9 |
| ప్రేమజ్వరం | 11 |
| యశోదవే నీవు | 14 |
| ఆ వేదవతే ఈ పద్మావతి | 15 |
| ఎరుకలసాని | 19 |
| వివాహ నిశ్చయం | 21 |
| పెండ్లి వేడుకలు | 23 |
| ఎదుర్కోలు | 26 |
| పద్మావతీ శ్రీనివాసుల పెండ్లి | 29 |
| అగస్త్యమహర్షి ఆతిథ్యం | 31 |
| ఆకాశరాజు పూర్వజన్మగాథ | 34 |
| తొండమానురాజు పూర్వజన్మ | 35 |
| రాజ్యం కోసం తగవులాట | 36 |
| శ్రీనివాసుని కొల్హాపురయాత్ర | 37 |


ఆకాశవాణి 38
వ్యూహలక్ష్మి 38
శిలగా మారిన శ్రీనివాసుడు 39
పరిణయమండపమే శ్రీవారిఆలయం 40
ఆలయాల నగరం! శ్రీనారాయణవరం 41
నారాయణవరం చరిత్ర - పూర్వాపరాలు 43
శ్రీపద్మావతీ సమేత శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామి ఆలయం 46
ప్రధాన రాజగోపురం 46
సంపెంగ ప్రదక్షిణం 48
రెండవ రాజగోపురం 48
విమాన ప్రదక్షిణం 49
చుట్టు గుళ్లు 49
శ్రీపద్మావతీఅమ్మవారి సన్నిధి 50
కల్యాణమండపం - యాగశాల 52
ఆండాళ్ (గోదాదేవి) సన్నిధి 53
వైకుంఠ (ఉత్తర) ద్వారం 53
శ్రీ కల్యాణవేంకటేశ్వరస్వామివారి ప్రధాన ఆలయం 54
శ్రీ కల్యాణవేంకటేశ్వరస్వామి 54
శ్రీ కల్యాణవేంకటేశ్వరస్వామి ఉత్సవాలు 55
నిత్యోత్సవాలు 56
వారోత్సవాలు 57
పక్షోత్సవాలు 59
మాసోత్సవాలు 60
వార్షికోత్సవాలు 60
శ్రీచంపకవల్లీ శ్రీపరాశరేశ్వరస్వామి ఆలయం 70
స్థలపురాణం 70
ఆలయప్రాంగణం 71
బ్రహ్మోత్సవాలు 72
పవిత్రోత్సవాలు 73
శ్రీభద్రకాళీసమేత శ్రీకల్యాణ వీరభద్రస్వామివారి ఆలయం 74
బ్రహ్మోత్సవాలు 77
శ్రీశక్తివినాయకస్వామివారి ఆలయం 78
శ్రీ ఆమ్నాయాక్షి (అవనాక్షమ్మ) అమ్మవారి ఆలయం 79
బ్రహ్మోత్సవాలు 82
దసరానవరాత్రి ఉత్సవాలు 83
శ్రీమరకతాంబాసమేత శ్రీఅగస్త్యేశ్వరస్వామి ఆలయం 86
స్థలపురాణం 87
ఆలయప్రాంగణం 87
బ్రహ్మోత్సవాలు 89
పవిత్రోత్సవాలు 90
శ్రీ సొరకాయలస్వామి సమాధి మందిరం 91



శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయం, నారాయణవరం



నారాయణవరం శ్రీవారి కల్యాణోత్సవం. శ్రీదేవి, శ్రీపద్మావతి, శ్రీభూదేవి అమ్మవార్లతో
శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారు





## ఆపన్నులపాలి దైవం

ఆపన్నులపాలి దైవ మాతఁడే గతి దక్క
యే ప్రొద్దును భజియించఁగ నితరుఁడు మరికలఁడా
॥పల్లవి॥

నిరుపాధిక నిజబందుడు నిరతిశయానందుడు
కరివరదు డితఁడేకాక ఘనుడధికుడు గలడా ॥
॥ఆ పన్నుల॥

సంతత గుణ సంపన్నుడు సాధులకుఁ బ్రసన్నుఁడు
అంతర్యా మితఁడేకాక అధికుఁడు మరి కలఁడా ।
పరమాత్ముఁడు పరమపురుషుండు పరికింపఁగ కృపాలుఁడు
తిరువేంకట విభుఁడేకాక దేవుఁడు మరి కలఁడా ॥
॥ఆ పన్నుల॥

– తాళ్లపాక అన్నమాచార్యులు

# శ్రీ పద్మావతీ పరిణయపురం
# నారాయణవరం

శ్లో॥ నారాయణాఖ్య నగరే కమలా మహీభ్యాం
ఆకాశరాజ తనయా మణిపద్మవల్ల్యా
కల్యాణ మండప తలే లసతో నితాంతం
కల్యాణ వేంకటపతే శ్చరణౌ ప్రపద్యే ॥

– శ్రీ కల్యాణవేంకటేశ్వరస్వామి సుప్రభాతం

సాక్షాత్తు శ్రీమహాలక్ష్మి నారాయణాఖ్య నగరంలో ఆకాశరాజుకు పుత్రికగా 'మణిపద్మవల్లి' అనే పేరుతో అవతరించింది. దివ్యమైన ఆ నారాయణవరంలోని కల్యాణ వేదికలో శ్రీపద్మావతిని పరిణయమాడి నిత్యమూ దివ్యకాంతులతో దర్శనమిస్తున్న శ్రీకల్యాణ వేంకటేశ్వరుని పాదపద్మాలకు ప్రణమిల్లుతున్నాను!!

తిరుమల పుణ్యక్షేత్రానికి 35 కిలోమీటర్ల దూరంలో దక్షిణాగ్నేయ దిక్కులో నెలకొన్న దివ్యస్థలం నారాయణవరం.

వేంకటాచలం ఎంతటి ప్రాచీనమైందో, అంతే ప్రాచీనమైన పరమ పావనమైన క్షేత్రం నారాయణవరం. తిరుమలేశుడు ఏడుకొండలు దిగి వచ్చి ఆకాశరాజు పుత్రిక పద్మావతిని ప్రేమించి, పరిణయమాడిన కల్యాణపురం నారాయణవరం.

శ్రీవైకుంఠంనుంచి శ్రీమహాలక్ష్మిని వెతుకుతూ భూలోకానికి దిగివచ్చిన శ్రీనివాసుడు తొలిగా పాదం మోపిన పవిత్రమైన గిరి 'నారాయణగిరి'. అదే వేంకటాచలం. ఆ దివ్యధామంలో వుంటూ చుట్టు ప్రక్కల విహరించిన పావన స్థలాల్లో మొట్ట మొదటిది నారాయణవరం.

ఏడేడు లోకాల్లో ఈడు లేని ఏడుకొండలవాడు "ఎరుక సెబుతానమ్మ ఎరుక! సోది సెబుతానయ్య సోది!!" అంటూ కేకపెడుతూ, అచ్చమైన ఆడతనం వుట్టిపడుతున్న చీరకట్టూ, బొట్టూ, ముక్కెరా, సిగలో పూలూ,

మూపున చంటివాడైన బ్రహ్మదేవుడూ, తలపై వెదురుబుట్ట ఇలా వయ్యారంగా అందాలను ఒలికిస్తూ నడయాడిన పురవీధుల నగరం నారాయణవరం!

లక్ష్మీదేవి, ఆకాశరాజు పుత్రికగా శ్రీపద్మావతి పేరుతో అయోనిజగా పుట్టిన దివ్యభూమి ఈ పురం! శ్రీపద్మావతి శ్రీనివాసుల పరిణయపురంగా కూడా వర్ధిల్లిన నారాయణవరం తిరుమల యాత్రికులకు అవశ్యం దర్శనీయమైన పుణ్యక్షేత్రంగా వర్ధిల్లుతున్నది.

సాక్షాత్తు నారాయణుడైన వేంకటేశ్వరుడు పద్మావతిని వరించిన పురం కనుక "నారాయణవరం" అనీ "నారాయణపురం" అనీ, జగత్కల్యాణ మూర్తులు, జగన్మోహన మూర్తులయిన పద్మావతీ శ్రీనివాసులు విహరిస్తూ, పరస్పరం ప్రేమించుకొన్న దివ్యోద్యానవనం కనుక "నారాయణవనం" అని ఇలా ఎన్నో పేర్లతో పిలువబడుతున్నది ఈ పుణ్యక్షేత్రం!. అంతేగాక ఈ "నారాయణవరం" సామాన్య ప్రజల నోళ్లలో నానుతూ ప్రస్తుతం "నాన్నారం"గా కూడ పిలువబడుతున్నది.

శ్రీ పద్మావతీ శ్రీనివాసుల పరిణయపురం అయిన దివ్యక్షేత్రం అయిన నారాయణవరం తిరుపతి నుంచి చెన్నై పట్టణానికి వెళ్లే మార్గంలో తాలూకాకేంద్రమైన "పుత్తూరు"కు 5 కి.మీటర్ల దూరంలో నెలకొనివుంది. తిరుపతి నుండి కేవలం ఒకటిన్నర గంట సమయంలో చేరుకోవచ్చు.

తిరుపతి నుంచి పుత్తూరుకు బస్సులు చాలా వున్నాయి. లేదా తిరుపతి నుంచి చెన్నై వెళ్లే రైలుమార్గంలో పుత్తూరులో దిగి, అక్కడినుంచి ఆటోల్లో, టౌను బస్సుల్లో నారాయణవరం చేరుకోవచ్చు.

సాక్షాత్తు శ్రీపద్మావతీ శ్రీనివాసుల పరిణయపురంగా ప్రసిద్ధి పొందిన "నారాయణవరం" పుణ్యస్థలాన్ని దర్శించేముందు ఇక్కడి ఆలయ వేళలు తప్పక గమనించాలి.



ఈ ఆలయం ప్రతిరోజు ఉదయం 5 గం॥ నుంచి రాత్రి 8 గం॥ వరకు మాత్రమే తెరవబడుతుంది.

దివ్యక్షేత్రం అయిన నారాయణవరంలోని శ్రీకల్యాణవేంకటేశ్వర స్వామివారి సన్నిధానానికి ఒక ప్రసిద్ధి ఉంది. అదేమంటే! వివాహం కావలసినవారు లేదా సంతానాన్ని కోరుతున్నవారు, కల్యాణకంకణంతో విరాజిల్లుతూవున్న నూతన వధూవరులైన శ్రీపద్మావతీసమేత శ్రీకల్యాణవేంకటేశ్వర స్వామివారిని దరిస్తే చాలు! వరపడితే చాలు! శీఘ్రంగా తమ తమ కోరికలు నెరవేరతాయని ప్రతీతి వుంది. చాలా మంది భక్తులు అనుభవపూర్వకంగా చెబుతున్న మాట కూడా! తిరుమల యాత్రికులు తమ యాత్రను సంపూర్ణంగా ఫలప్రదం చేసుకొనే భవ్యమైన దివ్యమైన కల్యాణ ప్రదమైన క్షేత్రం శ్రీనారాయణవరం!

శ్రీవైకుంఠంనుంచి భూలోకానికి అలిగివచ్చిన శ్రీమహాలక్ష్మి, ఆకాశరాజు కూతురు 'పద్మావతి' ఒక్కరేనా! వేరు వేరా! అయితే పద్మావతి ఎవరు? ఆమె ఎలా ఆకాశరాజుకు పుత్రికగా దొరికింది. శ్రీనివాసుడు పద్మావతిని ఎలా పెళ్ళి చేసుకున్నాడు? ఇలాంటి ప్రశ్న పరంపరలకు, సందేహాలకు సమాధానం పొందాలంటే మాత్రం, మనం సుమారు ఐదువేల ఏండ్ల నాటికి వెళ్లి, ఆ దివ్యగాథను, వృత్తాంతాన్ని స్మరించుకోవాలసిందే. అత్యంత మంగళప్రదమైన శుభావహమైన ఆ ఇతివృత్తాలను నెమరు వేసుకొంటూ పునీతులమవుదాం. ఇహపర సుఖాలను సమృద్ధిగా పొందుదాం.

వీనుల విందుగా వినండి మరి!

## ఆకాశరాజు

సుమారు ఐదువేల ఏండ్ల క్రిందటి మాట ఇది!

అప్పట్లో నారాయణవరం ఒక మహానగరం! ఆ పట్టణానికి చుట్టూరా ప్రవహిస్తున్న నది, ఆరణీనది. దీన్నే అరుణానది అని కూడా అంటారు.

నవరత్న భవనాలతో మణిమయమంటపాలతో, సుందరమైన నందనోద్యానవనాలతో దేవాలయాలతో చక్కగా తీర్చిదిద్దబడిన రాజవీధులతో అలరారుతున్న ఒక దివ్యపట్టణం నారాయణవరం!

అప్పట్లో నారాయణవర పట్టణానికి రాజు మిత్రవర్మ. ఆయన పేరుకు తగ్గట్లుగా ప్రజలందరికీ మిత్రుడే. పిల్లలకూ, పెద్దలకూ అందరికీ మంచి స్నేహితుడు రాజు మిత్రవర్మ! ఆయన రాజ్యాన్ని చక్కగా పాలించుమని తన కొడుకు ఆకాశరాజుకు అప్పజెప్పాడు. ఆకాశరాజు భార్య ధరణీదేవి. నిజంగా ఆకాశరాజు మనసు ఆకాశమంత! ధరణీదేవి ఓర్పులో ధరణి (భూమి) అంత! ఆ ఇద్దరూ చూడ చక్కని జంట! ప్రజలమదిలో నిలిచిన మరచిపోలేని మంచి జంట!

అయితే ఏం!

ఆ రాజదంపతులకు ఎన్నాళ్లకీ పిల్లలే పుట్టనేలేదు. సంతానం కోసం ఎన్నో నోములు నోచారు. వ్రతాలు చేశారు. పిల్లలు పుడితేగా? ఇంతలో ఎవరో జ్యోతిష్కులు చెప్పారు. రాజా! మీరు యాగం చేస్తే సంతానం తప్పక కలుగుతుందని. ఒక్కరు కాదు, ఇద్దరు పుడతారని కూడా చెప్పారు.

## బంగారు పద్మంలో పసిపాప

సరే! ఆ ప్రయత్నం కూడా చేసి చూద్దాం. అని తలచిన ఆకాశరాజు ఒక మంచి రోజున పొద్దున్నే అరుణానదీతీరంలో యజ్ఞభూమికోసం స్వయంగా నాగలిని పట్టి పొలాన్ని దున్నాడు. అలా దున్నుతూ వున్న పొలంలో నాగేటికి భూమిలో ఏదో అడ్డు తగిలింది. దున్నడం ఆగిపోయింది. తీరా మట్టిని తీసి చూడగా అద్భుతంగా తళ తళ లాడుతూ మెరుస్తున్న పెద్ద బంగారు పద్మం బయటపడింది. మరింత విచిత్రంగా ఆ పద్మంలోని రేకులమధ్య మిల మిలలాడుతూ మెరుస్తూ వున్న ఒక చిన్ని పాప కనపడింది.



కనపడడమే కాదు. బోసి నోరుతో, చిరు కళ్లతో చిరునవ్వులు చిందిస్తూ అందర్నీ ఆశ్చర్య ఆనందాల్లో ముంచెత్తింది.

'సంతానం కోసం తపనపడే తమ కోసమే ఈ పాప దొరికింది' – అని ఆనందపడుతుండగా, ఇంతలో ఆకాశవాణి ఇలా వినపడింది. "ఔను! రాజా! అవును. ఈ బంగారుపద్మంలోని దివ్యశిశువు మీ కొరకే ఆవిర్భవించింది. అల్లారు ముద్దుగా, మురిపెంగా పెంచుకో! నీకు అంతా మంచే జరుగుతుంది."

ఆకాశరాజు ఆ పాపను అక్కున చేర్చుకొని హత్తుకున్నాడు. పురోహితులు నామకరణాన్ని అంగరంగ వైభవంగా ఘనంగా చేయించారు. బంగారుపద్మంలో పుట్టింది కనుక పద్మావతి అని, పద్మవల్లి అని, పద్మిని అని, పేర్లతో పిలుచుకోవాలని నిశ్చయించి మహారాణి ధరణీదేవికి అప్పగించాడు. తన అదృష్టానికి పొంగిపోయింది మహారాణి. 'పద్మావతి' దొరికిన వేళా విశేషం ఏమిటోకాని అనతి కాలంలోనే ధరణీదేవి గర్భం దాల్చింది. పండంటి మగబిడ్డ పుట్టాడు. ఆ పిల్లవాడే 'వసుదానుడు'. ఇలా సంతానం కలిగిన రాజు మరింత ఉత్సాహంతో రాజ్యాన్ని పాలించసాగాడు.

కాలచక్రం గిర్రున తిరిగింది. పద్మావతి పెరిగి పదహారేళ్ల కన్యగా అయింది. పద్మంలో పుట్టింది కదా! అందుకేనేమో నిజంగా ఆమె కళ్లే పద్మాలు! ముఖం కూడా పద్మమే! ఇక చేతులు, పాదాలు ఇలా అన్నీ పద్మాలలాగే సుకుమారంగా అందంగా వుండి "పద్మవల్లి" అన్న పేరుకు తగినట్లుగా నాజూకుగా తామరతీగలాగా సార్థకనామధేయురాలై వరలింది.

ఒకానొకరోజున 'పద్మావతి' తనకు చెలికత్తెలతో ప్రియమైన స్నేహితురాండ్లతో, కలిసి అరుణానదీ తీరంలోని ఉద్యానవనంలో విహరించడానికి వెళ్లింది. అందరూ నందనవన శోభను తిలకిస్తూ ప్రకృతి అందాలకు మైమరిచి వుండినారు. గట్టున కూర్చొని, ఆరణినదిలో మిల

మిల లాడుతూ ఎగసిపడే రంగు రంగు చేపల సోయగాన్ని కన్నులార్పక చూస్తూ వుండగా అక్కడికి బ్రహ్మర్షి నారదుడు "నారాయణ! నారాయణ!" అంటూ వచ్చాడు.

పద్మావతితోపాటు అందరూ నారదముని చుట్టూ చేరారు. "స్వామీ! స్వామీ! మా అందాల పసిడిబొమ్మ పద్మ చేయి చూడండి. ఈ సుందరాంగికి మంచి మొగుడొస్తాడో, పెంకె మొగడొస్తాడో చేయి చూసి చెప్పండి మునీంద్రా" అంటూ అడిగారు.

పద్మావతిని చూస్తూ, ఈ బంగారుతీగ సామాన్యురాలు కాదు. ఈమె సాక్షాత్తు మహాలక్ష్మి కళతో వుంది. ఈమెకు శ్రీమన్నారాయణుడే భర్త అవుతాడు. సందేహమే అవసరం లేదు. అంటూ అదృశ్యమయ్యాడు నారదుడు.

## చూపులు కలిసిన శుభవేళ

ఈ బొమ్మకు బ్రహ్మాండనాయకుడే మగడవుతాడంట! అంటూ ఆట పట్టిస్తూ ఉడికించారు సఖియలు. పద్మావతి సిగ్గుతో పోండే! గడుసరి పిల్లల్లారా! అంటూ వయ్యారాలు పోయింది. ఇలాగ అంగనలు అందరూ పరిహాసాలతో వేళాకోళాలతో సరసోక్తు లాడుతుండగా అంతలో ఉన్నట్టుండి "ఏనుగు ఘీంకారం" అందరి చెవుల్లో పడింది.

అందరూ ఘీంకారం వచ్చిన దిక్కుకు భయంతో చూశారు. ఇంకేముంది? తమవైపే పరిగెత్తుతూ వేగంగా వస్తున్నది. మదపుటేనుగు. తొండాన్ని పైకెత్తి ఘీంకరిస్తు వెంటపడుతున్న మదగజాన్ని చూచి దిక్కు తోచని ప్రాణభయంతో తలో దిక్కూ పారిపోతూ 'రక్షించండి! రక్షించండి!' అంటూ గట్టిగా కేకలు పెట్టారు.

పద్మావతిదేవి, ఆమె చెలులందరి అదృష్టం బాగున్నట్లు ఉంది.



వారి ఆర్తనాదాలు విని "భయపడకండి" నేనున్నాను అంటూ స్ఫురద్రూపి అయిన ఒక యువకుడు విల్లు అంబులను ధరించి, తెల్లటి గుర్రంమీద వేగంగా ప్రత్యక్షమయ్యాడు.

వెంటనే గుర్రాన్ని దిగి విల్లును ఎక్కుపెట్టి బాణాన్ని మదపుటేనుగుపై సంధించి వదిలాడు. ఆ గజరాజు భీతిల్లి తొండాన్ని నమస్కార భంగిమలో పైకెత్తి శరణు అన్నట్లుగా ఘీంకారం చేస్తూ అడవుల్లోకి పారిపోయింది.


గజరాజు భయం తొలిగినా, ఆ కన్నెపిల్లలకు గుండెదడ మాత్రం రవ్వంత కూడా తగ్గలా. అందువల్లే ఒకరికొకరు దగ్గరిగా పట్టుకొని చుట్టూ చేరి నిట్టూర్పులు విడుస్తూ అశ్వవీరుని వైపు కృతజ్ఞతగా చూస్తూ త్వత్వరగా వెనుదిరిగారు.

తనతో ఏం మాట్లాడకుండా, కనీసం కృతజ్ఞత అయినా చెప్పకుండా తిరిగి వెళ్తున్న అమ్మాయిల్ని అడ్డుకున్నాడు అందగాడైన ఆ యువకుడు. వాళ్లకి ఎదురుగా రెండు చేతులు బార్లా చాచి అడ్డంగా నిలబడ్డాడు.

రమణీ మణులారా! ఎవరు మీరు? మీకు భయం ఎందుకు? నే నుండగా ఆ ఏనుగు ఈ ఛాయలకు ఇంక రానే రాదు.

అది సరే! చుక్కల్లో చంద్రునిలాంటి ఆ కన్నెపిల్ల ఎవరు? అందానికే అందనంత దూరంలో ఉన్న ఆ అందాలభరణి, ఆ మెరుపు తీగ ఎవరు? అని పద్మావతి వైపు చూపులను సారిస్తూ ఆ యువకుడు చూస్తూ నిలబడ్డాడు.

"అయ్యా! ఎవరు మీరు. ఇది ఆకాశరాజుగారి ఉద్యానవనం. పరపురుషులు ప్రవేశించని, ప్రవేశించకూడని నిషిద్ధ ప్రదేశం. మీరు ఎలా వచ్చారు! ఎందుకు వచ్చారు? ఇది రాజస్త్రీలు విహారం చేసే నందనోద్యానవనం. ఈమె మా యువరాణి 'పద్మావతి'. ఆకాశరాజు పుత్రిక తెలిసిందా! ఇక ఏ మాత్రం ఆలస్యం చెయ్యకుండా వనాన్ని దాటి అవతలికి వెళ్ళిపోండి. మా రాజుగారికి తెలిస్తే ఇంకేమైనా ఉందా! ఏ శిక్షపడుతుందో ఊహకు కూడా అందదు" అని హెచ్చరించారు.





## తొలి వలపు

వాళ్ల మాటలను వింటూ; పద్మవల్లి జగన్మోహనాకారుడైన ఆ నవ యువకుణ్ణి కన్నార్పకుండా తదేకంగా చూస్తూ 'అబ్బా! ఎంతటి సుందరాంగుడు! ఇతడు. ఎక్కడి నుంచి వచ్చాడో ఇతగాడు' – అనుకుంటూ నిశ్చేష్టురాలై పరధ్యానంలో వుండింది.

ఆ స్ఫురద్రూపి అయిన అశ్వవీరుడు కూడా చెలికత్తెల మాటల్ని చెవులతో వింటూ, మరోవైపు తన కన్నులతో గుచ్చి గుచ్చి చూస్తూ "ఆకాశరాజు కూతురా ఈమె? పద్మావతి! పద్మావతి! ఎంత చక్కని పేరు అందానికి తగ్గట్లుగా వున్న పేరు. ఇప్పు డిప్పుడే వికసించిన లేతని ఎఱ్ఱనైన పద్మం లాంటి సొగసులను విరజిమ్ముతున్న ఈ పద్మావతి, నిజంగా అందాల రాణి! నా మనస్సును దోచుకున్న బంగారు భరణి! అని అనుకొంటూ ఆమెను పాదాలనుంచి శిరస్సువరకు కింద నుంచి పైవరకు పైనుంచి కిందికీ పదే పదే గుచ్చి గుచ్చి చూస్తూ "అబ్బ! ఎంతటి అందగత్తె ఈ సుందరాంగి" అంటూ గట్టిగానే పైకి అన్నాడు. అనడమే కాదు. పద్మావతి వైపుగా నాలుగు అడుగులు కూడా వేశాడు.

చెలులు వీరిద్దరి వాలకాన్ని గమనించారు.

ఆ ఆగంతకుడు అందంగానే వున్నాడు. ఎక్కడివాడో, ఏ ఊరో, ఏ పేరో? ఆశ్చర్యంతో అనుకొంటూ, అంతలోనే తేరుకొని

మా పద్మావతి మహారాజు ఆకాశరాజుగారి గారాలపట్టి. అమ్మో! ఇంకేమైనా ఉందా? అని వారికి భయం పట్టుకుంది. ఇక్కడి నుంచి ఎంత తొందరగా బయటపడితే అంత మంచిది మనకు అనుకుంటూ, పద్మావతిని పట్టి లాగుతూ, యువరాణీ! పద్మవల్లీ! పోదాం పదవే, అంటూ చేతులు పట్టుకొని ఈడ్చారు ప్రియసఖులు.

ఇంతలో యువరాణి పద్మావతి 'కాస్త ఆగండే! ఏమిటీ తొందర! ఒసే! ఎవరో అతగాడు. నా మనోహరుడైన ఆ సుందరాంగుడు ఎక్కడి నుంచి

వచ్చాడో తెలుసుకోండే!' అంటూ మెల్లగా చెలుల చెవుల్లో గుస గుసలాడుతూ వాళ్ల భుజాల్ని నొక్కి పట్టింది.

యువరాణి మనసును దోచుకున్న ఆ యువకుని వివరాలకోసం ఇలా హెచ్చరించారు.

ఎవరివయ్యా! నీవు మా యువరాణి పద్మావతిని అలా గుచ్చి గుచ్చి చూస్తావు. తెలిసే వచ్చావా? ఇక్కడికి? మా మహారాజుగారికి తెలిస్తే నీకు శిరచ్ఛేదమే శిక్ష! తెలిసిందా! వెళ్లు వెళ్ళు. ఇక్కడి నుంచి ఎంత తొందరగా వెళితే నీకే అంతమంచిది. నీ ప్రాణాలు నిలబడతాయి. అంటూ గట్టిగానే అరుస్తూ విసుక్కొన్నారు చెలులు.

నేను చంద్రవంశపు క్షత్రియుణ్ణి. పేరు వాసుదేవుడు. 'కృష్ణుడు' అని కూడా నన్ను పిలుస్తారు. మా తల్లి దేవకీదేవి, తండ్రి వసుదేవుడు. ఇప్పుడు వాళ్ళు లేరులే! ఒంటరివాణ్ణి. ప్రస్తుతం నేనొక్కణ్ణే ఇదిగో! ఈ వరాహక్షేత్రంపైన వుంటాను. ఈ ప్రాంతానికి వేటకోసం వచ్చాను. ఇంతలో మీ ఆర్తనాదాలు వినపడ్డాయి. ఈ తెల్లటి గుర్రంపై వచ్చా.

మీ అదృష్టం బాగుంది. నా అదృష్టం కూడా బాగుంది. మీరు ఆ మదపుటేనుగు బారినుంచి రక్షింపబడ్డారు. మీ యువరాణి "పద్మావతి"ని కన్నులారా చూచే భాగ్యం నాకు కల్గింది. అవునూ మీ యువరాణి పేరు "పద్మావతి" అన్నారు కదా! మరి "పద్మవల్లీ!" అని పిలుస్తారేమిటి? అంటూ ఆమె సౌందర్యాన్ని కన్నులారా జుర్రుకుంటూ పద్మావతిని స్పృశించడానికి దగ్గరికి వచ్చాడు అతడు.

పద్మావతి కూడా అతని స్ఫురద్రూపాన్ని కన్నులార్పకుండా చూస్తూ మైమరచి పోయింది. పరస్పరం కన్నుల్లో కన్నులు పెట్టి చూసుకొంటూ ఒకరికొకరు తాకే ప్రయత్నాన్ని చూసిన చెలికత్తెలు గమనించారు.

అవునయ్యా అవును! మా రాజుగారు తన గారాల పట్టిని 'పద్మావతీ!' అనే పిలుస్తారు. మా రాణిగారు పద్మవల్లీ! అని పిలుస్తుంది. ఇక మేం



చెలికత్తెలం మా స్నేహితురాల్ని "పద్మినీ! పద్మా! పద్దూ!" అని పిలుచుకొంటాం. అయినా ఇవన్నీ నీ కెందుకంట! వచ్చిన దారే పోకుండా. అంటూ గట్టిగా అరుస్తూ గడుసుగా కసిరారు.

వారి ఇద్దరి వాలకాన్ని గమనించిన కొందరు చెలులు వాళ్ల పరిస్థితి శ్రుతిమించి రాగాన పడకుండా పద్మావతిని రాజమందిరానికి లాక్కొని వెళ్లారు. మిగతా చెలులు అక్కడున్న రాళ్లను విసరుతూ అతణ్ణి గట్టిగా కొట్టారు. ఆ రాళ్ళ దెబ్బలకు అతని ఒళ్లంతా గాయాలై రక్తం కారింది. అతను అలాగే వెళ్లిపోయాడు.

బాగా అలసటతో, ఆలస్యంగా రాజమందిరానికి చేరుకొన్న పద్మావతిని, చెలికత్తెలను మహారాణి ధరణీదేవి కారణం అడిగింది. అయోమయంగా, ఆందోళనతో వున్న వాళ్ళను చూస్తూ అసలు ఏం జరిగింది? అంటూ గుచ్చి గుచ్చి అడిగింది, మహారాణి. వాళ్లు సరిగా చెప్పీ చెప్పక ఏనుగు ఉదంతాన్ని చెప్పి, ఒక ఆగంతకుని వల్ల రక్షింపబడ్డామని క్లుప్తంగా చెప్పి ముగించారు.

పద్మావతి వనవిహారంలో జరిగిన సంగతి అకాశరాజుకు తెలిస్తే అబ్బో! ఇంకేమైనా ఉందా! దండన తప్పదని భయపడుతునే అందరూ మౌనం వహించారు. వాతావరణం సద్దు మణిగింది. అంతటితో కథ ముగిసిందనుకున్నారు చెలికాండ్రు.

కాని అసలు కథ అప్పుడే ప్రారంభం అయ్యింది.

## ప్రేమ జ్వరం

విహారం చేసి వచ్చిన క్షణం నుండే పద్మావతికి జ్వరం వచ్చింది. ఒళ్లు బాగా వేడెక్కింది. మగతగా నిద్ర. అందులో పలవరింతలు!

ఆకాశరాజుకు వర్తమానం వెళ్లింది పద్మావతికి ఒళ్లు బాగాలేదని. వైద్యుల వచ్చారు. పద్మావతిని పరీక్షించారు. "ఒంట్లో ఏ నలతా లేదు. కాని

ఈ మానసిక ఉద్వేగానికి ఏదో హఠాత్సంఘటన కారణం కావచ్చు. మహారాజా! అంతేకాని ప్రాణభయం లేదు. ఈ మందులతోపాటు, గ్రహశాంతి కోసం అగస్త్యేశ్వరస్వామివారికి రుద్రాభిషేకం చేయించండి. ఇట్టే నయమవుతుందన్నారు.

వెంటనే అభిషేకానికి ఏర్పాట్లు జరిగిపోయాయి. తీర్థప్రసాదాల కోసం ఆ గుడికి చెలికత్తెలు వెళ్ళారు.

నారాయణవరంలో పద్మావతి పరిస్థితి ఇలా వుండగా, వేటకోసం వచ్చి పద్మావతిని చూచి వెళ్ళిన, వేంకటేశ్వరుని పరిస్థితి అంతకంటె అయోమయంలో పడింది.

రమణీమణులు విసరిన రాళ్ళతో, వొళ్ళంతా గాయాలై నెత్తురు కారుతుండగా, నీరసంగా ఉసూరు మంటూ వరాహాచలం చేరుకొన్నాడు.

తల్లి వకుళమాత, కొడుకు వాలకాన్ని గమనించింది. ఆందోళనతో ఏమిటి నాయనా! అలా గున్నావు. ఏం జరిగిందేమిటి? అంటూ లాలనగా నిమురుతూ పరామర్శించింది.

అయ్యో! వొళ్లంతా వేడిగా వుంది. జ్వరం వచ్చినట్లుంది. ఈ గాయాలేమిటి? రక్తం ఏమిటి? ఎలా జరిగిందేమిటి?

ఎవరైనా కొట్టారా! అంటూ ఎన్నో ప్రశ్నలను వేస్తూ గాయాలను తుడుస్తూ పసరు రాస్తూ, మళ్లీ మళ్లీ అడిగింది. ఏమిటి నాయనా ఇదంతా! ఇక మీదట వేటకు వెళ్లద్దు. అంటూ

'బువ్వ' కలుపుకొని వచ్చి ఇంద తిను అంటూ ముద్దలు చేతిలో పెట్టబోయింది. ఆకలి లేదమ్మా! అంటూ అన్నం వద్దన్నాడు. అయినా బలవంతంగా రెండు ముద్దలు పెట్టింది. తింటూ, తింటూ శ్రీనివాసుడు 'అమ్మా!' అంటూ పిలిచాడు.



ఏమిటి నాయనా! చెప్పు. అంది వకుళమాత.

నేను వేటకు వెళ్లాను కదా! అక్కడ అడవిలో కొందరు కోమలాంగులు కనపడ్డారు. వాళ్ళలో చంద్రునిలాగా వున్న కన్యను, అందగత్తెను చూచాను. పేరు 'పద్మావతి' అని తెలిసింది. ఆమెను చూచినప్పటినుంచి నా మనస్సు ఆందోళనగా వుంది. కాదు కాదు. నా మనస్సులో అంతటా ఆమే నిండి వుంది. ఆమె లేందే నేను బతకలేనే! పద్మావతికూడా నేనంటే ఇష్టపడుతున్నట్లే కనపడింది. తల్లీ! ఆమె ఆకాశరాజు కూతురంట! అమ్మా వింటున్నావా?

వకుళమాలిక ఉలిక్కిపడుతూ,

ఏమిటీ! నారాయణవరం ప్రభువు ఆకాశరాజు కూతురా!

యువరాణి పద్మావతిని చూచావా? ఆమెమీద మనసుపడ్డావా? నీకు మతి వుండే మాట్లాడుతున్నావా? ఏ దిక్కూ దివాణం లేకుండా కొండల్లో కోనల్లో తిరుగుతున్న వాడి వన్న సంగతి నీవు మర్చిపోయావా? దేనికైనా ఒక హద్దూ పద్దూ ఉంటుంది. ఉండాలి కూడ. రాజకన్యను కోరడం ఎంతవరకు న్యాయం? ఎవరైనా వింటే నవ్విపోతారు. చక్రవర్తికి తెలిస్తే ప్రాణాలతో బతకనిస్తాడా!

అది కాదు తల్లీ!

ఏది కాదు నాయనా! మన స్థాయి ఏమిటి? వాళ్ళ అంతస్థు ఏమిటి? తరతమ భేదం అయినా గమనించొద్దా? నవ్వినా తగినట్లు వుండాలి.

ఏమైనా సరే! అమ్మా! ఆమె లేందే నేను బతకలేనే!

ఎలారా నీతో వేగేది. వియ్య మయినా, కయ్య మయినా తగినట్లుండాల. అప్పుడే లోకులు మెచ్చు కొంటారు. లేకపోతే నలుగురూ నవ్విపోతారు. తెలిసిందా?

అమ్మా! నాకూ, పద్మావతికీ జన్మజన్మల సంబంధం ఉంది. ఇది నిజం. ఒక్క పద్మావతికి మాత్రమే కాదు.

నీకూ, నాకూ, పద్మావతికీ యుగయుగాల అనుబంధం వుంది. చెబుతాను. విను మరి!

అలాగా! అంటూ ఆశ్చర్యంగా కండ్లను పెద్దవిగా చేసి, శ్రీనివాసుని వైపు చూస్తూ వినసాగింది. వకుళాదేవి.

## యశోదవే నీవు

తల్లీ! నీవు ద్వాపరయుగంలో నన్ను పెంచి పెద్ద చేసిన యశోదవు. నందుని భార్యవు. నీ చనుబాలను తాగుతూ, నీ చేతి వెన్న ముద్దలను తింటూ, ఎన్నో లీలల్ని చూపుతూ, ఎందరో రాక్షసుల్ని మట్టుబెట్టిన అప్పటి యశోదాకృష్ణుణ్ణి నేనే! ఆ యశోదవే నీవు. తెలిసిందా!

నీ దగ్గర పెరిగి పెద్దయ్యాక మధురకు వెళ్లాను. కంసవధ చేసిన తర్వాత మళ్ళీ వ్రేపల్లెలో వున్న యశోదానందుల వద్దకు రాలేకపోయాను. మధురలోనే నన్ను కన్న తల్లిదండ్రులైన దేవకీవసుదేవుల వద్దే నాకు చదువు సంధ్యలు సాగాయి. పెళ్లిళ్లు జరిగాయి.

అప్పట్లో యశోదాదేవి 'కన్నయ్యా! నేను నిర్భాగ్యరాలిని, పెంచి పెద్ద చేశాను. కాని నీకు ఒక్క పెళ్లి అయినా చెయ్యలేకపోయాను. కనీసం చూచే యోగం కూడ లేని దురదృష్ట వంతురాలిని. నావంటిది ఏ లోకంలోనూ వుండదు. వుండకూడదు కూడ" అంటూ విలపించిన యశోదకు, దేవకీనందనుడైన నేను ఆనాడు వరం ఇచ్చాను. "అమ్మా! నేను కలియుగంలో వేంకటాచల క్షేత్రానికి శ్రీనివాసుడిగా వస్తాను. నీవు అప్పటికే "వకుళమాతగా" వచ్చివుంటావు. నీ చేతుల మీదుగానే నా పెళ్లి జరుగుతుంది" అన్నాను.

అప్పటి యశోదవు నీవేనే తల్లీ! వకుళమాలికవై ఈ వరాహక్షేత్రంలో నన్ను సేవిస్తున్నావు. అప్పట్లో నేనిచ్చిన మాట ప్రకారమే ఇప్పుడు జరుగబోతున్నది తల్లీ!



సరే! బాగుంది నాయనా! బాగుంది. నీవేమో ద్వాపరయుగం నాటి నా కన్నయ్యవు. నేను యశోదమ్మను. చాలా ఆనందంగా ఉంది. నీవు చెప్పే ఆనాటి కథను కళ్లకు కట్టినట్లుగా చూపిస్తూ వివరించావు. బాగుంది.

మరి పద్మావతి ఎవరు? ఆకాశరాజు, ఆయన భార్య ధరణీదేవీ మన మాటల్ని నమ్మవద్దా? నమ్మక పోగా కీడు చేస్తేనో! ప్రాణాంతకం కదా!

అమ్మా! నీవన్నది నిజమే. అది సామాన్య మానవుల విషయంలో మాత్రమే. పద్మావతి మానవ స్త్రీ కాదు. అయోనిజ! సాక్షాత్తు లక్ష్మీదేవి అంశతో ఆకాశరాజుకు కుమార్తెగా దొరికింది. ఆ రాజు పెంచాడు. అంతే! ఆమె పూర్వజన్మ వివరాలను చెబుతాను విను.

## ఆ వేదవతే - ఈ పద్మావతి

ఇప్పటికి పూర్వం 27 యుగాల కిందటి మాట!

అమ్మా వకుళమాతా! అప్పటి ఆ పేర్లతోనే కథను చెబుతాను. విను

త్రేతాయుగంలో శ్రీమహావిష్ణువు శ్రీరామునిగా పుట్టిన సమయం అది. ఆ నాళ్ళల్లో మయుడు అనే విప్రుడు నిరంతరం వేదాలను వల్లె వేస్తూ వుండేవాడు. ఎప్పుడూ వేదం మాటే తప్ప మరో ధ్యాస గానీ, ఊసు గాని ఆయనకు తెలియవు. ఉండేవి కావు.

ఒకప్పుడు ఆ బ్రాహ్మడు వేదం వల్లిస్తూ పోతుండగా, 'ఊర్వశి' అనే అప్సరస కంట బడింది. ఎన్నో అందాలను ఒలకబోస్తున్న ఆ ఒయ్యారి భామను చూడగానే పాపం ఆయనకు అంతులేని మోహం కలిగింది. మనస్సు చలించింది. అంతే. ఆ వేదాధ్యయన సంపన్నునికి వెంటనే వీర్యస్ఖలనం అయ్యింది. అందులోంచి ఒక ఆడపిల్ల సద్యోజాతగా (వెంటనే) ఆవిర్భవించింది. ఆయనకు వేదమంటే ఇష్టం కదా! లక్ష్మీదేవి అంశతో

పుట్టిన ఆ పిల్లకు "వేదవతి" అని "వేద లక్ష్మి" అని పేరు పెట్టుకొని పెంచి పెద్ద చేశాడు.

లావణ్యంతో తూనీగలాగా తిరుగాడుతున్న యువతిని, ఆ వేదవతిని ఒకసారి లంకాధిపతి రావణుడు చూశాడు. వెంటబడ్డాడు. బలాత్కరించబోయాడు.

ఓరీ! రావణా! నీవు పరస్త్రీని తాకినట్లయితే చాలు. బూడిద అయిపోతావు. అంటూ శాపనార్థం పెట్టి వెంటనే తానూ మంటల్లో దూకింది. కాని అగ్నిదేవుడు 'వేదవతిని' రక్షించి తన సంరక్షణలోనే వుంచుకొన్నాడు.

ఆ తర్వాత చాన్నాళ్లకు సీతాలక్ష్మణులతో శ్రీరాముడు అరణ్యవాసానికి వచ్చాడు. ఆ సమయంలోనే ఒక్కతిగా వున్న సీతను రావణుడు లంకకు ఎత్తుకెళ్లాడు. అలా సీతను తీసుకెళుతున్న రావణుడికి, అగ్నిదేవుడు ఎదురుపడి రావణా ఎవరీమె? అని అడిగాడు. శ్రీరాముడి భార్య సీత అని లంకేశ్వరుడు పల్కగా, కాదు కాదు. ఆమె సీత కానే కాదు. రావణా! ఎక్కడో పొరపడ్డావు. అసలైన 'సీత' నా దగ్గర వుంది. నీకు ఇష్టమైతే చూడు. అంటూ అప్పటి వరకు తన దగ్గరవున్న వేదవతిని చూపి, నమ్మించాడు. అసలు సీతకు బదులుగా 'వేదవతి'ని రావణునికి అప్పజెప్పాడు. లంకలో అసలు సీతకోసం 'వేదవతి' అశోకవనంలో వుండింది.

రావణ సంహారానంతరం వేదవతి 'అగ్ని ప్రవేశం' చేసిన సమయంలో అగ్నిదేవుడు ఈమె లంకలోవున్న వేదవతి అని, అసలు సీతాదేవి తన దగ్గరే ఇంతకాలం వుండిందని అంటూ ఇద్దర్నీ చూపించాడు.

ఇది నిజం స్వామీ! అంటూ సీతాదేవి శ్రీరాముని దగ్గరకు వచ్చి, తన కోసం లంకలో కష్టాలను అనుభవించిన వేదవతిని పెళ్లి చేసుకొమ్మని కోరింది. అందుకు శ్రీరాముడు ఈ అవతారంలో ఏకపత్నీ వ్రతం నా నియమం. అందువల్ల రాబోయే 28వ కలియుగంలో వేంకటాచలపతిగా అవతరించినపుడు ఈ వేదవతి ఆకాశరాజు పుత్రికగా 'పద్మావతి' అనే పేరుతో



అవతరిస్తుంది. ఆ యుగంలో ఈమెను తప్పక పెండ్లి చేసుకొంటాను" అని రాముడు మాట ఇచ్చాడు.

అమ్మా! వకుళమాలికా! అప్పటి వేదవతి నేడు ఆకాశరాజుకు యజ్ఞభూమిలో బంగారు పద్మంలో అయోనిజగా దొరికి "పద్మావతి'గా పిలువబడుతున్నది. ఆ శ్రీరాముణ్ణే నేను, శ్రీనివాసుణ్ణి. ఆనాటి మాట ప్రకారం మా ఇద్దరి పరిణయం నీ చేతుల మీదుగానే జరగాలి.

అమ్మా! నీవు ముందుగా కపిలతీర్థంలోని శ్రీకామాక్షీ కపిలేశ్వరస్వామి వారలను దర్శించి ప్రార్థించు. అన్నీ సవ్యంగానే జరుగుతాయి.

అంతకంటె భాగ్యం ఏముంది నాయనా? అంటూ, పరంధాముని పెళ్ళికి పిల్లను అడగడానికి నారాయణవరానికి బయలుదేరింది వకుళమాత. తొలుత కపిలతీర్థంలోని శ్రీకామాక్షీకపిలేశ్వరులను సేవించిన వకుళమాత స్వర్ణముఖీ తీరంలోని శ్రీశుకమహర్షి ఆశ్రమాన్ని సందర్శించి, నారాయణవర నగరానికి చేరుకొంది. ఆ నగర శివార్లలో అరుణానదీ తీరంలో వెలసిన శ్రీమరకతాంబికా సమేత శ్రీఅగస్త్యేశ్వరస్వామివారి దర్శనం చేసుకొని ఆ ఆలయ మండపంలో సేదదీరింది.

ఇంతలో పద్మావతికి స్నేహితురాండ్రు కొందరు ఆ ఆలయానికి వచ్చారు. పెద్దయోగినిలాగా వున్న వకుళమాతకు నమస్కరించి, ఆమె పక్కనే కూర్చున్నారు. పద్మావతికి కలిగిన మానసిక రుగ్మత, జ్వరం పరిహారంకోసం శ్రీ అగస్త్యేశ్వరస్వామివారి అభిషేకతీర్థం కోసం వచ్చినట్లుగా వాళ్లు మాట్లాడుకొనే మాటలద్వారా తెలుసుకుంది వకుళమాత.

వాళ్లతో మాటా మంతీ కలిపిన వకుళమాత, తాను నారాయణ వరానికి వస్తున్నట్లుగా చెబుతూ, తనకు మహారాణితో పరిచయం చేయించగలరా! అని అడిగింది. అలా చేస్తే మీ యువరాణికి నయమవుతుందని పలికింది. ఆ చెలులు ఒకరి మొగా లొకరు ఆశ్చర్యంగా చూసుకొంటూ, అందరూ 'సరే' అన్నారు. వాళ్ళందరితో పాటు నారాయణవరానికి బయలుదేరింది.





## ఎరుకలసాని

వకుళమాత తాను చెప్పినట్టు, కొండ దిగి వెళ్లగానే, ఆమెకంటె ముందుగా శ్రీనివాసుడు "ఎరుకల సాని" వేషంతో నారాయణవరంలో ప్రవేశించినాడు.

పాత ముతకచీరను కట్టుకొని ఆ చీరకొంగులోనే బ్రహ్మదేవుణ్ణి చిన్నపిల్లవాణిగా చేసి, మూపుమీద కట్టుకొని, కొప్పున కొండమల్లెల దండతో నిండు ఆడుతనంతో అడుగులు వేసినాడు శ్రీనివాసుడు. కాదు కాదు. అడుగులు వేసింది. ఏడుకొండలమీది ఎరుకత! మెడనిండా నల్లపూసల పేరులతో ముఖంపైన పెద్దకుంకుమబొట్టు, ముక్కుకు సత్తుముక్కెర,చేతినిండా గలగలలాడే మట్టిగాజులతో, 'టణ్ - టణ్' అని మోగే కాళ్ళకడియాలుఘట్టెలతో, నిగనిగలాడే నల్లని మేని మెరుపుతో, చేతిలో ఎరుక చెప్పే "కోల"తో వయ్యారంగా కులుకుతూ నారాయణవరం సందుల్లో, గొందుల్లో 'ఎరుకమ్మ ఎరుకో ఎరుక' అంటు వీథుల్లో కేక పెడుతూ తిరుగసాగింది.

ఆ ఎరుకలసాని సొంపైన నడకలతో, 'సోది సెబుతానమ్మ సోది. ఉన్నది ఉన్నట్లు సెబుతాను, జరిగిందీ సెబుతానె తల్లి, జరుగబొయ్యేది సెబుతాను' అంటూ దీర్ఘాలు తీస్తూ నయగారాలు పోతూ, నోటినిండ తమలపాకుల్ని నములుతూ వీథులంబడి నడుస్తున్న ఆ ఎరుకత సోయగాన్ని చూచి తీరాల్సిందే!

ఆ ఎరుకత సంగతి రాణికి తెలిసింది.

"ప్చ్! అంటూ మగతగా పడుకొన్న పద్మవల్లిని చూస్తూ – ఇలా వేదన పడింది.

"మెరుపుతీగ లాంటి పిల్ల! ఇలా అయింది. తిండీ లేదు. తిప్పలూ లేవు! ఎన్నో మందు లిచ్చాం. మంత్రాలు వేయించాం. కొంచం గూడా నయం కాలేదు. సరికదా రోగ మేంటో అంతుబట్టనే లేదు. ఏ గాలో ధూళో

ఏమో! ఆ ఎరుకత అయినా చెబుతుందేమో! చూద్దాం" అనుకుంటూ ఆమెను అంతఃపురానికి పిలిపించింది మహారాణి ధరణీదేవి.

సోదికత్తెకు ఎదురుగ్గా పద్మావతిని కూర్చోబెట్టారు. మాయలమారి సోదెమ్మ అయిన శ్రీనివాసుడు రెప్పవేయకుండా పద్మావతిని చూస్తూ 'కొండదేవర మీద ఆన! ఉన్న దున్నట్టు సెబుతానె. కాదు కాదె నేం జెప్పేది నిజంగా నిజమవుతాదె తల్లె! అమ్మా! రాణెమ్మగోరు! చాట్లో చాఁటేసి ముత్యాలు తెప్పించె తల్లె. సత్తెమె వినిపిస్తాను. రత్నం లాంటి పిల్ల, కళ దప్పిందె తల్లె! సూడండ్రి తల్లె. ఇదిగోవె తల్లె! ఈ గవ్వలపెట్టె ఉంది. జూసినావ్ గంద! దానిమింద చేతులు ఆనించి మొక్కోవె కూన! సక్కంగ గూకోవె తల్లె! నీ పురసేత్తో ఈ కోల కొనను పట్టుకోవె తల్లె!

ఇదిగో సెబుతున్న సోది. గమనం బెట్టి ఇనుకోండ్రి మరి! అంటూ పద్మావతి ఎడమ చేతితో పట్టుకొన్న కఱ్ఱ అవతలి కొనను ఎరుకలి పట్టుకొని అటూ ఇటూ ఊపుతూ "కొండదేవర మీద ఆన!

ఈ పెంటికూనను ఒక మగరాయండు జూసిండె! ఏడుకొండల మీది కొండదేవరమీద ఆన! అప్పటినుంచే ఈ చుక్కపై మనసు పారేసుకున్నాడే తల్లె! అంతెగాదె తల్లె! ఈ ఆడకూన గూడ ఆ మగరాజుమీంద మనసు పడ్డాదె. ఇది నిజం తల్లె! మా కొండదేవర సాచ్చిగా నేం జెప్పేది నిజం తల్లె!

ఏందె కూన! అట్టా జూత్తవ్. మరి! నేం జెప్పేది అపద్దమయితే తలకాయి అడ్డంగా దిప్పె తల్లె!

సూడు సూడండ్రి బాగా జూడండ్రి. ఎట్టా సిగ్గు పడుతుందో!

మా కొండదేవర సాచ్చిగా జెప్తున్నా. వాళ్లిద్దరు ఒకరి కొకరు పుట్టిండ్రే! వాళ్లకి మనుం జేస్తే అన్నీ సక్కబడతాయి మల్లె! ఏందె తల్లె! అనుమానంగ జూస్తుండవ్! ఆ సక్కనోడు ఎవురనె గద. నీ అనుమానం! సాచ్చీకంగా అతడు ఆదినారాయణుండే తల్లె! అందరికీ అందనంత ఆదిదేవుడే వాడు.



మరి ఈ ఆడకూతురుగూడ ఆదిలచ్చిమి గదె! ఈ ఇద్దరికి ముడిబెట్టండ్రి. అంతే!

దానికి ఏం జెయ్యాల! ఎట్టా జెయ్యాల అని సంకటపడుతుండవ్. తల్లె! నీవేం జెయ్యపల్లా!

కాసేపట్లో ఈ పిల్లను మనుమడగడానికి ఒక అవ్వ నీ ముంగిట్లో వాలేనె తల్లె! వెంటనే ఒప్పేసుకోండ్రి!

ఇంకో ఆలోచన సెయ్యమాకండ్రి. అర్తమయ్యింది గదె! అంటూ ఆ ఎరుకలిసాని పద్మావతిని గుచ్చి గుచ్చి చూస్తూ, చేతులతో ఆమె చెంపలను నిమిరి మరింత ఊరించింది. అన్నీ బాగుంటయి తల్లె! ఆ ముత్తేలు, రత్నాలు ఎదురుబుట్టలో పొయ్యండె తల్లె! ఈ పెంటికూన ఒంటిమీద నలిగిన పాతచీర ఇయ్యండె తల్లె! ప్రియంగా కట్టుకుంటానె తల్లె!

మళ్ళీ లగ్గానికి వత్తానె! కొత్త కోకపెట్టాల. అంటూ బుట్ట సంకన పెట్టుకొని వయ్యారంగా నడుం తిప్పుకుంటూ వచ్చిన దార్లొనే వెళ్లింది మాయలమారి ఎరుకలి. కాదు కాదు ఏడుకొండల మీది 'ఎరుక' మారాజు.

సోదెమ్మ అటు వెళ్లిందో లేదో ఇటు వచ్చింది వకుళమాత. అంతః పురకన్యల వల్ల రాజమందిరంలోపలికి వకుళమాతకు సులువుగా ప్రవేశం కలిగింది. ఇంతలో ఆకాశరాజు విషయం తెలుసుకొని అంతఃపురానికి వచ్చాడు. పద్మావతి ఆందోళన పరిస్థితిని గమనించి రాణితోను, మంత్రి పురోహితులతో చర్చించాడు. ఇంతలో అక్కడికి వచ్చిన వకుళాదేవిని సాదరంగా ఆహ్వానించి ఆదరించాడు.

## వివాహ నిశ్చయం

వకుళమాలిక చక్రవర్తికి నమస్కరిస్తూ తనను పరిచయం చేసుకొంది. తన కుమారుడు శ్రీనివాసుడు, పద్మావతి లోకకల్యాణకోసం అవతరించిన

కారణజన్ములని, పరస్పరం ఇష్టపడుతున్న వారిద్దరికీ వివాహం చెయ్యడం చాలమంచిదని అందువల్ల పద్మావతిని అడగడానికి వచ్చానని వినయంగా తెలియజేసింది.

అందుకు ధరణీదేవి, అకాశరాజుదంపతులు పరమానందాన్ని పొందుతూ త్వరలోనే వివాహముహూర్తాన్ని నిశ్చయించి తెలియజేస్తామని, ఒకేసారి ఆ వివాహానికి తరలి రావలిసిందని వకుళమాలికకు సాదరపూర్వకంగా వీడుకోలు పలికారు.

వెంటనే ఆకాశరాజు, దేవగురువు బృహస్పతిని, శుకమహర్షిని ఆహ్వానించి వారితో కూలంకషంగా చర్చించాడు. అతి దగ్గరగా వుండే వైశాఖమాసం శుక్ల దశిమీ శుక్రవారంనాడు ఉత్తరఫల్గుణీ నక్షత్రం కూడివున్న శుభలగ్నాన పద్మావతీ శ్రీనివాసులకు పెండ్లి జరిగేట్లుగా నిశ్చయించాడు మహారాజు.

వెంటనే ఆకాశరాజు ప్రార్థనపై బృహస్పతి 'శ్రీపద్మావతీ శ్రీనివాసుల" పరిణయలేఖను శుకమునీంద్రుల ద్వారా శ్రీనివాసునికి పంపారు.

వకుళమాతతో కూడివున్న శ్రీనివాస పరంధామునికి వివాహ ఆహ్వానాన్ని అందజేస్తూ శ్రీశుకులవారు "నాయనా! వివాహ శుభ వేళకు సకలదేవతా పరివారంతో నారాయణవరానికి తరలి రావలసిందని" ప్రార్థించి వెళ్లారు.

"నాయనా! శ్రీనివాసా! నీ కోరిక మేరకు పద్మావతితో నీ పెండ్లి నిశ్చయింపబడింది. ఇక ఆ కార్యక్రమాల ఏర్పాట్ల సంగతి చూడు మరి" అంటూ ప్రేమగా నిమిరింది తల్లి వకుళాదేవి.

వేంకటేశ్వరుడు వెంటనే బ్రహ్మ రుద్రేంద్రాగ్ని యమ, వరుణ, కుబేరాది దేవతా ప్రముఖులను, ఆహ్వానించాడు. సరస్వతితో పాటు బ్రహ్మ, సిద్ధివినాయకుడు, సుబ్రహ్మణ్యస్వామి, పార్వతిదేవితో కలిసి పరమేశ్వరుడు అష్టదిక్పాలకులు వచ్చారు. ఇంకా కశ్యపుడు, అత్రి, భరద్వాజుడు,



వామదేవుడు, గౌతముడు, విశ్వామిత్రుడు, వశిష్ఠుడు, వాల్మీకి, జమదగ్ని పుత్రుడు పరశురాముడు, పులస్త్యుడు, దధీచి, శునశ్శేపుడు, గాలవుడు, గర్గుడు మున్నగు మహర్షులూ, ఎందరెందరో చక్రవర్తులు ఇలా ఎందరో అన్ని లోకాలవాండ్లు భూలోకంలో ప్రత్యక్షంగ జరుగుతున్న శ్రీనివాసప్రభువుల పెండ్లివేడుకలను చూచి ఆనందించడానికి వేంకటాచలం చేరుకొన్నారు. పెండ్లి పిలుపులు వున్నవాండ్లూ వచ్చారు. పిలుపులు లేకపోయినా వచ్చారు. దేవుని పెండ్లికి పిలుపు లెందుకు? దేవుడి పెండ్లికి అందరూ పెద్దలే అందువల్ల పెండ్లి సంగతి తెలిసినవాండ్లంతా వచ్చారు.

వీళ్లందరికోసం వారి వారికి అనుగుణంగా భవనాలను, కుటీరాలను, ఆశ్రమాలను నిర్మించుమని విశ్వకర్మ మయుణ్ణి ఆదేశించాడు శ్రీనివాసుడు. క్షణంలో మయబ్రహ్మ అందరికీ అన్ని విధాలైన ఏర్పాట్లతో పాటు శ్రీనివాసుని పెండ్లి కుమారునిగా చెయ్యడంకోసం ప్రత్యేకంగా ఒక కల్యాణవేదికను సృష్టించడమేగాక సప్తగిరి సానువులను అద్భుతంగా ఆశ్చర్యంగా, ఆనందం కలిగేట్లుగా వివాహనగరాన్ని లోకోత్తరంగా తీర్చిదిద్దాడు.

అలాగే ఆకాశరాజు మయశిల్పిని ఆహ్వానించి నారాయణవర నగరాన్ని పద్మావతి పరిణయపురంగా అందాలనగరంగా నిర్మించవలసిందని ప్రార్థించాడు. మయబ్రహ్మ అందుకనుగుణంగా అపూర్వంగా, అందరికీ అన్ని విధాలైన భవనాలతోపాటు, వివాహ వేదికగా ఒక మణి మయమండపాన్ని 'న భూతో న భవిష్యతి' అన్నట్లుగా నిర్మించాడు. పురవీథులన్నింటినీ స్వాగత తోరణాలతో అమోఘంగా శోభాయమానంగా తీర్చిదిద్దాడు.

## పెండ్లి వేడుకలు

తిరుమలక్షేత్రంలో వేంకటేశ్వరుడు తన వివాహవేడుకలకు వచ్చిన దేవతలందరికీ ఇలా విన్నవించుకున్నాడు.

లోకకల్యాణంకోసం భూలోకం చేరుకొన్న తాను, పద్మావతిని వివాహమాడుతున్నానని, అందుకోసం వచ్చిన సమస్తలోకాలవాండ్లు పెళ్లివేడుకలను సుసంపన్నం చేయవలసిందని ప్రార్థించాడు.

కుమారస్వామి పెళ్లికి వచ్చిన వారందరికీ స్వాగతం పలికాడు. వసతులు ఏర్పాటు చేశాడు. పరమేశ్వరుడు వచ్చిన ప్రతి ఒక్కరినీ పల్కరించి సత్కరించాడు. అగ్నిదేవుడు వంటబ్రాహ్మణుడై రుచికరంగా వంటలను తయారుచేయడానికి మడిగట్టుకొన్నాడు. వరుణదేవుడు నీళ్ల బ్రాహ్మడిగా సేవలందించడానికి సిద్ధమయ్యాడు.

అంతలో పార్వతీదేవి, సరస్వతీదేవి శ్రీనివాసుణ్ణి పెండ్లికొడుకుగా చేయడానికి పూనుకొన్నారు. ఈ శుభసమయంలో శ్రీమహాలక్ష్మి దగ్గరవుంటే బాగుండేది కదా! అని విచారంతో శ్రీనివాసుడు తన మదిలోని మాట గట్టిగానే పైకి అన్నాడు. ఈ మాటను విన్న బ్రహ్మదేవుడు వెంటనే ఎందుకింత ఆలోచన. ఇప్పటికైనా మించిపోయింది ఏమీ లేదని చెబుతూ, ఎవర్నైనా పంపుదాం అన్నాడు. సరేనంటూ శ్రీనివాసుడు సూర్యుణ్ణి పిలిచి కొల్హాపురక్షేత్రంలో వున్న శ్రీమహాలక్ష్మి దగ్గరికి వెళ్లి, శ్రీనివాసుడు కొంచెం అస్వస్థతగా వున్నాడని, నిన్ను చూడదలచుకొన్నాడని చెప్పి, వెంటనే పిలుచుక రమ్మన్నాడు.

శ్రీనివాసుని ఆజ్ఞమేరకు సూర్యభగవానుడు కొల్హాపురం వెళ్లి శ్రీనివాసుని కోరికను తెలియజేశాడు. అబ్బ! ఎన్ని రోజులకు నా స్వామిదర్శన భాగ్యం అని ఆనందిస్తూ లక్ష్మీదేవి వేంకటాచలానికి చేరింది. అక్కడ చేరివున్న సమస్త లోకాలవాండ్ల కోలాహలం, మంగళవాద్య ఘోషలు విని వేంకటాచలపతిని శ్రీమహాలక్ష్మి ఏమిటని ప్రశ్నించింది.

అంత శ్రీనివాసుడు మహాలక్ష్మి చేతిని తన చేతిలోనికి తీసుకొని అనునయిస్తూ లక్ష్మీ! త్రేతాయుగంలో నేను రాముడిగా, నీవు సీతగా వున్నప్పటి సంగతి నీకు జ్ఞాపకం వుంది కదా! నీ ఆనతి ప్రకారమే ఆనాటి వేదవతిని



అంటే, ఇప్పటి 'పద్మావతి'గా వివాహం చేసుకుంటున్నాను. అందువల్ల నీ రాకతో భూలోకంలో ముఖ్యంగా ఈ 28వ కలియుగంలో జరుగుతున్న ఈ కల్యాణం అనంతమైన శోభలతో ప్రకాశిస్తున్నదని అన్నాడు శ్రీనివాసుడు.

అందుకు శ్రీమహాలక్ష్మి కూడా పాత అలుకను మరచి, తను లేకపోయినా ఈ భూలోకంలో తన స్వామి ఒంటరివాడుగా బాధపడకుండా వుంటే చాలని సంతోషించింది. పార్వతీ, సరస్వతులతోపాటు తానూ శ్రీనివాసస్వామికి తలంటి నలుగుపెట్టి అభ్యంగన స్నానాదులను చేయించింది. తన స్వామికి స్వయంగా కల్యాణతిలకం దిద్ది పెండ్లి కొడుకును చేసింది కొల్హాపురం నుంచి వచ్చిన శ్రీమహాలక్ష్మి.

ఇంతలో పురోహితుడైన బ్రహ్మదేవుడు ఇలా అన్నాడు. "అయ్యా! కొత్త పెండ్లికొడుకా! కొండలరాయా! ఏమీ తినకుండా పర కడుపున, పెండ్లివాండ్లు నారాయణవనానికి తరలి వెళ్లడం పద్ధతి గాదు. తొందరగా వంటలు చేయించు. భోంచేసి వెళ్దాం".

అలాగా! ఇన్ని కోట్లమందికి నేనెలా సంతర్పణ చేసేది. అని చింతిస్తుండగా, శుభంకరుడైన శివుడు "నాయనా వేంకటేశా! ఇల్లు కట్టేవాడు, పెండ్లికి పూనుకొన్నవాడు మధ్యలో ఆపకూడదు. అప్పు అయినా చేసి వాటిని పూర్తి చేసుకోవాలి" అని హితవు పలికాడు.

సరే! అంటూ, కుబేరుణ్ణి పక్కకు పిలిచి, నా పెళ్లికి తగిన ధనాన్ని అప్పుగా ఇవ్వవయ్యా! అని వేంకటేశుడు అడుగగా, కుబేరుడు, ఇస్తాను. సాక్షి సంతకాలతో అప్పు పత్రం రాసివ్వు అన్నాడు.

తిరుమలక్షేత్రంలో స్వామిపుష్కరిణి పడమటి తీరంలో వున్న అశ్వత్థవృక్షం క్రింద కూర్చున్నారు. "కలియుగం విలంబినామ సంవత్సరం వైశాఖ శుక్ల సప్తమిరోజున కుబేరుని వద్ద, నా పెళ్లికోసం శ్రీరామముద్రగల పద్నాలుగు లక్షల నిష్కాలను అప్పుగా తీసుకుంటున్నాను. ఈ సంవత్సరం మొదలు

వెయ్యేండ్ల లోపల అస్సలుతో పాటు వడ్డీని చెల్లిస్తాను అని నేను స్వయంగా రాసి సంతకం చేసి ఇస్తున్న బాకీ చీటి ఇది. దీనికి మొదటి సాక్షి బ్రహ్మదేవుడు! రెండవ సాక్షి పరమశివుడు! మూడవ సాక్షి తాము కూర్చున్న అశ్వత్థవృక్షం!"

అంటూ అప్పు పత్రాన్ని రాసిచ్చాడు. ఆ ధనంతో వెంటనే సర్వదేవతలకు ఆహారాలు సంభారాలు తెప్పించారు.

వంట బ్రాహ్మడైన అగ్నిదేవుడు తీర్థాలన్నింటిని పాత్రలుగా చేసి కమ్మని వంటలను వండి సిద్ధం చేశాడు. స్వామిపుష్కరిణిలో అన్నం, పాపనాశనతీర్థంలో పప్పు, ఆకాశగంగాతీర్థంలో పరమాన్నం, దేవతీర్థంలో కూరలు, తుంబురుతీర్థంలో చిత్రాన్నం, కుమారధారాతీర్థంలో పంచభక్ష్యాలు, పాండవతీర్థంలో చారు, మిగిలిన తీర్థాల్లో పచ్చళ్లు, నంజుళ్లు, తయారయ్యాయి.

అయ్యా! శ్రీనివాసా! మీకు ఇలువేల్పు ఎవరు? ముందుగా ఈ వంటల్ని ఆ స్వామికి నివేదన చేద్దాం. అన్నారు పురోహితుడైన బ్రహ్మ. అహోబల నారసింహుడే మా ఇంటి దేవుడని, వేంకటేశుడనగానే నరసింహునికి సిద్ధంగావున్న వంటలన్నింటిని మహానైవేద్యం చేశాడు బ్రహ్మదేవుడు.

పెండ్లికి వచ్చిన వాళ్లంతా వేంకటాచలం నుంచి, అహోబిలం దాకా పంక్తులుగా భోజనాలకు కూర్చొన్నారు. అందరికీ అన్నం వడ్డించగా కమ్మగా ఆరగించారు. అహో! ఏమి రుచులు. ఏమి వేంకటేశ్వరునివైభవం అనుకుంటూ అందరూ భోజనాలయ్యాక పెండ్లికొమరుడైన శ్రీనివాసునితోపాటు నారాయణవరానికి తరలి వెళ్లారు.

## ఎదుర్కోలు


నారాయణవరం పట్టణ పొలిమేరలకు చేరుకొన్న మగపెండ్లివారి నందరినీ ఆకాశరాజుదంపతులు ఎదుర్కోలుగా వెళ్ళి భక్తిపూర్వకంగా



నమస్కరించి ఘనంగా స్వాగతం చెప్పారు. పెండ్లి కొడుకు అయిన వేంకటేశ్వరుణ్ణి పట్టపుటేనుగుపైన చక్కగా అలంకరించిన అంబారీలో కూర్చోబెట్టి, మిగిలిన ముక్కోటి దేవతలను నారాయణవరంలో ప్రవేశింప చేశారు. వాళ్ల వాళ్ల స్థాయికి తగినట్లుగా ప్రత్యేక విడుదులను ఏర్పాటు చేశారు. పిదప అందరికీ కమ్మని రుచులతో విందును ఆరగింప చేశాడు ఆకాశరాజు.

ఆ సాయంత్రం ఆకాశరాజు తన భార్య ధరణీదేవితో కలిసి పెండ్లికొమరుని విడిదికి వచ్చాడు. శ్రీనివాసుని పాదపద్మాలను పరిమళ జలాలతో కడుగుతూ పూజించాడు. ఆ పాదజలాన్ని రాజు శిరస్సులపై భక్తిగా చల్లుకొని సంప్రదాయానుసారం స్వాగతవచనాలు పలికాడు. పిదప పురుషోత్తముడైన శ్రీనివాసునికి వరపూజ చేసి సుగంధ ద్రవ్యాలతో కూడిన తాంబూలాన్ని సమర్పించిన తర్వాత శ్రీనివాసుణ్ణి భద్రగజంపైన ఎక్కించి సకలదేవతలు వెంట నడుస్తుండగా, మంగళవాద్యాలు మోగింపబడుతుండగా వేదపారాయణలతో, సువాసినులు మంగళగీతికలతో సువాసనలు కలిగిన పుష్పాలు చల్లుతూండగా రాజు రాజభవనానికి పిలుచుకొని వచ్చాడు. అక్కడ శోభాయమానంగా నయనానందకరంగా అలంకరింపబడిన ఎత్తైన రాతిస్తంభాలతో కూడిన దివ్యమైన కల్యాణమండపం మధ్యలో నవరత్నాలు పొదిగిన బంగారు సింహాసనంలో శ్రీనివాసుణ్ణి ఆశీనుణ్ణి చేశారు.

అంతకుముందే పద్మావతీదేవి పెండ్లికూతురిని చేశారు. అనేక దివ్యాభరణాలతో అలంకృత అయింది. నొసట కల్యాణతిలకంతో బుగ్గన కాటుక చుక్కతో నిలువెత్తు దివ్యాభరణాలతో, మెరుగుతీగలాగా ప్రకాశిస్తున్న పద్మావతి రథాన్ని ఎక్కి దానికి ముందుభాగంలో మంగళవాద్యాలు మోగుతూ మిన్నున ప్రతిధ్వనిస్తుండగా, నారాయణవర పురాధిదేవత, జగదేకమాత, సర్వలోక మహారాజ్ఞి అయిన ఆమ్నాయాక్షి గుడికి చేరుకొంది. ఆమ్నాయాలు అనగా వేదాలు. వేదాలే అక్షులు (కన్నులు)గా కలిగిన దేవత ఆమ్నాయాక్షి. అమెనే అక్కడి భక్తులు 'అవనాక్షమ్మ' అని కూడా అంటారు. ఆ జగదంబ




శ్రీపద్మావతీశ్రీనివాసుల పరిణయం



సన్నిధిలో పురోహితుల పర్యవేక్షణలో సుమంగళీస్త్రీల మంగళగీతికలతో పద్మావతిదేవి సలక్షణంగా భక్తితో 'గౌరీపూజ'ను నిర్వర్తించుకొని కొత్త పెండ్లికూతురయ్యింది.

## పద్మావతీ శ్రీనివాసుల పెండ్లి

ఇంతలో పరిణయానికి శుభఘడియ ఆసన్నం అయింది.

ఒక పక్కన నారదుడు, తుంబురుడు దేవర్షులు గానం చేశారు. ఇంకో పక్కన యక్షులు, కిన్నెరలు, గరుడులు, గంధర్వులు మున్నగు దేవజాతి స్త్రీ పురుషులు చెవికింపుగా పాటలు పాడుతూ ఆనందంగా నాట్యం చేశారు. ఎందరో ఋషులు పరిణయ వేదికకు నలువైపులా నిలబడి చతుర్వేదాలను శ్రుతికింపుగా పఠించారు. మంగళవాద్యనాదాలు ఆకాశాన్ని అంటాయి.

వాతావరణం ఎక్కడ చూచినా ఆనందంగా, కోలాహలంగా వున్న తరుణంలో నారాయణవరం దివ్యతేజస్సులతో వెలిగిపోతుండగా పరిణయ ఘట్టం సమీపించింది.

జగత్కల్యాణంకోసం, అందులోను కలియుగంలోని భూలోకవాసుల కల్యాణ పరంపరలకోసం జరుగుతున్న శ్రీపద్మావతీ శ్రీనివాసుల పెండ్లి సంబరాలను, మనోహరమైన సుందరదృశ్యాలను తిలకించడానికి సమస్తలోకాలవాండ్లు నారాయణవరం చేరుకొన్నారు. భూలోకంలో ప్రత్యక్షంగా జరుగుతున్న దేవదేవుని పెండ్లిని చూస్తే చాలు. తమ పాపాలు పోతాయి. పుణ్యాలు కలుగుతాయి. అంటూ ఎక్కడెక్కడివాండ్లు నవరత్నాలు తాపిన మణిమయమైన పరిణయ మండపానికి చేరుకొన్నారు.

కల్యాణప్రదమైన ఆ శుభవేళలో ఆకాశరాజు దంపతులు కన్యకామణి పద్మావతిని కన్యాదానం చేశారు. ఆ సందర్భంలో అల్లుడైన వేంకటేశ్వరునకు కోటి నిష్కాల ధనరాశిని, ఒక బంగారు కిరీటాన్ని, కంఠమాలలను, భుజకీర్తులను, నాగాభరణాలను రెండుచేతులకు పది ఉంగరాలను, అనేక ముత్యాలహారాలను, వజ్రాల మొలతాడు, బంగారు పాదుకలు... ఇలా

ఒకటేమిటి ఎన్నో ఎన్నెన్నో బహూకరించారు. ఇవిగాక విందు భోజనానికి బంగారుపళ్లెరంతోపాటు రెండు బంగారు నీళ్ల చెంబులను సమర్పించాడు.

ఇంకా అనేక దివ్యవస్త్రాలను, నవరత్నాలు తాపిన వజ్రకవచాన్ని ఇచ్చాడు. పద్మావతి నిలువెల్ల సాలంకృతగా వెలలేని, తులలేని నగలతో అలంకరించి శ్రీనివాసునికి కన్యాదానం చేశాడు.

ఆ సమయంలో పురోహితులు వధూవరుల గోత్రప్రవరలు ఇలా చదివారు.

"అత్రి గోత్రంలో జన్మించిన చక్రవర్తి సువీరునికి మునిమనుమరాలు, సుధర్మ మహారాజుగారి మనుమరాలు, ఆకాశరాజుగారి కూతురు పద్మావతి అను కన్యకామణిని, గోవిందా! శ్రీనివాసా! నీకు సాలంకృతంగా సమర్పిస్తున్నాం. నీవు ఈమెను ధర్మపత్నిగా స్వీకరించవలసిందిగా ప్రార్థిస్తున్నాం" అంటూ అకాశరాజుపక్షాన దేవతలగురువు బృహస్పతి గోత్రప్రవరను చదివారు.

పెండ్లికొడుకు శ్రీనివాసుని పక్షాన పురోహితునిగా వసిష్ఠమహర్షి "అయ్యా! అందరూ సావధానంగా వినండి. అమిత తేజోసంపన్నుడైన చక్రవర్తి యయాతి వశిష్ఠగోత్రజుడు. ఈయన మునిమనుమడూ, శూరసేన మహారాజు మనుమడూ, మహారాజు అయిన వసుదేవుని పుత్రుడూ అయిన శ్రీకృష్ణుడే ఇప్పటి పెండ్లికొడుకు ఈ శ్రీనివాసుడు. లోకకల్యాణంకోసం మేముఅత్యంత సంతోషంతో పరాత్పరుడు, పరమ పురుషుడైన శ్రీవేంకటేశ్వరుని వివాహార్థం కన్యాదానం స్వీకరిస్తున్నాం" అని సంబరంగా గోత్రప్రవరలు చదివినాడు.

వెంటనే ఆకాశరాజదంపతులు పద్మావతి కుడిచేతిని శ్రీనివాసుని కుడిచేతిలో ఉంచుతూ మంత్రపూర్వకంగా స్వామిపుష్కరిణీ పుణ్యజలాల ధారలతో కన్యాదానం చేశారు. చందన లేపనాదులను పట్టువస్త్రాలను బహూకరించారు.



ఇంతలో సుముహూర్తం సమీపించగా, సుమంగళీ స్త్రీల శుభప్రదమైన మంగళాశీస్సుల మధ్య మహనీయులైన వేదవిప్రుల దివ్యమంత్రాలమధ్య సమస్త దేవతా గణాలు ముత్యాలసేసలు చల్లుతుండగా శ్రీవిలంబినామ సంవత్సర వైశాఖ శుక్లదశమీ ఉత్తరఫల్గునీనక్షత్రంతో కూడిన శుక్రవారంనాడు శ్రీనివాసప్రభువు పద్మావతిదేవి గళసీమలో మంగళసూత్రధారణ చేశాడు.

ఆ తర్వాత నూతన వధూవరుల ముత్యాల తలంబ్రాలవేడుక, నాగవేలి, లాజహోమం వేడుకలు ఘనంగా జరిగాయి.

పెండ్లికి వచ్చిన వారందఱి విందుభోజనాలతో, దక్షిణతాంబూలాలతో, బహుమానాలతో ఘనంగా సత్కరించి ఆకాశరాజు అందరికీ సాదరంగా వీడ్కోలు పలికాడు.

శ్రీవేంకటేశ్వరుడుకూడా తన వివాహానికి వచ్చిన ఆహ్వానితులందరికీ విలువైన ఆభరణాలను కానుకలుగా ఇచ్చి వారిని ఆనందింపచేస్తూ ఆశీర్వదించి వీడ్కొలిపాడు.

వివాహానంతరం శ్రీమహాలక్ష్మి మళ్లీ కొల్హాపురానికి వెళ్లిపోయింది. ఆ తర్వాత నూతనవధూవరులైన పద్మావతీ శ్రీనివాసులు మూడు రోజులపాటు నారాయణవరంలో సర్వసౌఖ్యాలను ఆనందాలను పొందారు. మూడురాత్రులు నిద్ర చేసిన కల్యాణదంపతులు పద్మావతీశ్రీనివాసులు ఆకాశరాజుదంపతులు ఇచ్చిన సారెలతో ఘనంగా వీడ్కోలును పొంది వరాహక్షేత్రానికి బయలు దేరారు.

## అగస్త్యమహర్షి ఆతిథ్యం

నూతన దంపతులు శ్రీపద్మావతీ శ్రీనివాసులు, నారాయణవరం నుంచి బయలుదేరి వేంకటాద్రికి వెళుతూ దారిలో అక్కడక్కడ సుందరమైన నందనోద్యానవనాల్లో విహరిస్తూ, మనోహరమైన జలపాతాల్లో

జలక్రీడలాడుతూ ఎనలేని ఆనందాన్ని పొందారు. అలా వెళుతూ దారిలో సువర్ణముఖరీ, కల్యాణీ నదుల సంగమతీరంలోని లోపాముద్ర అగస్త్యమహామునుల ఆశ్రమవాటికను చేరుకొని ఆ ఋషిదంపతులను దర్శించుకొన్నారు.

కుంభసంభవుడైన అగస్త్యుడు నూతన కల్యాణదంపతులైన పద్మావతీ శ్రీనివాసులకు స్వాగత సత్కారాలతో ఆతిథ్యమిచ్చిన తర్వాత ఇలా అన్నాడు.

"నాయనా! శ్రీనివాసా! ఒక చిన్నమాట! మీకు తెలియనిది కాదు. అయినా లోకానికి తెలియటం కోసం, ఇతరులు పాటించటం కోసం అయినా చెప్పటం నా ధర్మం. నీవు తప్పక ఆచరించి, ఆదర్శంగా చూపవలసిన నియమం కూడ. కొత్తగా పెళ్లైన దంపతులు, వివాహం అయిన ఆరునెలల్లోపల తీర్థయాత్రలకు వెళ్లకూడదు. అలాగే పుణ్యక్షేత్రాల సందర్శనకుగాని వెళ్లడం నిషిద్ధం. అందువల్ల మీరిద్దరూ వారంరోజులు కూడ దాటని నూతనదంపతులు. వరాహక్షేత్రానికి వెళ్లడం సరి కాదు. శాస్త్ర నియమం ప్రకారం ఆరునెలలపాటు మా ఆశ్రమంలోనే వుంటూ మా ఆతిధ్యాన్ని స్వీకరించండి. మీ దివ్యసాన్నిధ్యాన్ని ప్రసాదించండి. ఇది ఆజ్ఞ కాదు. అభ్యర్థన మాత్రమే.

'అందరూ ఒక ఎత్తు, అగస్త్యులవారు ఒక ఎత్తు' అన్నట్లు మహర్షీ! అగస్త్యులవారు ఆదేశించటం, మేం అంగీకరించక పోవటమూనా! మీ మాట మాకు శిరోధార్యం. అది మా భాగ్యం కూడా.

తమ ఆశ్రమ వాటికలోనే కల్యాణదంపతులమైన మేం వేంచేసి కొంతకాలంపాటు భక్తులకు కల్యాణపరంపరలను అనుగ్రహిస్తాం. అంటూ ప్రక్కనే వున్న భక్తుడు తొండమానుని వైపు చూశాడు. తొండమానుడు ఆకాశరాజుకు తమ్ముడు. పద్మావతికి పినతండ్రి. ఆయన శ్రీనివాసుడి ఆంతరంగిక భక్తుడు. శ్రీనివాసుని చూపులతో చూపులను కలిపాడు తొండమానుడు. తమ ఆజ్ఞ ఏమిటి ప్రభూ! అన్నట్లుగా వంగి దణ్ణం పెట్టాడు.



చిన్నమామా! తొండమాను చక్రవర్తీ! ఈ ఆశ్రమంలో మేం ఆర్నెల్లపాటు వుంటాం. ఇంతలో ఆదివరాహక్షేత్రంలో మాకోసం అద్భుతమైన ఒక భవనాన్ని నిర్మించి ఇవ్వు. అన్ని హంగులతో వాస్తుశాస్త్రప్రకారం వున్న ఆ దివ్య భవనంలో మేం ప్రవేశించి కలియుగాంతం వరకు వుంటాం. నీ పేరుకూడా చిరస్థాయిగా ఉంటుంది. వెళ్లిరా! అంటూ ఆజ్ఞాపించాడు.

చిత్తం! అంటూ మరోసారి నమస్కరించి తొండమానుడు తిరుమలకు బయలుదేరి వెళ్లాడు.

ఆరునెలల సమయంలోనే "ఆనందనిలయం" అనే బంగారు విమానం కలిగిన మేడను తూర్పుముఖంగా నిర్మింపజేశాడు. దానికి ముందు ముందుభాగంలో రెండు ఎత్తైన శిఖరగోపురాలతో, మూడు ప్రాకారాలతో, ఏడు ప్రవేశ ద్వారాలతో, బంగారు ధ్వజస్తంభ, బలిపీఠాలతో, ఆస్థాన మండపం, యాగమండపం, వంటశాలలతో వాస్తు శాస్త్ర నియమబద్ధంగా సర్వాంగ సుందరంగా శోభిల్లే అద్భుతమైన భవనాన్ని నిర్మింపజేశాడు. అందులో గృహప్రవేశం చెయ్యడానికి వీలుగా సుముహూర్తం నిర్ణయంకోసం వేంకటేశ్వరునికి వర్తమానం పంపాడు తొండమాన్ చక్రవర్తి.

అగస్త్యమహర్షి అనుమతితో శ్రీనివాసుడు పద్మావతితోపాటు వరాహక్షేత్రానికి బయలుదేరుతూ మునీంద్రా! అగస్త్యమహర్షీ! లోపాముద్ర సమేతంగా పుణ్యదంపతులైన మీరు, ఈ ఆరునెలలపాటు మా యందు చూపిన భక్తి ప్రపత్తులు, ఆదరణ, ఆతిథ్యం అద్భుతం! ఆనందకరం! ఇందుకు గుర్తుగా మేము విడిది చేసిన ప్రాంతంలో కల్యాణవేంకటేశ్వరునిగా నా హృదయలక్ష్మితో అర్చారూపంలో కొలువై వుంటాను. మీ దంపతులను స్మరించుకుంటూ, నన్ను దర్శించిన వారందరికీ కల్యాణపరంపరలను ప్రసాదిస్తాను. అందువల్లే ఇది కల్యాణశ్రీనివాసమంగాపురంగా, శ్రీనివాసపురంగా, కల్యాణపురంగా వరలుతుందని వరమిస్తున్నాను. ఈ వేంకటాచలం వున్నంతవరకు ఈ కల్యాణపురం, తమ దంపతులపేరు

ప్రసిద్ధమై నిలిచి వుంటుంది. ఇక పోయివస్తాం మహాశయా! అంటూ పద్మావతీతోపాటు శ్రీనివాసుడు, లోపాముద్ర సమేత అగస్త్యమహర్షి దంపతులకు ప్రణామాలర్పించినారు.

అగస్త్యదంపతులుకూడా ఒక అనిర్వచనీయమైన ఆనందానుభూతికి లోనయ్యారు. వారి మేనులు పులకరించాయి. వారి మనస్సులు ఆర్ద్రమయ్యాయి. వారి కనులు ఆనందబాష్పాలతో నిండిపోయాయి. ఇలా ఆ భార్యాభర్తలు ఉక్కిరిబిక్కిరి అవుతూ, ప్రణామాలర్పిస్తూ దివ్యదంపతులైన పద్మావతీ శ్రీనివాసులకు వీడ్కోలు పలికారు.

పిదప వరాహక్షేత్రం చేరుకొన్న శ్రీపద్మావతి వేంకటేశ్వరులు తొండమానుడు అద్భుతంగా నిర్మించిన "ఆనందనిలయం"లో ప్రవేశిస్తూ ఇలా అన్నాడు.

తొండమాన్ చక్రవర్తీ! ధన్యుడివయ్యా! మీ అన్న ఆకాశరాజు, ఇదిగో! గృహిణిగా ఈ పద్మావతిని నాకు కన్యాదానం చేశాడు. నీవేమో గృహదానం చేశావు. మీరిద్దరూ నన్ను ఈ భూలోకంలో "గృహస్థుని"గా చేసిన అపూర్వసోదరులు. నా ఆంతరంగిక భక్తులు. మీరిద్దరూ స్థిరంగా కీర్తివంతులై ముక్తిని కూడ పొందుతారు.

ఈ పుణ్యం మీ ఇరువురి సోదరులకు ఎలా లభించిందో నేనే చెప్తాను. విను మరి!

## ఆకాశరాజు పూర్వజన్మ గాథ

మీ అన్న ఆకాశరాజు పూర్వజన్మలో ఒకప్పుడు దక్షిణకైలాసంగా పేరు పొందిన శ్రీకాళహస్తీశ్వర దివ్యక్షేత్రంలో 'మాధవుడు' అనే పేరుతో పుట్టాడు. సద్బ్రాహ్మణుడైన అతడు నిత్యం శ్రీకాళహస్తీశ్వరుని అర్చిస్తూ చంద్రలేఖ అనే భార్యతో, తల్లిదండ్రులతో కాలం గడుపుతుండేవాడు. ఇలా వుండగా ఆ విప్రవర్యుడు 'కుంతలా' అనే వేశ్యకు వశమయ్యాడు, అంతే ఆ వగలాడి



వలలో చిక్కుకున్న ఆ భూసురుడు అన్ని విధాల భ్రష్టుడై తలిదండ్రులను, చివరకు కట్టుకున్న భార్యను వదిలి వేశాడు.

వాళ్లు మరణించినారని చెప్పినా, ఆ పాపాత్ముడు విన్పించుకోలేదు. ఇంతలో ఆ వేశ్య కుంతల కూడ మరణించగా దేశాలు పట్టుకొని తిరుగుతూ, ఈ వరాహక్షేత్రానికి మొదట్లోవున్న కపిలతీర్థంలో స్నానం చేసి గతించిన తల్లిదండ్రులకు తర్పణాదులు చేసి, శ్రీకామాక్షీ కపిలేశ్వరస్వామివారలను దర్శించిన, తర్వాత పాపవిముక్తిని పొంది ఇలా ఇక్కడికి వచ్చాడు. అప్పట్లో లీలామానుష రూపంలో సంచరిస్తున్న నన్ను దర్శించి ప్రార్థించాడు.

వచ్చే జన్మలో ఆకాశరాజుగా జన్మించి, అయోనిజ అయిన "పద్మావతి"ని నాకు ఇచ్చి కన్యాదానం చేసి ముక్తిని పొందుతావని వరమిచ్చాను – తెలిసింది కదా!

ఇదీ ఆకాశరాజు కథ! ఇక నీ కథను కూడా విను మరి!

## తొండమానురాజు పూర్వజన్మ

ఈ వరాహాచలం ఇప్పటిది కాదు. ఈ నాటిది అసలే కాదు. శ్రీవైకుంఠం నాకు స్థిరవాసమైన దివ్యలోకం. కాగా, భూలోకంలో శ్రీదేవితో, భూదేవితో విహరించే దివ్యలీలావినోద స్థలం ఈ వరాహక్షేత్రం. అప్పట్లో శ్రీ భూ దేవేరు లిరువురూ ఇక్కడ ఈ పర్వతంపైన వారి పేర్లతోనే రెండు తీర్థాల్ని ఏర్పాటు చేశారు.

ఆ తర్వాత సాక్షాత్తు శ్రీకృష్ణుని రూపంలోనే దర్శించాలన్న కోరికతో గోపీనాథుడు అనే వైఖానస బ్రాహ్మణుడు భగదాదేశంతో ఈ పర్వతానికి వచ్చాడు. 'గోవిందుని'గా దర్శనమిస్తున్న నన్ను అర్చించాడు. ఆ విప్రునికి సేవకునిగా 'రంగదాసు' అనే భక్తుడు కూడా తోడయ్యాడు. పూలు, తులసి సేకరించి సమర్పించడమే ఆ సేవకుని పని. పూలతోటలకోసం రెండు బావుల్ని తవ్వాడు. ఆ రెండు బావులు కూడ ఏనాడో లక్ష్మీదేవి, భూదేవి ఏర్పాటుచేసిన తీర్థాలే. మళ్లీ బహిర్గతమయ్యా యన్నమాట.

ఒకనాడు రంగదాసు పూజకోసం పూలు తీసుకొనివస్తూ వుండగా 'స్వామిపుష్కరిణి'కి ఉత్తరం దిక్కునవున్న ఉద్యానవనంలో భార్యా సమేతంగా క్రీడిస్తున్న "కుండలుడు" అనే ఒక సుందరాకారుడైన గంధర్వుణ్ణి చూచాడు. అతనికంటె మించిన సుందరాంగులు ఆతని భార్యలు. పాపం. వాళ్లని చూచిన రంగదాసుకు మనస్సు చెదిరింది. ఎంత భోగమో కదా! అనుకొంటూ దీర్ఘాలోచనలో పడ్డాడు. దీనివల్ల పూజకు ఆలస్యమయ్యింది. అందుకు 'గోపీనాథుడు' కోపించి శాపమిచ్చాడు. నేను ప్రత్యక్షమై ఆ శాపాన్ని నేను తీసుకొన్నాను. ఆ గంధర్వునివలె నీవు మరుజన్మలో రాజుగా జన్మించి భక్తుడవై నాకు నివాస భవనాన్ని నిర్మించి ఇస్తావని రంగదాసుకు వరమిచ్చాను. ఆ రంగదాసు మరెవ్వరో కాదు. నువ్వే! తెలిసిందా తొండమాన్! ఈ జన్మలో మిత్రవర్మ (సుధర్ముడు) అనే చంద్రవంశపు రాజుకు ఒక గంధర్వస్త్రీకి కొడుకుగా ఆకాశరాజుకు తమ్మునిగా తొండమాను చక్రవర్తిగా జన్మించావు తెలిసిందా!

ఇలా మీ సోదరులిద్దరూ పూర్వజన్మ పరంపరల్లో నా భక్తులయ్యారు. అందుకే మీ ఇద్దరికీ తల్లులు వేరయినా ఒకే తండ్రి బిడ్డలుగా పుట్టేట్లుగా అనుగ్రహించాను.

"స్వామీ! శ్రీనివాసా! మా సోదరులిరువురి మీద నీ దయ అపారం! అప్రమేయం! మేం ఎక్కడున్నా, ఏ పనిలో వున్నా, నిన్ను తలంచకున్నా, మమ్మల్నిమాత్రం మరచిపోవద్దు. స్వామీ! వెళ్లివస్తాం స్వామీ!" అంటూ దండప్రణామాలు చేసి తొండమానుడు నారాయణవరానికి తిరిగి వెళ్లాడు.

## రాజ్యం కోసం తగవులాట

తిరుమల 'ఆనందనిలయం'లో పద్మావతీ శ్రీనివాసులు సుఖంగా కాపురం చేస్తూ వుండినారు. కొంతకాలానికి ఆకాశరాజు స్వర్గస్థులయ్యాడు.

నారాయణవర రాజ్యాధికారంకోసం వసుదానుడు అతని పినతండ్రి తొండమానుడు తగవులాడుకొన్నారు. తమదంటె కాదు కాదు తమదని



ఇద్దరూ కలహించారు. దీన్ని పరిష్కారం చెయ్యవలసిందంటూ ఇద్దరూ పరంధాముడైన శ్రీనివాసుణ్ణి వేడుకొన్నారు.

ఒకరేమో బావమరిది, ఇంకొకరేమో చిన్నమామే కాక తనకు అత్యంత భక్తుడుకూడా. పైగా పద్మావతికూడా తమ్మునికే సహాయం చెయ్యాలని పట్టుపట్టింది. ఆలి మాట వినని వాడు ఎక్కడైనా వుంటాడా? ఒకవేళ వున్నా వాడికి మనశ్శాంతి ఉంటుందా! అందుకే ఆనందనిలయుడు ఒక ఉపాయం ఆలోచించాడు.

"నేను వసుదానుని వైపు ఉంటాను. తొండమానుడా నా ఆయుధాలు తీసుకో. ఏం సందేహించకు" అంటూ ఇద్దర్నీ సమ్మతింపజేశాడు. ఇద్దరికీ యుద్ధం భీకరంగా సాగింది. కాని ఆ యుద్ధంలో తొండమానుడి ఆయుధ ప్రయోగంవల్ల శ్రీనివాసుడే మూర్ఛపోయాడు. పద్మావతితో పాటు అందరూ ఆందోళనపడ్డారు. యుద్ధం ఆగిపోయింది. ఇంతలో మూర్ఛదేలిన శ్రీనివాసుడు "ఇప్పటికైనా మించిపోయింది లేదు. చెరిసగం రాజ్యం పంచుకోండి. సఖ్యతగా ఉండండి" అంటూ నారాయణవరం రాజ్యాన్ని రెండు భాగాలుగా చేసి ఇద్దరికీ పంచాడు. 'నారాయణవరం' వసుదానుడికి, మిగిలిన భాగాన్ని తొండమానుడికిచ్చారు. తొండమానుడు పాలించిన భాగం 'తొండమనాడు'గా పేరుపొందింది.

## శ్రీనివాసుని కొల్హాపుర యాత్ర

పద్మావతీ శ్రీనివాసుల పరిణయం అయిన తర్వాత శ్రీనివాసుడు ఎంత బతిమాలినా వుండకుండా శ్రీమహాలక్ష్మి కొల్హాపురానికి వెళ్ళిపోయింది. ఆమె లేకుండా, తాను వుండలేననీ, ఆమె లేనిదే ఈ కలియుగంలో భక్తులకోరికలను సంపూర్ణంగా తీర్చలేనని శ్రీనివాసుడు పద్మావతితో వకుళమాతతోను చెప్పాడు. శ్రీమహాలక్ష్మిని పిలుచుకవస్తానని చెప్పి ''పద్మావతి''ని వకుళమాత సంరక్షణలోవుంచి, కొల్హాపురానికి వెళ్లాడు.

## ఆకాశవాణి

శ్రీనివాసునికి కొల్హాపురంలో మహాలక్ష్మి దర్శనమే కాలేదు. పదేండ్లపాటు నిరీక్షించాడు. కాని ఫలితం లేదు. ఇంతలో అశరీరవాణి ఇలా పలికింది, "శ్రీనివాసా! ఇక్కడ లక్ష్మీదర్శనం కలగదు. నీవు వేంకటాచలం దగ్గర సువర్ణముఖీనది ప్రక్కన శుకమహర్షి ఆశ్రమ వుంది. ఆ ప్రాంతంలో పద్మసరోవరాన్ని నిర్మించి, తపస్సు చెయ్యి. అక్కడ నీకు మహాలక్ష్మి దర్శనమవుతుంది"

## "వ్యూహాలక్ష్మి"

ఆ మాట ప్రకారం శుకమహర్షి ఆశ్రమ ప్రాంతంలో పద్మసరస్సును ఏర్పాటు చేసి పండ్రెండేండ్లపాటు మహాలక్ష్మి మంత్రంతో తపస్సు చేశాడు. కార్తీకమాసంలో పంచమిరోజున ఉత్తరాషాఢా నక్షత్రం అభిజిత్‌లగ్నంలో సరోవరంలో సహస్రపద్మంలో శ్రీమహాలక్ష్మి అవతరించింది. కనుక "పద్మావతి" పేరుతో అక్కడ అర్చామూర్తిగా ప్రతిష్ఠింపజేశాడు. ఆమెకు తిరుమలలో మాదిరే స్వతంత్రంగా ఉత్సవాలు జరుగుతాయని "స్వతంత్ర వీరలక్ష్మి" అని పద్మంపై ప్రకాశించే శ్రీకాంత కనుక "అలమేలుమంగ" అని కూడ పిలువబడుతుందన్నాడు శ్రీనివాసుడు.

మహాలక్ష్మిని హృదయంలో 'వ్యూహాలక్ష్మి'గా ప్రతిష్ఠించకొని వేంకటాచలం చేరుకొని వకుళమాతను, పద్మావతిని కలుసుకొన్నాడు. సుమారు ఇరవైరెండేండ్లపాటు ఎడబాటు అనుభవించిన 'పద్మావతి', ఇక మీదట నన్ను విడిచి ఎక్కడికీ వెళ్లవద్దని బ్రతిమాలింది. అలాగే అంటూ శ్రీనివాసుడు వేదలక్ష్మి అయిన పద్మావతిని, వక్షఃస్థలంలో "వ్యూహాలక్ష్మి"తో మిళితం చేసుకున్నాడు. వకుళమాతను కూడ తనలో ఐక్యం చేసుకొని ముక్తిని ప్రసాదించాడు.



## శిలగా మారిన శ్రీనివాసుడు

ఇలా వుండగా ఒకప్పుడు భక్తుడైన తొండమానుడు రహస్యమైన సొరంగమార్గం గుండా ఆనందనిలయంలో ప్రవేశించి, స్వామివారి పాదాలను గట్టిగా పట్టుకొని కాపాడుమని వేడుకొన్నాడు. అసలు ఏమి జరిగిందని అడిగాడు ఆనందనిలయుడు.

"రెండేండ్ల కిందట ఒకవిప్రుడు కాశీకిపోతూ అతని భార్యాపిల్లల్ని తనకు అప్పచెప్పాడనీ, కాని మతిమరుపుతో పొరపాటు జరిగినందువల్ల వాళ్లంతా మరణించారు. ఇప్పుడు ఆ విప్రుడు తిరిగి వచ్చాడు. శ్రీనివాసుని దర్శనానికి వెళ్లారని అసత్యం పలికాను" అంటూ తన దీనగాథను చెప్పాడు తొండమానుడు.

"అయ్యా! నీకు బ్రహ్మహత్యాపాపం చుట్టుకుందే. సరే, నీకోసం ఆ పాపాన్ని నేను భరిస్తాను. ఇకమీదట ఎవరికీ దర్శనమివ్వను, ప్రత్యక్షంగా మాట్లాడను" అంటూ ఆ విప్రకుటుంబాన్ని బ్రతికించినాడు. ఆనాటి నుంచి "వక్షఃస్థల వ్యూహాలక్ష్మి"తో శ్రీనివాసుడు, "కలౌ వేంకటనాయకః" అన్న ప్రసిద్ధితో ఈ కలియుగంలో "పిలిస్తే పలికే ప్రత్యక్షదైవం"గా "కోరిన వరాలరాయుడి"గా సార్థక నామధేయంతో వరలుతూ సాలగ్రామ శిలా విగ్రహమూర్తిగా దర్శనమిస్తున్నాడు.

అదే భూలోక వైకుంఠంగా భాసిల్లుతున్న తిరుమలకొండ! అందుకే అన్నమయ్య.

**కట్టెదుర వైకుంఠము కాణాచయనకొండ!**
**తెట్టెలాయ మహిమలే తిరుమలకొండ!!**

అంటూ ఆ క్షేత్ర ఔన్నత్యాన్ని తెలియజేశాడు.

**ఓం నమో వేంకటేశాయ**

* * * *

## పరిణయ మండపమే శ్రీవారి ఆలయం

ఆకాశరాజు ధరణీదేవుల పర్యవేక్షణలో, ముక్కోటిదేవతల సమక్షంలో, ఒక వైపు దేవగురువు బృహస్పతి, మరోవైపు వసిష్ఠ మహర్షి ఆచార్యకత్వంలో అంగరంగవైభవంగా పద్మావతీ శ్రీనివాసుల పరిణయం నిర్వహింపబడింది. అద్భుతమైన ఆ మణిమయమైన పరిణయవేదికను తర్వాతి తరాలకు నిత్యదర్శనీయంగా ఉంచాలని తలంచిన ఆకాశరాజు, ఆ మండపాన్ని దివ్యమైన ఆలయంగా తీర్చిదిద్దాడు.

ఆ ఆలయంలో శ్రీనివాసుడు కుడిచేతికి కల్యాణకంకణంతో పెండ్లికుమారునిగా, నొసటన చక్కని, సన్నని నామంతో శంఖుచక్రాలను ధరించి, రెండు నేత్రాలను తెరచి భక్తులను అనుగ్రహిస్తున్నాడు. నడుముకు దశావతారవడ్డాణం సాలగ్రామ హారాలు, వేటఖడ్గంతో నవయువకుడైన శ్రీవేంకటేశ్వరునితోపాటు వాస్తుపద్ధతిలో నిర్మింపబడిన ఈ ఆలయంలో శ్రీ పద్మావతి అమ్మవారు కొలువై వున్నందున ఈ స్వామి శ్రీ పద్మావతీ సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామిగా ప్రసిద్ధిని పొందినాడు.

అందువల్లే శ్రీనారాయణవరంక్షేత్రం శ్రీపద్మావతి సమేత శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారి దివ్యక్షేత్రంగా భాసిస్తూ సమస్త కోరికలను సిద్ధింపజేయడంతో పాటు, ముఖ్యంగా వివాహం కావలసినవారికి వివాహం, సంతానం కావలసినవారికి సంతానం కలగుతుండడం, ఈ క్షేత్రంయొక్క ప్రత్యేకమైన మహిమ ప్రసిద్ధి కూడా!

* * *

ఆనాటి శ్రీపద్మావతి శ్రీనివాసుల పరిణయ వేదికే నారాయణవరం క్షేత్రంలోని నేటి శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయం! ఆ ఆలయంతోపాటు, నారాయణవరంలోని ఆనాటి ఇతర ఆలయాలను గూర్చి తెలుసుకుందాం - రండి! నడవండి!!

## ఆలయాల నగరం! శ్రీనారాయణవరం!!

సుమారు ఐదువేల ఏండ్ల నుండి పాండవుల వంశపరంపరలోనివారై చంద్రవంశచక్రవర్తులైన ఎందరో రాజులు నారాయణవర మహానగరాన్ని రాజధానిగా చేసుకొని సుభిక్షంగా పరిపాలించారు. ఆ క్రమంలోనే ఆకాశరాజుగారి రాజధానీ నగరంగాను, శ్రీపద్మావతీ శ్రీనివాసుల పరిణయపురంగా పేరు పొందిన "నారాయణవర మహానగరం" కాలాంతరంలో ఎన్నో రాజకీయ ఒడుదుడుకులకు లోనయ్యింది. ప్రకృతి వైపరీత్యాలకు గురి అయ్యింది.

సుమారు వెయ్యేండ్లవరకు అనేక ప్రాచీనమైన ఆలయాల నగరంగా గొప్ప ఆధ్యాత్మిక క్షేత్రంగా అలరారిన మహానగరం 'నారాయణవరం' నేడు ఒక చిన్న గ్రామంగా దర్శనమిస్తున్నది.

అయినా గత పౌరాణిక, చారిత్రక వైభవాలనూ, ఆధ్యాత్మిక చైతన్యాన్ని నలుమూలలా చాటుతూ, వినీలాకాశంలో రెపరెపలాడుతూ వున్న కీర్తి పతాకాల్లాగా, ఎత్తైన గోపుర శిఖరాలతో, అవ్యక్తమైన ఆధ్యాత్మిక ఉత్తేజంతో అనేక ఆలయాలు నేటికీ నారాయణవరక్షేత్రంలో దేదీప్యమానంగా వెలుగొందుతున్నాయి.

చుట్టూరా ప్రవహించే అరుణా నదీతీరంలో వెలసిన నారాయణవరం అప్పుడప్పుడు వరదల తాకిడికి లోనైనా, ఎప్పటికప్పుడు పునరుద్ధరణ, జీర్ణోద్ధరణ చేయబడిన ప్రసిద్ధ ఆలయాలు చాలా వున్నాయి. అందులో

1. శ్రీపద్మావతీ సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం.
2. సన్నిధివీధి శ్రీ ఆంజనేయస్వామి ఆలయం.
3. శ్రీ చంపకవల్లీ సమేత శ్రీపరాశరేశ్వరస్వామి ఆలయం.
4. భద్రకాళీ సమేత శ్రీ కల్యాణ వీరభద్రస్వామి ఆలయం.

5. శ్రీ శక్తి వినాయకస్వామి ఆలయం.

6. శ్రీ ఆమ్నాయాక్షి (అవనాక్షమ్మ) అమ్మవారి ఆలయం.

7. శ్రీ మరకతవల్లీ సమేత శ్రీ అగస్త్యేశ్వరస్వామి ఆలయం.

వీటిల్లో శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామి ఆలయం, దానికి అనుబంధ ఆలయం అయిన సన్నిధివీధి ఆంజనేయస్వామి ఆలయంలో వైఖానసాగమం ప్రకారం అర్చనాదులు జరుపబడుతున్నాయి.

ఇక ప్రాచీన శివాలయాలు అయిన శ్రీచంపకవల్లీ సమేత శ్రీపరాశరేశ్వర స్వామి ఆలయంలోను, శ్రీమరకతవల్లీ సమేత శ్రీఅగస్తేశ్వరస్వామి ఆలయంలోను శైవాగమం ప్రకారం అర్చనాదులు జరుగుతుండగా, శ్రీఅవనాక్షమ్మగుడిలోను, శ్రీభద్రకాళీ సమేత శ్రీ కల్యాణ వీరభద్రస్వామి ఆలయంలోను, శ్రీ శక్తివినాయకస్వామిగుడిలోను, వీరశైవాగమం ప్రకారంగా అర్చనలు, ఆరాధనలు నిర్వహింపబడుతున్నాయి.

ఈ ఆలయాలన్నీ 1967 ఏప్రిల్ 29వ తేదీన తి.తి.దేవస్థానం పర్యవేక్షణలోనికి స్వీకరించబడినాయి.

ఇవి చాలా ముఖ్యమైనవి.

ఈ ప్రాచీన ఆలయాలతో పాటు, శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఎదురుగా సన్నిధి శ్రీ ఆంజనేయస్వామివారి గుడికి ఆనుకొని ఉత్తరంగా "శ్రీ సొర్రకాయలస్వామి" గా పిలువబడుతున్న ఒక పరమయోగి, ఒక అవధూత సమాధిమందిరం కూడా ప్రసిద్ధ దర్శనీయ స్థలంగా అలరారుతున్నది. వీటి నన్నింటిని తెలియవచ్చినంత వరకు చెప్పుకుందాం.

లోక కల్యాణంకోసమే ప్రత్యక్షంగా శ్రీ పద్మావతీ శ్రీనివాసులు పెండ్లి చేసుకున్న ఈ దివ్యదేశంలో, ఆ వేడుకలను చూడడానికి ముక్కోటిదేవతలు ప్రత్యక్షంగా నడయాడిన పుణ్యభూమి శ్రీనారాయణవరపురవీధుల్లో మనమూ



సంచరించుదాం. ఆధ్యాత్మిక సంపదతో అలరారుతూ వున్న ఇక్కడి ఆలయాల్ని సందర్శించుదాం. శారీరక ఉత్తేజంతో పాటు ఆధ్యాత్మికానందాన్ని మనసారా జుర్రుకొందాం. ఇహ, పరసుఖాలను సమృద్ధిగా పొందుదాం. రండి! నడవండి మరి!

***గోవిందా! గోవిందా!! గోవింద!!!***

* * *

## నారాయణవరం చరిత్ర - పూర్వాపరాలు

నారాయణవర మహానగరాన్ని చంద్రవంశరాజులైన పాండవ వంశానికి చెందినవారు పాలించినారని వేంకటాచల మాహాత్మ్యం చెబుతుంది. సుమారు ఐదువేల సంవత్సరాల కిందట సువీరుడు, అతని కొడుకు సుధర్ముడు – ఈ ప్రాంతాన్ని పాలించారు. ఇతణ్ణే మిత్రవర్మ అని కూడా అంటారు. ఇతని పుత్రుడే ఆకాశరాజు. ఆకాశరాజునాటికి నారాయణవరం ఒక మహానగరం! ఎన్నో ఆలయాలతో అనేకానేక రాజవీధులతో రాజసౌధాలతో, అలరారింది. అంతేకాదు. కెంపులు, వజ్రాలు, వైఢూర్యాలు. వీధిలో పోసి అమ్మేవాళ్లట! అందుకు సాక్ష్యంగా కెంపులపాళెం (కెంపరపాళెం) అనే చిన్న గ్రామం నేటికీ నిలిచివుంది. ఇదేకాక. అన్ని వస్తువులమ్మే కూడలి (Complex) ఒకటి వుండేది. అక్కడ దొరకని వస్తువే వుండదట! అదే నేడు 'సముదాయం' అనే గ్రామం నామమాత్రావశిష్టమై నిలిచింది. అరుణానదికి రెండు వైపులా తీరంలో వ్యాపించిన ఒకప్పటి నారాయణవర మహానగరం కాలక్రమేణా చిన్న చిన్న పల్లెలుగా విడిపోయినాయని చెప్పవచ్చు. ఇలా విడిపోవడానికి కొన్ని రాజకీయ ఒడిదుడుకులే కాకుండా అరుణానదీ వరద బీభత్సం కూడ ప్రధానకారణంగా పేర్కొనవచ్చు.

ఏది ఏమైనా ఒకప్పటి ఆలయాల నగరంగాను, ఆధ్యాత్మిక నగరంగాను విలసిల్లిందనడానికి గుర్తుగా నారాయణవరక్షేత్రంలో అనేక ఆలయాలు ఎత్తైన శిఖర గోపురాలతో విరాజిల్లుతూ తమ వైభవాన్ని చాటుకొంటూనే వున్నాయి.

ఈ నగరాన్ని కొంతకాలం యాదవరాజులు, పల్లవులు, చోళులు, విజయనగర చక్రవర్తులు పాలించినట్లుగా చెప్పవచ్చు. ఒకప్పుడు నారాయణవనంగా పేరుపొదిన ఈ నగరం, ఆ యా కాలాల్లో 'నారాయణపురం'గా పిలువబడుతూ, ప్రస్తుతం "నారాయణవరం" పేరుతో స్థిరపడింది. ఇదే ఆక్కడి పల్లె ప్రజల నోళ్లలో "నాన్నారం"గా మారింది.

పౌరాణికంగా ఐదువేల సంవత్సరాల చరిత్ర మనకు కనపడుతున్నా, ప్రస్తుతం సుమారు వెయ్యేండ్ల నాటి నుంచి మాత్రమే చారిత్ర్యాకాధారాలను ఆ యా శాసనాలు స్పష్టం చేస్తున్నాయి.

ఆనాటి "శ్రీ పద్మావతీ శ్రీనివాసుల పరిణయవేదిక" నే ఇప్పటి శ్రీకల్యాణ వేంకటేశ్వరాలయంగా తీర్చిదిద్ది ఆకాశరాజు నిర్మించాడనీ, అది కాలాంతరంలో ఎన్నో మార్లు జీర్ణోద్ధరణ చెయ్యబడిందన్న మాట మాత్రం వాస్తవం. చారిత్రకులు చెబుతున్న మాట కూడ!

క్రీ.శ.1245 ఏట అప్పటి పాలకుడైన వీరనరసింగదేవ యాదవరాయలు ఈ ఆలయాన్ని జీర్ణోద్ధరణ చేశాడు.


ఆ తర్వాత విజయనగరచక్రవర్తి అయిన అచ్యుతరాయలకు అంగరక్షకుడైన విరూపణ్ణ (వీరప్పన్న) 1541-42 సంవత్సరంలో మళ్లీ ఈ ఆలయాన్నీ పునరుద్ధరించాడని మద్రాసు ఎపిగ్రఫికల్ రిపోర్టు (1912) ద్వారా తెలుస్తున్నది.

ఆ తర్వాత బ్రిటిషువారి పరిపాలనకాలంలో ఈ నారాయణవరక్షేత్రం, ఆకాశరాజు వంశీయులుగా చెప్పబడిన కార్వేటినగర సంస్థానాధీశుల



ఏలుబడిలో చాలాకాలం వుండింది. ఆ సంస్థానం కూడ కాలాంతరంలో అంతరించి పోగా ఈ క్షేత్రంలోని ఆలయాలను తిరుత్తణి శ్రీసుబ్రహ్మణ్యస్వామి దేవస్థానంవారు పర్యవేక్షించారు. ఆంధ్రరాష్ట్రం నుండి భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన సమయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1960లో ఈ నారాయణవర ఆలయ నిర్వహణకోసం ఒక 'ధర్మకర్తలమండలి'ని ఏర్పాటు చేసింది. ఆ ధర్మకర్తల మండలి 1964లో అష్టబంధన మహాసంప్రోక్షణ, కుంభాభిషేకాలతో ఈ ఆలయాన్ని పునరుద్ధరించింది.

లోకసభ స్పీకరు శ్రీఅనంతశయనం అయ్యంగార్ కృషి ఫలితంగా 1967 ఏప్రిల్‌నెలలో నారాయణవరం లోని ఆలయాలన్నీ తి.తి.దేవస్థానం పాలనలోనికి విలీనం చెయ్యబడ్డాయి. శ్రీఅనంతశయనం అయ్యంగార్ గారి స్వగ్రామం నారాయణవరం కావడం విశేషం. ఈయన కృషి ఫలితంగానే తి.తి.దేవస్థానం పరిపాలన కూడ మహంతులనుండి 1933లో ధర్మకర్తల మండలికి దఖలు పరచబడింది.



## శ్రీ పద్మావతీ సమేత
## శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయం

ఇంచుమించుగా తిరుమల పుణ్యక్షేత్రంలోని శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయం మాదిరిగానే నిర్మింపబడిన ఆలయం శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామి ఆలయం. నారాయణవరం గ్రామం మధ్యలో తూర్పు ముఖంగా చాల ఎత్తైన రాజగోపురాలతో, విశాలమైన ప్రాకార, ప్రదక్షిణ ఆవరణలతో బలిపీఠ ధ్వజస్తంభాలతో, తరతరాలుగా ప్రతినిత్యం వైఖానసాగమశాస్త్రం నియమానుసారంగా అర్చన నివేదనాదులతో విలసిల్లుతున్న ఆలయం శ్రీ పద్మావతీసమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయం. పవిత్రమైన ఆ దివ్య సన్నిధిలోనికి ప్రవేశిస్తూ ఆలయ విషయాలను, విశేషాలను తెలుసుకుందాం.

అదిగో! ఆ కనపడేదే శ్రీ స్వామివారి ఆలయ ప్రధాన రాజగోపురం! తల లెత్తి, తలపై చేతులు జోడించి భక్తిగా నమస్కరించుదాం.

***గోవిందా! గోవిందా!! గోవింద!!!***

## ప్రధాన రాజ గోపురం

ఏడు అంతస్థులతో, తళ తళ మెరుస్తున్న తొమ్మిది బంగారు కలశాలతో సుమారు 150 అడుగులకు పైగా వున్న ప్రధానరాజగోపురం విశాలమైన బలిష్ఠమైన రాతి అధిష్ఠానం పైన నిర్మింపబడివుంది. ఆలయంలో ప్రవేశించడానికి ప్రధాన ప్రవేశద్వారం ఇదే. దీన్ని 'మహాద్వారం' అని కూడా అంటారు. ఈ గోపుర ప్రవేశద్వారానికి ఎత్తైన చెక్కతలుపులు బిగింపబడివ ఉన్నాయి. ఈ రాజగోపుర ద్వారానికి అనుసంధించి సుమారు 30 అడుగుల ఎత్తైన ప్రాకారం గండశిలలచే నిర్మితమైంది. ఈ ప్రాకారానికి చుట్టూ బయటవుండే ప్రదక్షిణమార్గాన్ని 'మహాప్రదక్షిణం' అంటారు.



గోపురానికి ఎదురుగా వుండే వీధి సన్నిధి వీధి. ఆ వీధికి ఎదురుగా శ్రీ స్వామివారి ఆలయానికి ఎదురుగా నమస్కార భంగిమలో వున్న శ్రీసన్నిధివీధి ఆంజనేయస్వామి ఆలయం వుంది.

ఈ ఆంజనేయస్వామిగుడికి, మహాద్వార గోపురానికి ఎదురుగా వున్న సన్నిధి వీధి మధ్యలో 16 శిలా స్తంభాలతోకూడిన ఎత్తైన రాతిమండపం ఉంది. దీన్నే "తిరువేందికాపు మంటపం" అంటారు.

మహాద్వార రాజగోపుర ప్రవేశానికి పక్కనే దక్షిణం దిక్కున**శ్రీ వేదాంత దేశికులవారి సన్నిధి** మండపం ఉత్తర ముఖంగా వుంది. శ్రీ కల్యాణ వేంకటేశ్వరుని వీధి ఉత్సవం ఏది జరిగినా, మండపం దగ్గర శ్రీస్వామివారి పూలమాలను వేదాంతదేశికులవారికి వేసిన తర్వాత స్వామివారి ఆ శేషహారతిని ఇచ్చిన తదుపరి శఠారిని కూడ అనుగ్రహిస్తారు. దీన్నే 'పూలసరం, శేషహారతి శఠారి మర్యాద' అంటారు. ఇక్కడ నుండే వేదపారాయణ ప్రారంభమై వాహనసేవ పూర్తి అయిన తర్వాత ఆలయంలో జరిగే ఆస్థానంలో పూర్తి అవుతుంది.

ప్రధాన ప్రవేశమైన ఈ రాజ గోపురద్వారంలో శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారు, వీధి ఉత్సవానికి బయలు దేరినా, లేదా బ్రహ్మోత్సవాల్లో ఆలయంలోపలే వాహనమండపం వున్నందున అక్కడనుండే నేరుగా వాహనాలమీద అధిరోహించి ఆలయం బయటికి వస్తారు. అలా వచ్చే సమయంలో ప్రధానమైన ఈ రాజగోపురం మధ్యలో శ్రీకల్యాణ వేంకటేశ్వరునికి కర్పూర మంగళ నీరాజనాలు సమర్పింపబడతాయి. దీన్నే "ప్రధాన రాజగోపురద్వార మంగళహారతి" అంటారు. ఈ హారతి దర్శనం అద్భుతమే గాక పరమానంద సంధాయకమై సర్వాభీష్టాలను నెరవేరుస్తుంది.

తిరుమల, తిరుపతి ఆలయాల్లో మాదిరి గాకుండ నారాయణవరం ఆలయంలో 'వాహనమండపం' ఆలయం లోపలే, సంపెంగతోట ప్రదక్షిణ మార్గంలో ఆగ్నేయమూలన వుంది. ఎప్పుడు వచ్చినా ఆలయంలోనే

వాహనాలను అధిరోహించి రావడం గోపురద్వారంలో దివ్య మంగళకర్పూర నీరాజనాలు సమర్పించడం విశేషం. పిదప వడగల సంప్రదాయం ప్రకారం దివ్యప్రబంధపారాయణం ఈ గోపురం నుంచే శ్రీస్వామివారి వాహనం ముందుభాగాన ప్రారంభం కావడం, ఊరేగింపు అయిన తర్వాత ఎదురుగావున్న 16 శిలాస్తంభాల ఎత్తైన మండపం దగ్గర పారాయణం ముగించడం ఆనవాయితీ.

## సంపెంగ ప్రదక్షిణం

మహాద్వార రాజగోపురంలో ప్రవేశించిన వెంటనే 'సంపెంగ ప్రదక్షిణం" వుంది. ఎదురుగా బలిపీఠం, ఎత్తైన ధ్వజస్తంభం, వాటికి ముందు భాగంలో గరుడాళ్వార్ సన్నిధి వుంది. సంపెంగ ప్రదక్షిణంలో చుట్టూరా పూలచెట్లు రమణీయంగా అనేకంగా పెంచబడినాయి. ఈ సంపెంగ ప్రదక్షిణ మార్గంలోనే ఆగ్నేయంలో మరో ఎత్తైన మండపం ఉంది. ఇదే **వాహన మండపం.** బ్రహ్మోత్సవాల్లో, ముందుగా వాహనాలపై స్వామివారిని వేంచేపుచేసి అలంకరించిన తర్వాతనే ఈ మండపంనుంచే నేరుగా తిరువీధి ఉత్సవానికి బయలుదేరతారు. ఇక ఉత్తరం దిక్కున విమానప్రదక్షిణమార్గంలోనికి ఒక ప్రవేశ ద్వారం వుంది. దీన్నే **'వైకుంఠ(ఉత్తర)ద్వారం'** అంటారు. వైకుంఠ ద్వాదశిరోజున భక్తులు శ్రీస్వామివారిని దర్శించి ఈ ద్వారంగుండానే బయటికి వస్తారు. ఈశాన్యమూలలో **ఊంజల్ మండపం** ఉంది. ఇందులో బ్రహ్మోత్సవాల సమయాల్లో ప్రతి సాయంత్రంవేళ శ్రీస్వామివారికి ఊంజల్‌సేవ జరుగుతుంది.

**గరుడాళ్వార్** ఎదురుగా మరో గోపురం ద్వార ప్రవేశం ఉంది. దీన్ని **మధ్యగోపురం**మని, **రెండవ రాజగోపురం** అని అంటారు.

## రెండవ రాజగోపురం

శ్రీగరుడాళ్వారుమండపానికి ఎదురుగావున్న ప్రవేశ ద్వారంపైన రాతి అధిష్ఠానంపై నిర్మింపబడిన రెండవరాజగోపురంపైన ఐదుకలశాలు



ప్రతిష్ఠింపబడ్డాయి. ఈ గోపురాన్ని అనుసంధిస్తూ చుట్టూరా శిలా ప్రాకారం నిర్మింపబడింది. ఈ ప్రవేశ ద్వారానికి కూడా ఎత్తైన చెక్కవాకిళ్లు అమర్చబడినాయి. ఈ వాకిట్లో ప్రవేశించగానే ఉండేదే విమానప్రదక్షిణం.

## విమాన ప్రదక్షిణం

శ్రీస్వామివారి గర్భాలయంపైన వున్న ఆనందనిలయ విమానం చుట్టూరా చేసే ప్రదక్షిణ మార్గాన్ని "విమాన ప్రదక్షిణం" అంటారు.

విమాన ప్రదక్షిణంలో ప్రవేశించగానే ఎదురుగా ఎత్తైన 16 శిలాస్తంభాలతో వున్న చతురస్ర ముఖమండపం కనపడుతుంది. ఈ మండపం మధ్యలోని ఒక అర అడుగు మందంతో 6 అడుగుల చతురస్ర శిలావేదిక పైన పై నుండి వేలాడదీయబడిన గొలుసులతో ప్రతి శనివారం సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేతంగా శ్రీకల్యాణవేంకటేశ్వరునికి ఊంజల్‌సేవ జరుగుతుంది.

## చుట్టు గుళ్లు

ఊంజల్‌సేవ జరిగే ఈ ముఖమండపం నుండి ప్రధానాలయం చుట్టూ ప్రదక్షిణంగా సాగే మార్గాన్ని విమాన ప్రదక్షిణం అంటారు. ఈ ప్రదక్షిణ మార్గంలో ప్రధాన ఆలయానికి చుట్టూ మొదట **శ్రీ వరదరాజస్వామి సన్నిధి, పోటు** అనబడే **వంటశాల, ఆళ్వారుల మండపం, దశవతారమండపం,** నైరుతిమూలలో తూర్పుముఖంగా ప్రత్యేకంగా నిర్మించబడిన **శ్రీపద్మావతి (శ్రీమహాలక్ష్మి) అమ్మవారి సన్నిధి** – పడమటిలో **కల్యాణమండపం,** వాయవ్యమూలలో తూర్పుముఖంగా **శ్రీ గోదాదేవి (ఆండాళ్) సన్నిధి,** ఉత్తరం వైపున ప్రాకారంలో **'వైకుంఠద్వారం', కార్యాలయం, స్థలవృక్షంగా** ప్రసిద్ధిచెందిన **పారిజాతవృక్షం, శ్రీ విష్వక్సేనులు, తిరమంగై ఆళ్వారు, తిరుక్కచ్చినంబి, మనవాళమహాముని** మున్నగు శిలావిగ్రహాలు వున్న మండపం, ఆ తర్వాత ఈశాన్యమూలలో వున్న ప్రత్యేకమండపంలో

**శ్రీ కోదండరాముని సన్నిధి, శేషశాయి శ్రీ రంగనాథస్వామి, శ్రీ రాజమన్నార్ స్వామి సన్నిధులు** దక్షిణముఖంగా వున్నాయి. ఈ మండపాన్ని ఆనుకొని ఈశాన్య మండపంలో పడమటి ముఖంగా **శ్రీ ప్రయాగమాధవస్వామివారి** సన్నిధి వుంది.

## శ్రీపద్మావతి అమ్మవారి సన్నిధి

విమానప్రదక్షిణ మార్గంలో నైరుతి మూలలో తూర్పుముఖంగా ప్రత్యేకంగా విరాజిల్లుతున్న "శ్రీపద్మావతి అమ్మవారి సన్నిధి" అత్యంత ప్రధానమైంది. ఆకాశరాజు కూతురుగా, యజ్ఞభూమిలో బంగారు పద్మంలో ఆవిర్భవించిన అయోనిజ శ్రీపద్మావతి. పద్మంలో అవతరించింది కనుక "పద్మవల్లి" "పద్మిని" "పద్మావతి" అనే పేర్లతో పిలువబడుతున్న ఈ జగన్మాత గడప దాటని, యువరాజ్ఞి. ఎండకన్నెరగని సుకుమారి. ఆలయంలో నైరుతిమూలలో ముందుకు చొచ్చుకొని వచ్చిన ముఖమండపాన్ని ఆనుకొని పశ్చిమంగా రెండడుగుల ఎత్తైన రాతి అధిష్ఠానంపై ప్రదక్షిణ మండపంతో అంతరాళం, గర్భాలయం అనే రెండు భాగాలుగా "శ్రీపద్మావతి సన్నిధి" నిర్మింపబడింది.

ఈ జగన్మాత "శ్రీమహాలక్ష్మి" అని కూడ పిలువబడుతున్నది.

గర్భాలయంపైన రెండంతస్థులు కలిగిన విమాన శిఖరగోపురం, **ఐదుబంగారు** కలశాలతో నిర్మింపబడివుంది. దీన్ని "విష్ణుశ్చంద్రవిమానం" అని అంటారని అర్చకస్వాములు తెలియజేశారు.

పదహారేళ్ల పడుచుగా ఆకాశరాజు కూతురు యువరాణిగా, మహాదర్పంగా గంభీరంగా దర్శనమిస్తున్న శ్రీవేంకటేశ్వర్వుని పట్టపురాణి "పద్మావతి". సుందర సోయగాలతో దివ్య ప్రకాశంతో వెలుగుతున్న ఆ జగన్మాత దివ్యరూపాన్నీ, చిరుదరహాసంతో, కడగంటి చూపులతో అనుగ్రహిస్తున్న ఆయమ ముఖారవిందాన్ని పరవశిస్తూ కన్నులారా దర్శించి తీరవలసిందే తప్ప వర్ణించడం ఎవరి తరం కాదు.



గర్భాలయంలో రెండడుగులకు పైగా ఎత్తు శిలా పీఠంపైన పద్మాసనస్థ అయిన శ్రీపద్మావతి పై రెండుచేతుల్లో పద్మాలను ధరించి వుంది. కింది రెండు చేతులను అభయ వరదముద్రలుగాను రత్నహారాలతో, కిరీటంతో, నాసికకు బంగారు ముక్కెరతో, పట్టుపీతాంబరాలతో నిండుగా దర్శనమిస్తున్న శ్రీపద్మావతి అమ్మవారి శిలావిగ్రహ మూలమూర్తితో పాటు ప్రక్కనే సుమారు రెండడుగుల ఎత్తుగల పంచలోహ ఉత్సవ ప్రతిమామూర్తిని కూడ దర్శించవచ్చు.

ప్రతి శుక్రవారం ఉదయం శ్రీపద్మావతి అమ్మవారి సన్నిధిలో మూలమూర్తికి, ఉత్సవమూర్తికి పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనం, కొబ్బరినీరు మున్నగు సుగంధ ద్రవ్యాలతో తిరుమంజనం అనే మంగళాభిషేకం జరుగుతుంది. ఘనంగా అలంకార, అర్చన, నివేదనలు జరుగుతవి.

పిదప ప్రతి శుక్రవారం సాయంత్రం శ్రీపద్మావతి అమ్మవారి ఉత్సవమూర్తికి విమాన ప్రదక్షిణ ఆవరణలో శ్రీపీఠంపైన ఉత్సవం జరిగిన పిదప, అమ్మవారి సన్నిధి ముఖమండపంలో గొలుసులతో వేలాడదీయబడిన ఊయలపై 'ఊంజల్‌సేవ' జరుగుతుంది. ఆస్థానం నివేదన అయింతర్వాత, అమ్మవారు సన్నిధిలోనికి ప్రవేశిస్తారు.

భక్తులు ఎవరైనా, ఏ రోజైనా నిర్ణీత రుసుమును చెల్లించి ఈ ఆలయంలో శ్రీపద్మావతి కల్యాణవేంకటేశ్వరస్వామివారలకు "కల్యాణోత్సవం" చేయించుకోవచ్చు. ఆ సందర్భంలో మాత్రమే శ్రీపద్మావతి అమ్మవారి ఉత్సవమూర్తి, ప్రక్కనే వున్న కల్యాణమండపంలోనికి మాత్రమే వేంచేసి, కల్యాణంలో పాల్గొంటుంది. అంతే!

ఇక్కడ ఈ ఆలయంలో వేంచేసివున్న శ్రీపద్మావతి అమ్మవారికి ప్రత్యేకంగా ఉత్సవాలు, ఊరేగింపులు జరగవు జరిగినా విమాన ప్రదక్షిణమార్గంలో మాత్రమే నిర్వహింపబడతవి. జగత్ప్రభువు

సర్వజగన్నియామకుడు, తనకు భర్త అయిన ఘనవేంకటేశ్వరునికి జరిగే ఉత్సవాలను గూర్చి వింటుంది. విని తన్మయిస్తుంది. తన పతి, జగదేకపతి అయిన శ్రీనివాసుని వైభవాన్ని చెవులారా విని ఆనందించే అచ్చమైన తెలుగింటి ఆదర్శగృహిణి, జగన్మాత శ్రీపద్మావతి అమ్మవారు.

అట్లని ఎలాంటి పెత్తనం లేని అమాయక ఇల్లాలు మాత్రం కాదు. ముఖ్యంగా భక్తుల విషయంలో ఆ తల్లి పట్టుదలతో, పరంధామునికి సున్నితంగా సిఫారసు చేసి, ఆమె ఇప్పించే వరాలు అహో! అనన్య సామాన్యం ఈ జగన్మాతవల్లే, "నారాయణవరం" నిత్యకల్యాణపరంపరల్ని గుప్పించే దివ్యక్షేత్రంగా విరాజిల్లుతూ వుంది.

పద్మావతి అమ్మవారు విహారం చేసే విమాన ప్రదక్షిణ మార్గంలోనే శ్రీపద్మావతీ శ్రీనివాసుల పరిణయానికి సాక్ష్యంగా ఇప్పుడు వున్న పెద్ద తిరుగలిని (విసురురాయి) ప్రత్యక్షంగా భక్తులు దర్శించవచ్చు.

శ్రీ పద్మావతీ, శ్రీనివాసుల పరిణయోత్సోవ వేడుకల్లో నలుగు పిండి, వడియాల పిండిని, పసుపును, విసరిన ఈ తిరగలిని ఉపయోగించిన ఐదువేల ఏండ్లనాటి బలవంతులైన మానవుల పరిమాణం ఊహిస్తే ఆశ్చర్యం కలుగుతుంది.

## కల్యాణమండపం - యాగశాల

శ్రీపద్మావతి అమ్మవారి సన్నిధికి ఆనుకొని దక్షిణంగా పొడవైన ప్రాకార మండపం వుంది. ప్రస్తుతం ఇది శ్రీవారి కల్యాణోత్సవ మండపంగా ఉపయోగింపబడుతున్నది.

భక్తులెవరైనా శ్రీపద్మావతీ సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారికి కల్యాణోత్సవం నిర్వహించేందుకు నిర్ణీత రుసుమును కనీసం ఒక రోజుముందుగా చెల్లిస్తే చాలు. కల్యాణోత్సవం చేస్తారు నిర్వహిస్తారు.



బ్రహ్మోత్సవాల సమయంలో ఈ కల్యాణోత్సవ మండపం యాగశాలగా ఉపయోగింపబడుతున్నది.

## ఆండాళ్ సన్నిధి

విమాన ప్రదక్షిణ మార్గంలో వాయవ్యమూలన ప్రాకారపు గోడకు ఆనుకోకుండా ప్రత్యేక ప్రదక్షిణ మార్గంతో నిర్మింపబడిన ఆలయం శ్రీగోదాదేవి సన్నిధి.

సుమారు 3 అడుగుల ఎత్తైన రాతి అధిష్ఠానంపైన ముఖమండపం, అంతరాళం, గర్భాలయంగా నిర్మింపబడిన ఆండాళ్ ఆలయంలో నిలిచివున్న శ్రీ గోదాదేవి నల్లని శిలావిగ్రహం ప్రతిష్ఠింపబడి వుంది. గర్భాలయంపైన ఐదుబంగారు కలశాలతో రెండంతస్థుల విమాన గోపురం నిర్మింపబడింది.

నిత్యమూ మూడుపూటలా నివేదనలు జరిగుతున్న ఈ అమ్మవారికి ప్రతి శుక్రవారం అభిషేకం జరుపబడుతుంది.

శ్రావణమాసంలో (జూలై - ఆగష్టు) పూర్వాషాఢనక్షత్రం గోదాదేవి జయంతి. ఈ రోజుకు ముగిసేట్లుగా పది రోజులు ముందునుంచి 'తిరువాడిపూరం' ఉత్సవాలు జరుగుతాయి. ప్రతిరోజు గోదాదేవి (ఆండాళ్)కి శ్రీపీఠం(తిరుచ్చి)పై తిరువీధి ఉత్సవం జరుగుతుంది.

ధనుర్మాసంలో భోగిపండుగ ముందు నాటికి పూర్తి అయ్యేట్లుగా ఏడురోజులుపాటు ఆండాళ్ నీరాట్టోత్సవాలు జరుగుతాయి. ఉదయం ఏకాంతంగా తిరుమంజనం అయిన తర్వాత ఆండాళ్ తల్లికి తిరుచ్చిపై తిరువీధి ఉత్సవం జరుగుతుంది.

## వైకుంఠ (ఉత్తర) ద్వారం

విమాన ప్రదక్షిణంలో ఉత్తర దిక్కున ప్రాకారంలో సంపెంగ ప్రదక్షిణంలోనికి వెళ్లేందుకుగాను ఒక ద్వార ప్రవేశం ఉంది. దీన్ని

"ఉత్తరద్వారం" అంటారు. ధనుర్మాసంలో వైకుంఠ ద్వాదశిరోజున మాత్రమే భక్తులు శ్రీస్వామివారి దర్శనానంతరం. ఈ "ఉత్తరద్వారం" గుండా ఆలయం వెలుపలికి వెళ్తారు.

## శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి ప్రధాన ఆలయం

శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామి ఆలయం విమాన ప్రదక్షిణం మధ్యభాగంలో సుమారు 6 అడుగుల ఎత్తుగల రాతి అధిష్ఠానంపైన నిర్మింపబడింది. దానికి ముందు భాగంలో 16 స్తంభాలు వున్న ఎత్తైన శిలాస్తంభాల ముఖమండపం ఉంది. ఈ మండపంనుంచి మెట్లు ఎక్కగానే అర్ధమండపం వస్తుంది. అర్ధమండపంలోనే ద్వారాలకిరువైపులా జయవిజయుల శిలావిగ్రహమూర్తులు ప్రతిష్ఠింపబడినాయి. ఇక్కడ తెల్లవారుజామున "సుప్రభాత" సేవ జరుగుతుంది. ద్వారపాలకుల అనుమతి తీసుకొని లోపలకు వెళితే ఉండేదే 'అంతరాళం'. దాన్ని దాటితే 'శయన మండపం' వుంది. ప్రతి రోజురాత్రి 'ఏకాంతసేవ' ఈ శయన మండపంలో 'భోగశ్రీనివాసమూర్తి'కి పవళింపుసేవ జరుగుతుంది. 'శయనమండపం' తర్వాత 'శ్రీవారి గర్భాలయం' కనపడుతుంది. దీన్ని 'ఆనందనిలయం' అంటారు. గర్భాలయం పైన ఆనందనిలయ విమాన గోపురం ఏక కలశంతో నిర్మింపబడింది. గర్భాలయం మధ్యలో పద్మపీఠంపై శ్రీనివాసుని నిలువెత్తు శిలావిగ్రహమూర్తి దర్శనమవుతుంది. ఆయనే శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి.

## శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి

చెరగని, తరగని చిరుమందహాసంతో నొసట్లో సన్నని నామంతో శంఖుచక్రాలతో వరదహస్తంతో, ఎడమచేత వేటఖడ్గంతో వక్షఃస్థల శ్రీవత్సచిహ్నంతో దశావతార వడ్డాణంతో, సాలగ్రామహారాలతో కుడిచేతికి కల్యాణ కంకణంతో విరాజిల్లుతూ స్థానక భంగిమ(నిలిచివున్న)లో నేత్ర



దర్శనంతో దర్శనమిస్తున్న కొత్త పెండ్లికుమారుడు స్వామి శ్రీకల్యాణ వేంకటేశ్వరుడు.

ఈ స్వామివారి దర్శనం సర్వార్థ సిద్ధిప్రదం!

సుమారు 6 అడుగులకు పైగా ఎత్తువున్న, శ్రీ కల్యాణ వేంకటేశ్వరుని శిలావిగ్రహమూర్తికి ప్రతిరోజు ఉదయం సుప్రభాతం అనే మేలుకొలుపు, తోమాలసేవ అనే పుష్పాలంకరణ, కొలువు, అర్చన, మూడు పూటలా దధ్యోదనం, పులిహోర, ముళహోర, దోశలు మున్నగునవి నివేదనలు జరుగుతాయి.

ప్రతి శుక్రవారం ఉదయం 7.00 గం॥ శ్రీస్వామివారి మూలమూర్తికి పాలు, పరిమళం, పసుపు మున్నగు సుగంధ ద్రవ్యాలతో అభిషేకం జరుగుతుంది. శ్రీ స్వామివారి గర్భాలయంలో 1. ధ్రువమూర్తి అయిన మూలమూర్తితో పాటు 2. కౌతుకమూర్తి, 3. శ్రీదేవి భూదేవి సమేతంగా ఉత్సవమూర్తి, 4. స్నపనమూర్తి, 5. బలిమూర్తి మున్నగు వారితో పాటు చక్రత్తాళ్వారు, శ్రీకృష్ణుడు, శ్రీసీతారామలక్ష్మణుల విగ్రహమూర్తులు, ఆంజనేయుడు, శ్రీఆండాళ్, శ్రీవేదాంతదేశికుల ఉత్సవవిగ్రహాలు ఇక్కడ చోటుచేసుకున్నాయి.

ఈ ఉత్సవమూర్తులకు, ఆ యా సందర్భాల్లో ఉత్సవాలు జరుగుతుంటాయి.

## శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు

శ్రీ పద్మావతి అమ్మవారు అవతరించిన దివ్యక్షేత్రమే గాక, ఆ తల్లిని శ్రీనివాసుడు పరిణయమాడిన పుణ్యస్థలం కూడ నారాయణవరం! సుమారు ఐదువేల ఏండ్లనాడు వారిద్దరికి జరిగిన వివాహోత్సవ మణిమయ మండపమే నేడు మనం దర్శిస్తున్న నారాయణవరంలోని శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారి ఆలయం. ఈ ఆలయం వెలసిన నాటినుండి శ్రీపద్మావతీ సమేత శ్రీకల్యాణ

వేంకటేశ్వరస్వామివారలకు అంగరంగ వైభవంగా, వైఖానస ఆగమశాస్త్రానుసారం. మూడుపూటలా అర్చనలు, ఆరాధనలు, నివేదనలు జరుగుతున్నాయి. ఈ ఆలయంలో ప్రతిరోజు ఉదయం దధ్యోజనం, పులిహోర. మధ్యాహ్నంపూట పులిహోర, దధ్యోజనం. సాయంత్రం పూట మొళహోర, దోసె, పొంగల్ నివేదింపబడుతున్నాయి. ఇవేగాక ఈ ఆలయంలో నిత్యోత్సవాలు, వారోత్సవాలు, మాసోత్సవాలు, సంవత్సరోత్సవాలు ఘనంగా నిర్వహింపబడుతున్నాయి. ప్రతిరోజు ఉదయం 5.30 గంటల మొదలు రాత్రి 8 గంటల వరకు నిత్యమూ జరిగే సేవలను గురించి క్లుప్తంగా తెలుసుకుందాం.

## నిత్యోత్సవాలు

ప్రతిరోజు విధిగా, నియమంగా జరిగే సేవలను నిత్యోత్సవాలు అంటారు.

**1. సుప్రభాతం :** ప్రతిరోజు ఉదయం 6 నుండి 6.30 గంటలకు 'కౌసల్యా సుప్రజారామ' అంటూ సుప్రభాతాన్ని పఠిస్తూ శ్రీకల్యాణవేంకటేశ్వరుని మేలుకొలుపే సేవ ఇది. భక్తులు దర్శించవచ్చును.

**2. తోమాలసేవ :** సుప్రభాతం తర్వాత గర్భాలయం శుద్ధి అయిన తర్వాత ఉదయం 7 గంటలకు తోమాలసేవ అనే పుష్పాలంకరణ సేవ జరుగుతుంది. ఆలయంలోని మూలమూర్తులకు, ఉత్సవమూర్తులకు పూలమాలలతో చేసే సేవ తోమాలసేవ. ఇది అర్చక స్వాములు ఏకాంతంగా నిర్వహిస్తారు.

**3. అర్చన :** శ్రీనివాసస్వామికి, అమ్మవారి మూలమూర్తులకు అర్చనలు జరుగుతవి. శ్రీస్వామివారికి తులసీ అర్చనలోను, శ్రీ అమ్మవారికి జరిగే కుంకుమార్చనలోను భక్తులు నిర్ణీత రుసుములను చెల్లించి దర్శించవచ్చు.

**4. నిత్యకల్యాణోత్సవం :** నారాయణవరక్షేత్రంలో శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామి వారికి భక్తులు నిర్ణీత రుసుమును కనీసం ఒకరోజు ముందుగా చెల్లించి



ఏరోజైనా ఉదయం 10 గంటలకు కల్యాణోత్సవం నిర్వహించుకోవచ్చు. ఇక్కడ జరిగే కల్యాణోత్సవంలో గమనించవలసిన విశేషాంశం ఏమంటే శ్రీవారితోపాటు శ్రీదేవి, భూదేవి, మరియు ఆకాశరాజు కూతురు పద్మావతికూడ వుంటుంది. ఇక్కడ జరిగే కల్యాణోత్సవంలో శ్రీస్వామివారిది, శ్రవణనక్షత్రం, అచ్యుతగోత్రం (భరద్వాజగోత్రం అని తిరుమల వైఖానసఆగమం, వశిష్ఠగోత్రం అని వేంకటాచలమాహాత్మ్యం.) శ్రీదేవి – ఉత్తరఫల్గుని, భార్గవసగోత్రంగా, భూదేవి – రేవతి నక్షత్రం, కాశ్యపసగోత్రంగా కాగా పద్మావతి – మృగశిరనక్షత్రం ఆత్రేయసగ్రోతంగా చెప్పబడుతున్నది. 'కల్యాణవేదికపైన శ్రీస్వామివారికి కుడి పక్కన ఆనుకొని భూదేవి, ఆమె పక్కన పద్మావతి ఆమె పక్కన శ్రీదేవి వేంచేస్తారు. శ్రీనివాసుడు మూడు మంగళసూత్రాలను వరుసగా శ్రీదేవికి, భూదేవికి తర్వాత పద్మావతికి వేస్తారు. తలంబ్రాలను కూడా అదే వరుసలో పోస్తారు.

శ్రీపద్మావతి పరిణయ పురమైన నారాయణవరంలో శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామికి కల్యాణం చేయించుకుంటే కావలసిన వారికి పెళ్లి అవుతుందని, కోరిన వారికి సంతానం కూడ కలుగుతుందని ప్రతీతి! భక్తుల అనుభవం కూడా.

**5. ఏకాంతసేవ :** రాత్రి 8 గం॥ శ్రీస్వామివారికి ఏకాంతసేవ అనబడే పవళింపుసేవ జరుగుతుంది.

## వారోత్సవాలు

వారానికి ఒకరోజున ప్రత్యేకమైన ఉత్సవంగా నియమంగా జరిగే సేవలు ఇవి.

**ఆదివారం - శ్రీ ఆంజనేయస్వామివారు (సన్నిధి వీధి)**

శ్రీ కల్యాణవేంకటేశ్వరస్వామివారి ఆలయం మహాద్వారానికి ఎదురుగావున్న శ్రీ సన్నిధివీధి ఆంజనేయస్వామివారికి ప్రతి ఆదివారం

ఉదయం 7 గం॥ల అభిషేకం జరుగుతుంది. పాలు, పెరుగు, పంచామృతం, కొబ్బరినీరు మున్నగు ద్రవ్యాలతో జరిగే ఆంజనేయస్వామి అభిషేకంలో నిర్ణీత రుసుమును చెల్లించి భక్తులు పాల్గొని దర్శించవచ్చు.

**మంగళవారం**

**అష్టదళపాదపద్మారాధన**

ప్రతి మంగళవారం ఉదయం 10 గంటలకు శ్రీకల్యాణవేంకటేశ్వర స్వామి మూలమూర్తికి వెండితో చేయబడిన 108 తామర పుష్పాలతో అష్టోత్తరశతనామార్చన జరుగుతుంది. ఇదే 'అష్టదళపాదపద్మారాధన'. నిర్ణీత రుసుమును చెల్లించి భక్తులు ఈ సేవలో పాల్గొని స్వామివారిని దర్శించవచ్చు.

**శుక్రవారాభిషేకం**

**శ్రీ కల్యాణవేంకటేశ్వరస్వామివారి అభిషేకం:** ప్రతి శుక్రవారంనాడు శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారికి, శ్రీపద్మావతి అమ్మవారికి ఉదయం 7 నుండి 7.30 గం॥ అభిషేకం ప్రారంభమవుతుంది నిర్ణయింపబడిన రుసుమును చెల్లించి భక్తులు శ్రీకల్యాణవేంకటేశ్వరునికి జరిగే అభిషేకంలో పాల్గొని దర్శించవచ్చు. పాలు, పునుగు, జవాజి, పచ్చకర్పూరం, పసుపు, చందనం మున్నగు సుగంధ ద్రవ్యాలు కలిపిన పవిత్ర జలాలతో అభిషేకం జరుగుతుంది.

**ఊంజల్‌సేవ**

ప్రతి శనివారం సాయంత్రం 5 గంటలకు శ్రీదేవీభూదేవీ సమేతంగా శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారికి ఊంజల్ మండపంలో ఊయలసేవ అయిన తర్వాత ఆస్థానం, నివేదన జరిగిన తర్వాత శ్రీస్వామివారు ఆలయంలో ప్రవేశిస్తారు.

**శ్రీ పద్మావతి అమ్మవారికి అభిషేకం :** ప్రతి శుక్రవారం ఉదయం 8 నుండి 8.30 గం॥ల మధ్య పాలు, కొబ్బరినీలు, పసుపు, చందనం మున్నగు



సుగంధ ద్రవాలతో శ్రీపద్మావతి అమ్మవారి మూలమూర్తికి, ఉత్సవమూర్తికి తిరుమంజనం జరుగుతుంది. ప్రతి శుక్రవారం ఉదయం జరిగే ఈ అభిషేకంలో భక్తులు నిర్ణీత రుసుమును చెల్లించి పాల్గొని దర్శించవచ్చును.

**ఊంజల్ సేవ :** ప్రతి శుక్రవారం సాయంత్రం 5.00 గంటలకు శ్రీ పద్మావతి అమ్మవారి ఉత్సవమూర్తికి, శ్రీ పద్మావతి అమ్మవారి సన్నిధికి ముందువున్న ఊంజల మండపంలో ఊంజల్‌సేవ జరుగుతుంది. ఈ ఊయలసేవ కంటె ముందు శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారి ఆనందనిలయ విమాన ప్రదక్షిణం మార్గంలో మాత్రమే శ్రీ పద్మావతీ అమ్మవారికి శ్రీ పీఠం(తిరుచ్చి)లో ఉత్సవం జరుగుతుంది. దీన్నే **"ప్రాకారోత్సవం"** అంటారు. తర్వాత ఊంజల్‌సేవ నిర్వహింపబడుతుంది. నివేదన తర్వాత శ్రీ పద్మావతీ అమ్మవారు సన్నిధిలోనికి ప్రవేశిస్తారు. ఆకాశరాజు కూతురయిన ఈ జగన్మాత గడపదాటని మహారాజ్ఞి! ఎండ కన్నెరగని సుందర సుకుమారి అయిన శ్రీవారి పట్టపురాణి. ఆ తల్లి విమానప్రదక్షిణంలో మాత్రమే విహరిస్తారు. ఎప్పుడూ బయటికి రానేరారు.

ప్రతి శుక్రవారం ఆలయంలో జరిగే శ్రీపద్మావతి అమ్మవారి ఊంజల్‌సేవను భక్తులు దర్శించవచ్చు.

## పక్షోత్సవాలు

పదహైదురోజుల కొకసారి, అంటే ప్రతి నెలా శుక్లపక్షంలోనూ, బహుళపక్షంలోను నిర్ణీత రోజుల్లో జరిగే సేవలు ఇవి.

ప్రతి పక్షంలోను ఏకాదశి రోజు ఉదయం 7 గంటలకు శ్రీదేవీ భూదేవీ సమేతంగా శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులకు ఏకాంతంగా ఆలయంలో అభిషేకం నిర్వహింపబడుతుంది.

ఆ సాయంత్రం 5.30 గంటలకు, ఆలయం చుట్టూరా తిరువీధుల్లో శ్రీపీఠంపైన(తిరుచ్చి)లో శ్రీవారి ఉత్సవమూర్తులకు ఊరేగింపు జరుగుతుంది.

## మాసోత్సవాలు

నెలకు ఒక్కసారిమాత్రమే జరిగే ఉత్సవాలు ఇవి.

**1. శ్రవణ నక్షత్రోత్సవం :** ప్రతినెలా శ్రీవేంకటేశ్వరస్వామివారి అవతార నక్షత్రం అయిన శ్రవణం రోజున ఉదయం 7 గంటలకు శ్రీదేవి భూదేవీ సమేత శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులకు ఏకాంతంగా తిరుమంజనం (అభిషేకం) జరుపబడుతుంది.

ఆ సాయంత్రం 5 గంటలకు శ్రీవారి ఆలయం చుట్టూరా వున్న ప్రదక్షిణ మార్గంలో తిరుచ్చిలో (శ్రీపీఠంలో) శ్రీస్వామివారి ఉత్సవమూర్తులతో ఊరేగింపు జరుగుతుంది. భక్తులు దర్శించి దివ్యమంగళహారతులు సమర్పించుకోవచ్చు.

## వార్షికోత్సవాలు

సంవత్సరానికి ఒక్కమారు జరిగే ఉత్సవాలు కనుక ఇవి సంవత్సరోత్సవాలు అనీ, వార్షికోత్సవాలు అని అంటారు. తెలుగు ఉగాదితో ప్రారంభమై ఉగాదికి ముందురోజుకు సమాప్తమవుతాయి.

### 1. ఉగాది ఆస్థానం

ఆలయంలో ఉగాదినాటి సాయంత్రం ఆస్థానంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారికి పంచాంగశ్రవణం జరగుతుంది.

### 2. శ్రీరామనవమి

శ్రీసీతాలక్ష్మణ హనుమత్సమేత సమేత శ్రీకోదండరామచంద్రస్వామివారి ఉత్సవమూర్తులకు తిరుమంజనం జరిగిన తర్వాత ఆస్థానం జరుగుతుంది. ఆ సాయంత్రం శ్రీపీఠం(తిరుచ్చి)లో తిరువీధి ఉత్సవం జరుగుతుంది.

### 3. భాష్యకార్ల ఉత్సవం

భగవద్రామానుజాచార్యులవారిని భాష్యకార్లు అంటారు. వైశాఖమాసంలో ఆర్ద్రనక్షత్రం(తమిళచిత్రినెల)నాడు వీరు అవతరించారు.



ఆ సందర్భంగా "భాష్యకార్ల ఉత్సవం" పేరుతో వీరి అవతారోత్సవాలు జరుపబడుతాయి.

వైశాఖ మాసంలో ఆర్ద్ర నక్షత్రం రోజుకు పదిరోజులు ముందుగా భాష్యకార్ల ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ప్రతిరోజు సాయంత్రం శ్రీరామానుజులవారి ఉత్సవమూర్తిని తిరుచ్చిపై తిరువీధుల్లో ఊరేగిస్తారు. శ్రీరామానుజులవారికి ఆలయంలో ఆస్థానం జరిగినతర్వాత శ్రీవారి పూలమాల విశేషహారతి రామానుజులవారికి సమర్పింపబడుతుంది. ఈ రోజుతో భాష్యకార్ల ఉత్సవం పూర్తి అవుతుంది.

### 4. బ్రహ్మోత్సవాలు

ప్రతి సంవత్సరం వైశాఖమాసం (వైయ్యాసి)లో శ్రవణనక్షత్రానికి చక్రస్నానం అనగా అవబృథం జరిగేట్లుగా తొమ్మిదిరోజులు ముందునుంచి అనగా చిత్తా నక్షత్రంలో ఉదయం పూట ధ్వజారోహణంతో శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. ఆ రోజు రాత్రి 8గం॥ల పెద్దశేషవాహనం, మరునాడు రెండవనాడు ఉదయం చిన్నశేషవాహనం రాత్రి హంస, మూడవనాడు సింహం, ముత్యపుపందిరి, నాల్గవనాడు కల్పవృక్షం, సర్వభూపాలవాహనం, ఐదవనాడు పల్లకిలో మోహినీ అవతారం రాత్రి గరుడవాహనం, ఆరవనాడు హనుమంతవాహనం, సాయంత్రం వసంతోత్సవం, ఆ రాత్రి గజవాహనం, ఏడవనాడు సూర్యప్రభ, చంద్రప్రభ, ఎనిమిదవనాడు రథోత్సవ ఆ సాయంత్రం శ్రీవారికి కల్యాణోత్సవం, రాత్రి అశ్వవాహనం, తొమ్మిదవనాడు ఉదయం చక్రస్నానం – రాత్రి ధ్వజావరోహణం జరుగుతాయి.

ఈ ఉత్సవాల్లో ప్రతిరోజు సాయంత్రం ఊరేగింపునకు ముందుగా సంపెంగ ప్రదక్షిణంలో ఈశాన్యమూలలోవున్న కొలువు మండపంలో ఊంజల్‌సేవ (ఊయలసేవ) జరుగుతుంది. బ్రహ్మోత్సవంలో ప్రతిరోజు

ఉదయం, సాయంత్రం, తిరువీధి ఉత్సవాల్లో శ్రీస్వామివారు వాహనాలమీద ఆలయానికి సుమారు ఒక కిలోమీటరు దూరంలో వున్న గంగుంద్రమండపం వరకు ఊరేగింపుగా వెళ్లి అక్కడినుంచి తిరిగి ఆలయానికి చేరుకుంటారు.

ప్రత్యేకంగా ఆలయంనుంచి రథోత్సవం జరిగే రోజున ఉదయం బయలుదేరి గంగుంద్ర మండపం దగ్గరకు వెళ్లి ఆగుతుంది. మళ్లీ ఆ సాయంత్రంపూట ఆ రథం అక్కడ నుండి బయలుదేరి ఆలయం దగ్గరకు చేరుకుంటుంది.

ఇక చివరిరోజు ‘‘చక్రస్నానం’’ దేవేరులతో శ్రీస్వామివారు చక్రత్తాళ్వారులతో కలిసి వేర్వేరు పల్లకిల్లో ఆలయానికి ఒక కిలోమీటరు దూరంలోవున్న పద్మసరోవరానికి వెళ్తారు. దాన్నే తామరగుంట లేదా తామరపుష్కరిణి అంటారు. అక్కడ చక్రస్నానం పూర్తి అయిన తర్వాత ఆలయానికి చేరుకొంటారు.

### 5. ఆణివారఆస్థానం

ప్రతిసంవత్సరం జూలై 16వ తేదీ కర్కాటక సంక్రాంతినాడు శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారికి “ఆణివరఆస్థానం” జరుగుతుంది. నూతనవస్త్రధారణ విశేష అలంకారాలతో నివేదనలు జరుగుతాయి.

### 6. శ్రీ ఆండాళ్ తిరువాడిపూరం ఉత్సవాలు

శ్రీగోదాదేవి అని పిలువబడే ఆండాళ్ జన్మదినోత్సవం అయిన శ్రావణమాసంలో (జూలై – ఆగష్టు) పుబ్బ నక్షత్రానికి ముందు పదిరోజుల నుంచి ఉత్సవాలు జరుగుతాయి. ప్రతిరోజు తిరుచ్చి(శ్రీపీఠం)లో శ్రీగోదాదేవికి తిరువీధి ఉత్సవం జరుగుతుంది.

### 7. గోకులాష్టమి

శ్రీకృష్ణాష్టమి పండుగ సందర్భంగా శ్రావణమాసంలో (ఆగష్టు) శ్రీకృష్ణస్వామివారికి మాత్రమే ఆలయంలో ఆస్థానం జరుగుతుంది.




### 8. ఉట్ల ఉత్సవం

శ్రీకృష్ణాష్టమి మరునాడు తిరువీధుల్లో ఉట్లఉత్సవం జరుగుతుంది. శ్రీదేవిభూదేవి సమేతంగా శ్రీవేంకటేశ్వరస్వామివారు ఒక పల్లకిపైన, శ్రీకృష్ణుడు మరో పల్లకిపైన తిరువీధుల్లో ఊరేగుతుండగా ఉట్లు కొట్టే వేడుకలు ఘనంగా జరుగుతాయి.

### 9. శ్రీ వరలక్ష్మీవ్రతం

ప్రతి శ్రావణమాసం (ఆగష్టు)లో పున్నమి ముందు వచ్చిన శుక్రవారంనాడు సంప్రదాయసిద్ధంగా దేశమంతా శ్రీవరలక్ష్మీవ్రతం నిర్వహించుకోవడం ఆనవాయితీ. ఆ రోజు శ్రీ మహాలక్ష్మి అని పిలువబడే శ్రీపద్మావతి అమ్మవారికి ఆలయంలోని విమాన ప్రదక్షిణంలో మాత్రమే తిరుచ్చి(శ్రీపీఠం)లో ఉత్సవం ఆయిన తర్వాత ఊంజల్‌సేవ ఆస్థానం జరుగుతుంది.



**10. శ్రీవేదాంతదేశికులవారి ఉత్సవాలు**

భాద్రపద శ్రవణనక్షత్రంరోజున శ్రీవేదాంత దేశికులవారు శ్రీవేంకటేశ్వరస్వామివారి ఘంటాంశతో అవతరించారు. శ్రీవారి గుడికి బయట ఆగ్నేయమూలలో ఉత్తరాభిముఖంగా శ్రీవేదాంతదేశికులవారి సన్నిధిమందిరం వుంది. వారి అవతార నక్షత్రానికి ముందుగా పదిరోజులనుంచి శ్రీస్వామివారికి ఆలయం తిరువీధుల్లో ఉత్సవం జరుగుతుంది. ఈ పది రోజులు, శ్రీ వేదాంత దేశికులవారికి శ్రీవారి శేషహారతి పూలమాల శఠారిమర్యాదలు జరుపబడతవి. వడగల సంప్రదాయం ప్రకారం ప్రతి ఉత్సవానికి ముందు భాగంలో దివ్యప్రబంధపారాయణం జరుగుతుంది.

**11. పవిత్రోత్సవాలు**

ప్రతి సంవత్సరం భాద్రపదమాసంలో పూర్ణిమ నాటికి నారాయణవరం లోని శ్రీపద్మావతీ సమేత శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారికి పవిత్రోత్సవం జరుగుతుంది. అంతకు ముందురోజు సాయంత్రం పవిత్రోత్సవానికి అంకురార్పణ చేస్తారు.

పవిత్రీకరణ చేసే ఉత్సవమే పవిత్రోత్సవం అంటే ఏడాది పొడవునా, ఆలయంలోగాని, ఆలయం ఉత్సవాల్లోగానీ, అర్చనల్లోగాని, నివేదనల్లోగాని, ఆలయ నియమాల్లోగానీ తెలిసీ కొన్ని దోషాలు, తెలియక కొన్ని దోషాలు కలుగవచ్చు, కలుగుతాయి కూడ. అంతేగాకుండ నియమానుసారం కొన్ని వేళల్లో ఆలయంలో ప్రవేశించరాదు. పురుటిమైల, అంటు, బహిష్టు మైలలు వంటివేళల్లో తెలియక యాత్రికులు ఆలయంలో ప్రవేశించవచ్చు, ఈ దోషాలు యాత్రికులవల్ల మాత్రమే గాక, ఆలయంలో పనిచేసే సిబ్బంది వల్ల కూడ కలుగవచ్చు. ఇలాంటి దోషాలవల్ల ఆలయం పవిత్రత కొంత తగ్గవచ్చు.

ఇలా అనేక కారణాలవల్ల కలిగిన దోషాలను తొలగించి, ఆలయాన్ని పవిత్రీకరించే ఉత్సవమే పవిత్రోత్సవం అంటారు. ఇది మామూలుగా స్థలశుద్ధి చేసే "పుణ్యాహవాచనం" వంటి కార్యక్రమం మాత్రం కాదు.



ప్రత్యేకమైన హోమ ప్రక్రియతో పవిత్రాలప్రతిష్ఠ సమర్పణవంటి వైదిక కార్యక్రమాలలో జరిగే ఉత్సవమే పవిత్రోత్సవం. శ్రీస్వామివారి మూలమూర్తి, ఉత్సవమూర్తులు, శ్రీపద్మావతి, శ్రీగోదాదేవి మూలమూర్తులు, ఉత్సవమూర్తులతో పాటు విమాన ప్రదక్షిణంలో చుట్టూ వున్న గుళ్లోని విగ్రహమూర్తులకు, బయట గరుత్మంతుడు, ధ్వజస్తంభ, బలిపీఠాలకు ఎదురుగా సన్నిధివీధి ఆంజనేయస్వామివారి వరకు బాజాభజంత్రీలతో శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ జరుగుతుంది.

**12. విజయదశమి - దశరాపండుగ**

ప్రతి సంవత్సరం విజయదశమి పండుగరోజు సాయంత్రం వేళలో శ్రీ దేవిభూదేవి సమేతంగా శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారికి శ్రీపీఠం (తిరుచ్చి)లో తిరువీధి ఉత్సవం జరుగుతుంది. తర్వాత ఆలయంలో ఆస్థానం జరుగుతుంది.

**13. దీపావళి ఆస్థానం**

ప్రతి సంవత్సరం ఆశ్వయుజ (అక్టోబర్ – నవంబర్) అమావాస్య దీపావళి పండుగనాడు ఆలయంలో శ్రీస్వామివారికి ఆస్థానం, నివేదనలు జరుగుతవి.

**14. కార్తికదీపోత్సవం**

ప్రతి సంవత్సరం కార్తిక (నవంబరు)పున్నమినాటి సాయంత్రం శ్రీదేవిభూదేవి సమేత శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారికి శ్రీపీఠం(తిరుచ్చి)లో తిరువీధి ఉత్సవం అయిన తర్వాత ఆలయంలో అంతటా కార్తిక దీపాలు వెలిగించే కార్యక్రమం అద్భుతంగా ఉంటుంది.

**15. తెప్పోత్సవాలు**

ప్రతి సంవత్సరం కార్తికమాసంలో నారాయణవర క్షేత్రంలో శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారికి తెప్పోత్సవాలు జరుగుతాయి. తెప్పోత్సవాలనే 'ప్లవోత్సవాలు' అంటారు.

నారాయణవరక్షేత్రంలో శ్రీవారి ఆలయానికి పడమటి (వాయవ్య) దిక్కున సుమారు 1.5 కిలోమీటర్ల దూరంలో **'పద్మసరోవరం'** అనే సరస్సువుంది. ఇందులో 'పద్మాలు' వున్నందువల్ల 'తామరగుంట' అని అంటారు.

ప్రతి సంవత్సరం కార్తికమాసంలో శుక్లఏకాదశినాటి నుండి పున్నమి వరకు ఐదురోజులపాటు ఈ పుష్కరిణిలో ప్రతిరోజు సాయంత్రం 6 గంటలకు విద్యుద్దీపాలతో అలంకృతమైన తెప్పపై తెప్పోత్సవాలు నిర్వహింపబడతాయి.

మొదటిరోజు కార్తికశుద్ధ ఏకాదశినాడు శ్రీసీతాలక్ష్మణ హనుమత్సమేత శ్రీకోదండరామస్వామివారికి, రెండవరోజు ద్వాదశిరోజున గోదాదేవికి, తర్వాతి త్రయోదశి, చతుర్దశి, పున్నమినాడు, ఇలా ఈ మూడు రోజుల్లో శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారికి చక్కగా విద్యుద్దీపాలతో అలంకరింపబడిన తెప్పపై పద్మసరస్సులో కనువిందుగా తెప్పోత్సవం జరుగుతుంది.

### 16. ధనుర్మాసం - వైకుంఠ ఏకాదశి

ప్రతి సంవత్సరం ధనుర్మాసం (డిశంబరు – జనవరి)లో వచ్చే వైకుంఠ ఏకాదశినాటి సాయంకాలం శ్రీ దేవి భూదేవి సమేతంగా శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారికి నారాయణవరం పురవీధుల్లో గ్రామోత్సవం వైభవంగా జరుగుతుంది.

### 17. వైకుంఠ ద్వాదశి

ధనుర్మాసంలో వచ్చే శుద్ధ ఏకాదశిని వైకుంఠ ఏకాదశి, అని ద్వాదశిని వైకుంఠ ద్వాదశి అంటారు. అన్ని విష్ణ్వాలయాల్లో మాదిరే ఇక్కడ నెలరోజులు ధనుర్మాస పూజ జరుగుతుంది. పిదప వైకుంఠ ద్వాదశిరోజున ఉదయం శ్రీదేవిభూదేవి సమేతంగా శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామి వారలకు



శ్రీపీఠం(తిరుచ్చి)లో ఆలయంచుట్టు వున్న తిరుమాడా వీధుల్లో ఉత్సవం జరిగిన పిదప శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో వైకుంఠద్వాదశినాడు వైకుంఠ(ఉత్తర)ద్వారం తెరవబడుతుంది. విమాన ప్రదక్షిణమార్గంలో ఉత్తరం దిక్కున ప్రాకారంలో సంపెంగ ప్రదక్షిణంలోనికి వెళ్లే ద్వారం ఉంది. దీన్నే "వైకుంఠద్వారం" అంటారు. వైకుంఠద్వాదశినాడు ఉదయం అర్చన నివేదనానంతరం ఈ 'వైకుంఠద్వారం' మధ్యాహ్నం వరకు మాత్రమే తెరవబడుతుంది.

యథాక్రమంగా భక్తులు మహాద్వారంలో, నడిమిద్వారంలో ప్రవేశించి ముందుగా శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారిని దర్శిస్తారు. ఆ తర్వాత దక్షిణం దిక్కున వున్న వాకిలి ద్వారా విమాన ప్రదక్షిణంలోనికి వచ్చి నైరుతిమూలలో వున్న 'శ్రీమహాలక్ష్మి' అని పిలువబడే పద్మావతిని, ఆ తర్వాత ఆండాళ్ గోదాదేవిని దర్శించిన తర్వాత ఈ "ఉత్తరద్వారం"గుండా సంపెంగ ప్రదక్షిణంలోనికి వచ్చి, మహారాజ గోపురం ద్వారా ఆలయం వెలుపలికి వెళ్తారు.

### 18. ఆండాళ్ నీరాట్టోత్సవాలు

ప్రతి సంవత్సరం ధనుర్మాసంలో భోగిపండుగ ముందురోజుకు ముగిసేట్లుగా ప్రతి రోజు సూర్యోదయవేళలో ఏడురోజులపాటు గోదాదేవి ఆండాళ్‌తల్లికి నీరాట్టోత్సవాలు జరుపబడుతాయి.

ఈ ఏడురోజులూ, ఉదయం ఏకాంతంగా ఆండాళ్‌మూర్తికి తిరుమంజనం అయినవెంటనే తిరుచ్చి(శ్రీపీఠం)పై తిరువీధి ఉత్సవం జరుగుతుంది.

### 19. భోగి ఉత్సవం

ప్రతి సంవత్సరం భోగి పండుగనాడు (జనవరి13,14) సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేతంగా శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారికిగ్రామోత్సవం

జరుగుతుంది. ఈ ఊరేగింపు గంగుంద్ర మండపంవరకు వెళ్లి తిరిగి ఆలయం చేరుకుంటుంది.

### 20. సంక్రాంతి ఉత్సవం

ప్రతి సంవత్సరం సంక్రాంతి పండుగనాడు (జనవరి 14,15) సాయంత్రంపూట శ్రీదేవిభూదేవి సమేతంగా శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామి వారికి నారాయణవరం గ్రామోత్సవం జరుగుతుంది.

### 21. కనుమ ఉత్సవం

ప్రతి సంవత్సరం సంక్రాంతి పండుగ మరునాడు కనుమ (జనవరి 15,16) సాయంత్రం శ్రీదేవిభూదేవి సమేతంగా శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామి వారికి శ్రీపీఠంపైన (తిరుచ్చి) తిరువీధి ఉత్సవం జరుగుతుంది.

### 22. పంగున్యుఉత్తర ఉత్సవం

పాల్గుణ (తమిళ) మాసంలోని ఉత్తరఫల్గుని నక్షత్రంనాడు ఆకాశరాజు కూతురుగా "శ్రీమహాలక్ష్మి" బంగారు పద్మంలో అవతరించింది. ఆ రోజును పురస్కరించుకొని ఫాల్గుణ (మార్చి – ఏప్రిల్) మాసంలో ఉత్తరఫల్గుని నక్షత్రం రోజునకు ముందుగా ఏడు రోజులపాటు విమాన ప్రదక్షిణం నైరుతిమూలలో వేంచేసివున్న శ్రీమహాలక్ష్మిఅని పిలువబడే శ్రీపద్మావతి అమ్మవారికి ఉత్సవాలు జరుగుతాయి. వీటినే "పంగున్యుత్తర ఉత్సవాలు" అంటారు.

ప్రతి రోజు సాయంత్రం శ్రీపద్మావతి అమ్మవారికి శ్రీపీఠం(తిరుచ్చి)లో విమాన ప్రదక్షిణంలో మాత్రమే ఉత్సవం జరిగిన పిదప, అమ్మవారి ముఖమండపంలో ఊంజల్‌సేవ ఆస్థానం జరుగుతుంది. చివరిరోజు మాత్రం శ్రీదేవిభూదేవి సమేతంగా శ్రీస్వామివారిని శ్రీపద్మావతిఅమ్మవారిని ఎదురెదురుగా వేంచేపుచేసి, మాలాసమర్పణ, మాలలమార్పు, చందన తాంబూలాలు, దివ్యమంగళనీరాజనాల సమర్పణ ఘనంగా జరుగుతవి.



### 23. రథసప్తమి

ప్రతి ఏటా మాఘశుద్ధసప్తమి (జనవరి – ఫిబ్రవరి) "రథసప్తమి" పేరుతో సూర్యజయంతిని జరుపుకొంటారు.


ఆనాడు సూర్యోదయం మొదలుకొని సాయంత్రం సూర్యాస్తమయం వరకు శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారికి 1. సూర్యప్రభవాహనం, 2. చిన్నశేషవాహనం, 3. కల్పవృక్షవాహనం, 4. పెదశేషవాహనం, 5. హంసవాహనం, 6. తిరుచ్చి (శ్రీపీఠం), 7. చంద్రప్రభ మున్నగు ఏడు వాహనాల్లో తిరువీధి ఉత్సవం జరుగుతుంది.

శ్రీ వేంకటేశ్వరుడు, ఆకాశరాజు పుత్రిక పద్మావతిని పరిణయమాడిన క్షేత్రంలో అంగరంగవైభవంగా ఉత్సవాలు జరుగుతుంటాయి. నిత్యమూ భక్తులు దర్శిస్తూనే వుంటారు. ఈ క్షేత్రంలో ప్రత్యక్షంగా శ్రీపద్మావతిని పరిణయమాడిన శ్రీ కల్యాణ వేంకటేశ్వరుని వీక్షణం, కల్యాణ పరంపరలకు నాంది అవుతుంది తక్షణం!!

**శ్లో॥ నారాయణపురే రమ్యే పద్మావత్యా సహాఽనిశమ్,**
**రమమాణాయ కల్యాణ వేంకటేశాయ మంగళమ్.**

**– శ్రీ కల్యాణవేంకటేశ్వరస్వామి సుప్రభాతం**

**ఓం నమో వేంకటేశాయ**



## శ్రీ చంపకవల్లి శ్రీపరాశరేశ్వరస్వామి ఆలయం



శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారి ఆలయానికి ఎదురుగా సన్నిధివీధిలో శ్రీ ఆంజనేయస్వామివారి ఆలయం వుంది. ఈ ఆలయానికి దక్షిణంగా ఆనుకొని ప్రధానవీధికి కొద్ది లోపలికి అత్యంత ప్రాచీనమైన శివాలయం ఎత్తైన రాజగోపురంతో దర్శనమిస్తుంది. అదే శ్రీ చంపకవల్లీ సమేత పరాశరేశ్వరస్వామివారి ఆలయం.

### స్థలపురాణం

శ్రీపద్మావతీ శ్రీవేంకటేశ్వరస్వామివారల కల్యాణోత్సవానికి నారాయణవరానికి విచ్చేసిన పరాశరమహర్షి తన నిత్యశివార్చనకై ఒక మహాశివలింగాన్ని ప్రతిష్ఠించాడు. వ్యేదవ్యాసమహర్షి తండ్రి అయిన పరాశరమహర్షి ప్రతిష్ఠించిన ఈశ్వర ఆలయం కనుక శ్రీపరాశరేశ్వరాలయం అని పేరు కల్గింది. ఇక్కడి పార్వతి అమ్మవారికి 'చంపకవల్లి' అని పేరు.

పరాశరమహర్షి వేదవ్యాసునికి తండ్రి. ఇంతేగాక పద్మావతీ శ్రీనివాసుల పరిణయానికి ముందుగా వేంకటాచలానికి వెళ్లి వకుళమాతను, వేంకటేశ్వరుణ్ణి, పద్మావతిని వివాహమాడటానికి నారాయణవరనగరానికి తరలి రావలసిందని ఆహ్వాన పత్రికను అందజేసిన శ్రీశుకమునీంద్రులు పరాశరమహర్షికి మనుమడు.



నూతన కల్యాణదంపతులైన పద్మావతీ శ్రీనివాసులు పరాశరమహర్షి ప్రతిష్ఠించిన శ్రీపరాశరేశ్వరాలయాన్ని దర్శించి అర్చినారని స్థలపురాణం.

ఐదుకలశాలతో, త్రితలంగా పశ్చిమాభిముఖంగా ప్రధాన రాజగోపుర ద్వార ప్రవేశంతో, ఆ గోపురానికి అనుసంధించి నలుచదరంగా ఎత్తైన ఆలయ ప్రాకారం మధ్యలో నిర్మింపబడిన ఆలయమే శ్రీపరాశరేశ్వరాలయం.

### ఆలయ ప్రాంగణం

ఎత్తైన రాజగోపుర ద్వారానికి పెద్ద చెక్కవాకిళ్లు అమర్చబడివున్నాయి. ఈ ద్వారంలో ప్రవేశించగానే ప్రాంగణం మధ్యలో గర్భాలయ శిఖరాలతో విరాజిల్లుతున్న శ్రీపరాశరేశ్వరాలయం మాత్రం దక్షిణాభిముఖ ప్రవేశ ద్వారంతో నిర్మింపబడింది.

మహాద్వార గోపురంలో ప్రవేశించిన భక్తుడు ప్రధాన ఆలయం చుట్టూరా ప్రదక్షిణం చేసిన తర్వాతనే దర్శనం చేయవలసి వుంటుంది.

అలా ప్రదక్షిణంగా వెళ్లేదారిలో వాయవ్యం మూలలో ప్రత్యేకంగా దక్షిణముఖంగా శ్రీవల్లీదేవసేనా సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి, మధ్యలో పానవట్టం దగ్గర శ్రీచండికేశ్వరస్వామి, మహాప్రాకారం దగ్గరలో వాయవ్యమూలలో తూర్పుముఖంగా శ్రీఅన్నపూర్ణాసమేత శ్రీకాశీవిశ్వనాథస్వామి సన్నిధి – ఎదురుగా నందీశ్వరుని విగ్రహం వున్నాయి. ఈశాన్యమూలలో దక్షిణముఖంగా కాలభైరవుడు, ఆయనకు పక్కనే పడమటిముఖంగా శ్రీసూర్యనారాయణస్వామి, ఆ తర్వాత తూర్పున ధ్వజస్తంభ బలిపీఠాలు, వాటికి ముందు నందీశ్వరుడు ఉన్న మండపం వున్నాయి. ఆగ్నేయంలో వంటగది, బావి, వాటికి ముందు నాగులకట్ట వుంది.

ప్రధాన ఆలయానికి తూర్పు గోడలోవున్న చిన్న కిటికీ లోపల తూర్పుముఖంగా వున్న శివలింగాన్ని చూస్తున్నట్లుగా నంది వుంటుంది. ఆ తర్వాత ఆగ్నేయమూలలో వంటశాల, దక్షిణదిక్కున ఆలయంలోనికి ప్రవేశద్వారం, నైరుతిమూలలో శ్రీమహాగణపతి సన్నిధి ఉన్నాయి.

దక్షిణందిక్కున ఉత్తరముఖంగా ఆలయంలోపల ప్రవేశిస్తే తూర్పు ముఖంగా వున్న గర్భాలయంలో శ్రీపరాశరేశ్వరస్వామివారి శివలింగం, అలాగే ఆ పక్కన గర్భాలయానికి పక్కన ఉత్తరందిక్కున గర్భాలయంలో శ్రీచంపకవల్లీ అమ్మవారి శిలామూర్తి దక్షిణాభిముఖంగా ప్రతిష్ఠింపబడినాయి. స్వామివారి గర్భాలయంపైన త్రితలంగా ఏకకలశ శిఖరం, అమ్మవారి గర్భాలయంపైన ద్వితలంగా మూడుకలశాల శిఖరం నిర్మించబడింది. ప్రధాన ఆలయానికి ప్రవేశంలో ఆగ్నేయంలో ప్రత్యేకంగా నవగ్రహమండపం వుంది.

గర్భాలయం ప్రాకారం వెనుక భాగంలో చుట్టూరా పడమటిగోడలో విష్ణువు, ఉత్తరంవైపున బ్రహ్మ, దుర్గ, దక్షిణాన గణపతి, దక్షిణామూర్తి శిల్పమూర్తులు ఏర్పాటు చేయబడినాయి.

శైవాగమంప్రకారం ఈ ఆలయంలో ప్రతిరోజు ఉదయం, సాయంత్రం అర్చన నివేదనలు జరగడమే గాక, ప్రతి సోమవారం ఉదయం 8 గంటలకు, శ్రీస్వామివారికి, అమ్మవారికి అభిషేకాలు జరుగుతవి, భక్తులు ఎవరైనా పాలు, పెరుగు, తేనె మున్నగు అభిషేక ద్రవ్యాలు సమర్పించి అభిషేకం చేయించుకోవచ్చు లేదా ఏరోజైనా ఉదయంపూట అభిషేకద్రవ్యాలను సమర్పించి ప్రత్యేకంగా అభిషేకం చేయించు కోవచ్చు.

ఇదిగాక ప్రతి సంవత్సరం మహాశివరాత్రి పర్వంనాడు అభిషేకార్చనలు విశేషంగా జరుగుతాయి. వేలాదిమంది భక్తులు పాల్గొని దర్శిస్తారు.

## బ్రహ్మోత్సవాలు

ప్రతి సంవత్సరం జేష్ఠమాసంలో (జూన్ – జూలై) పదిరోజుల పాటు శ్రీ చంపకవల్లీ పరాశరేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవం జరుగుతుంది. ప్రతి రోజు రాత్రిపూట ఉత్సవాలు జరుగుతాయి.

మొదటి రోజు – గణపతి ఉత్సవం ధ్వజారోహణ, రెండవ రోజు – చంద్రప్రభ, మూడవరోజు – సింహవాహనం, నాల్గవరోజు – హంసవాహనం, ఐదవ రోజు – శేషవాహనం, ఆరవరోజు – నందివాహనం, ఏడవరోజు – గజవాహనం, ఎనిమిదవరోజు – రథోత్సవం, తొమ్మిదవరోజు సాయంత్రం



– కల్యాణోత్సవం, ఆ రాత్రి అశ్వవాహనం జరుగుతవి, పదవరోజున త్రిశూలస్నానం, ధ్వజావరోహణ అయిన తర్వాత రావణాసుర వాహనం జరుగుతాయి.

ప్రతి సంవత్సరం కనుమపండుగనాడు కొండచుట్టు గిరిప్రదక్షిణం జరుగుతుంది. నగరి కొండచుట్టు గిరిప్రదక్షిణంలో శ్రీమరకతాంబికా అగస్త్యేశ్వరస్వామితోపాటు, శ్రీచంపకవల్లీ సమేత పరాశరేశ్వరస్వామివారు కూడ పాల్గొంటారు. అక్కడ పూజాదికాలు అయిన తర్వాత తిరిగి ఆలయం చేరుకుంటారు.

## పవిత్రోత్సవాలు

శ్రీ చంపకవల్లీ సమేత శ్రీపరాశరేశ్వరస్వామివారి ఆలయంలో ఏడాదిపొడవునా జరిగే అర్చనల్లో, ఉత్సవాల్లో ఏవైనా లోపాలు, పొరపాట్లు చోటు చేసుకోవచ్చు. అంతేగాక ఆలయ ప్రవేశనిషిద్ధ వేళల్లో తెలియకుండా భక్తులుగాని, ఆలయసిబ్బందిగాని ఆలయానికి వెళ్లవచ్చు. ఇలాంటి పొరపాట్లవల్ల ఆలయ పవిత్రతకు కొంత భంగం వాటిల్లవచ్చు. దానివల్ల కలిగిన దోషనివారణార్థం శైవాగమం ప్రకారం ప్రతి ఏటా భాద్రపదమాసం శుక్లచతుర్దశినాటికి మూడు రోజులపాటు పవిత్రోత్సవాలు జరుపబడతవి.

1967 ఏప్రిల్ నెలలో నారాయణవరంలోని ఇతర ఆలయాలతోపాటు, ప్రాచీనమైన ఈ శివాలయం కూడ తి.తి.దేవస్థానంవారి ఆలయాల్లోకి చేరింది.

**శ్లో॥ భక్త ప్రియాయ భవరోగ భయాపహాయ**
**ఉగ్రాయ దుఃఖ భవసాగర తారణాయ**
**జ్యోతిర్మయాయ గుణనామ సువిస్మితాయ**
**దారిద్ర్య దుఃఖ దహనాయ నమశ్శివాయ.**

**ఓం నమశ్శివాయ! ఓం నమశ్శివాయ!!**

## శ్రీ భద్రకాళీసమేత శ్రీకల్యాణవీరభద్రస్వామివారి ఆలయం

నారాయణవరం శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారి ఆలయం నుండి ఆగ్నేయదిక్కులో అరుణానది తూర్పుదిక్కున కొద్ది దూరంలో శ్రీభద్రకాళీ సమేత శ్రీవీరభద్రస్వామివారి ప్రాచీనమైన ఆలయం దర్శనమిస్తుంది. ఆలయంచుట్టూ ప్రాకారంతో పశ్చిమాభిముఖంగా వున్న ప్రధాన ప్రవేశదార్వంలో ప్రధాన ఆలయం మాత్రం దక్షిణముఖంగా అలరారుతున్నది.

నూతన వధూవరులైన శ్రీపద్మావతీశ్రీనివాసులు నారాయణవరంలో వేంచేసివున్న ఇతర దేవతలతోపాటు శ్రీభద్రకాళీసమేత శ్రీకల్యాణ వీరభద్రస్వామివారలను దర్శించి సేవించినారని ప్రతీతి!


నారాయణవరం రాజులు, ముఖ్యంగా ఆకాశరాజు తమ ఆయుధాలను అవనాక్షమ్మ దగ్గర తదుపరి శ్రీవీరభద్రుని వద్ద ఉంచి పూజించిన తర్వాతనే శత్రువులపైకి యుద్ధానికి వెళ్లేవారట!

వీరశైవాగమ శాస్త్ర ప్రకారంగా నిత్య అభిషేక పూజాదులు నిర్వహింపబడుతున్న ఈ ఆలయంలోని గర్భగుడిలో శ్రీభద్రకాళీ సమేతంగా శ్రీవీరభద్రస్వామివారి నిలువెత్తు శిలా విగ్రహాలు దక్షిణాభిముఖంగా ప్రతిష్ఠింపబడినాయి. వీరభద్రుని పాదాలవద్ద నమస్కారభంగిమలో పొట్టేలు(గొర్రె) తలతో దక్షుడు కూడా వున్నాడు. గర్భగుడికి ముందువున్న ముఖమండపంలో ఒకవైపున శ్రీబాలసుందరవినాయకస్వామి, శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి, శ్రీ అఘోరవీరభద్రస్వామి తూర్పుముఖంగా వేంచేసివుండగా మరోవైపున దక్షిణాభిముఖంగా శ్రీచండికేశ్వరుడు, ఈశాన్య భాగంలో నవగ్రహ దేవతలు ప్రతిష్ఠింపబడి వున్నారు. ఈ కల్యాణవీరభద్రుని దర్శిస్తే చాలు! దుష్టశక్తులు దరిచేరవు, శత్రుపీడ, ఈతి బాధలు తొలుగుతాయి. సకల సౌభాగ్యాలు సిద్ధిస్తాయి. గర్భాలయంపైన ఏకకలశ విమానగోపురం ఆలయం ముందు నందీశ్వరుడు బలిపీఠం, ధ్వజస్తంభాలతో దక్షిణముఖంతో అలరారుతూవున్న ప్రాచీన ఆలయం ఇది.



**శ్రీ భద్రకాళీసమేత శ్రీకల్యాణవీరభద్రస్వామి**

**(మూలమూర్తులు)**



శ్రీ భద్రకాళీసమేత శ్రీకల్యాణవీరభద్రస్వామి ఉత్సవ విగ్రహాలు

ప్రతిరోజు ఉదయం, సాయంత్రం అర్చన నివేదనలు జరుగుతున్న ఈ ఆలయంలో, ప్రతి సంవత్సరం శ్రావణమాసం గరుడపంచమినుంచి (ఆగష్టు) తొమ్మిదిరోజులపాటు బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. వీటినే 'శ్రీవీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు లేదా తిరునాళ్లు' అంటారు. ప్రతిరోజు సాయంత్రంపూట శ్రీభద్రకాళీసమేత శ్రీవీరభద్రస్వామివారికి వాహనసేవలు జరుగుతవి.

## బ్రహ్మోత్సవాలు

మొదటిరోజు ధ్వజారోహణం ఆ రాత్రి సూర్యప్రభవాహనం, రెండవరోజు రాత్రి చంద్రప్రభ, మూడవరోజు రాత్రి భూతవాహనం, నాల్గవరోజు సింహవాహనం, ఐదవరోజు రాత్రి అగ్ని గుండ ప్రవేశం తర్వాత పులి(వ్యాఘ్రం)వాహనం, ఆరవరోజు రాత్రి గజవాహనం, ఏడవరోజు ఉదయం రథోత్సవం, సాయంత్రం శ్రీభద్రకాళీ సమేత వీరభద్రస్వామికి కల్యాణోత్సవం, ఎనిమిదవరోజు సాయంత్రం వసంతోత్సవం రాత్రి అశ్వవాహనం, తొమ్మిదవరోజు ఉదయం పల్లకి ఉత్సవం ఖడ్గస్నానం రాత్రి ధ్వజావరోహణం మున్నగు వాహనసేవలు జరుగుతాయి.

ఈ బ్రహ్మోత్సవాల్లోనే ఐదవరోజు రాత్రి అగ్నిగుండ ప్రవేశం (నిప్పుల్లో తొక్కడం), వీరభద్రఖడ్గాలను చదవడం, దక్షయజ్ఞం వంటి కార్యక్రమాలు వైభవంగా జరుగుతాయి.

మహాశివరాత్రినాడుకూడ అభిషేకార్చనలు విశేషంగా జరుగుతాయి.

భాద్రపదమాసంలో శుద్ధచతుర్దశికి మూడురోజులపాటు పవిత్రోత్సవాలు ఈ ఆలయంలో నిర్వహింపబడతాయి.

నారాయణవరంలోని ఇతర ఆలయాలతోపాటు 1967 ఏప్రిల్లో తి.తి.దేవస్థానాల్లో ఈ ఆలయంకూడ చేరింది.

**శరభ! శరభా!! తచ్ఛరభ శరభా!!**

## శ్రీ శక్తి వినాయకస్వామివారి ఆలయం

నారాయణవరంనుండి అరుణానదిదాటి అవనాక్షమ్మగుడికి వెళ్లే దారిలో 'కెంపరపాళెం' అనే చిన్నపల్లె వుంది. అక్కడ శ్రీ శక్తి వినాయక స్వామివారి చిన్నగుడి వుంది. ఈ స్వామివారిని వల్లభీగణపతిస్వామి అని కూడ అంటారు.

నూతన వధూవరులైన శ్రీపద్మావతీవేంకటేశ్వరులు, ముందుగా బాలసుందరమూర్తి అయిన శ్రీ వల్లభీవినాయకస్వామిని దర్శించి విశేషంగా అర్చించారని ప్రసిద్ధి.

ఈ గుడిలో ప్రతిరోజు ఉదయం, సాయంత్రం అర్చన నివేదనలు జరుగుతాయి. ప్రత్యేకంగా భాద్రపదమాసం (ఆగష్టు – సెప్టెంబరు) శుద్ధచవితి వినాయక చవితి పండుగరోజున ఘనంగా అభిషేకార్చనలు జరుగుతవి. ఆ సాయంత్రం మూషికవాహనంపై శ్రీవినాయకస్వామివారికి గ్రామోత్సవం జరుగుతుంది.

ఇదే నెలలోనే ఈ గుడిలో భాద్రమాసంలో పున్నమికి ముందు పవిత్రోత్సవం జరుగుతుంది. పవిత్రోత్సవం జరిగిన రోజున వినాయకుడికి తిరుచ్చి(శ్రీపీఠం)పై గ్రామోత్సవం జరుగుతుంది.

వీరశైవాగమం ప్రకారం ఆరాధనలు జరుగుతున్న ఈ గణనాథునిగుడి కూడ తి.తి.దేవస్థానాల్లో 1967 ఏప్రిల్ నెలలో లీనమైంది.

**శ్లో॥ ధ్యాయే స్థిరేణ మనసా గణేశం సర్వసిద్ధిదమ్**
**బుద్ధి ప్రకాశకం పూర్ణం యోగినాం హృదిసంస్థితమ్.**

శ్రీ వల్లభీవినాయక స్వామివారిని దర్శించి ప్రార్థిస్తే చాలు! అది ఎలాంటి కార్యమైనా తొందరగా తప్పక నెరవేరుతుందని భక్తుల విశ్వాసం!

## శ్రీ ఆమ్నాయాక్షి అమ్మవారి ఆలయం

నారాయణవరం క్షేత్రంలో వెలసిన అత్యంత ప్రాచీనమైన మరో అద్భుతమైన ఆలయం శ్రీ ఆమ్నాయాక్షి అమ్మవారి ఆలయం. ఆమ్నాయాలు అంటే వేదాలు. వేదాలే అక్షులుగా అంటే కన్నులుగా కల దేవత అని అర్థం. ఈ జగన్మాతను స్థానికులైన భక్త ప్రజలు "అవనాక్షమ్మ" అని అంటారు. ఈ తల్లికి "అవినాశిని" అని మరో పేరు ఉండటం విశేషం! అంటే సమస్త కాలాల్లో శాశ్వతంగా వుండే తల్లి! అని అర్థం.

అరుణానదీ తీరంలో తూర్పుముఖంగా నిర్మింపబడిన ఆలయంలో కొలువైవున్న శ్రీఆమ్నాయాక్షి నారాయణవరం చక్రవర్తుల రాజధాని అయిన నారాయణవర మహానగర గ్రామదేవత అని పురాణ కథనం.

సుమారు 10 అడుగుల కంటె ఎత్తుగా, ఎనిమిది భుజాలతో, తలపై అగ్ని జ్వాలా కిరీటంతో, కపాలమాలలతో వివిధాయుధాలతో పాటు, త్రిశూలాన్ని ధరించిన ఉగ్రస్వరూపిణి అయిన ఈ జగన్మాతను సాక్షాత్తు మహాకాళిగా పెద్దలు అభివర్ణిస్తారు. ఎతైన పీఠంపైన కుడికాలిని ఆనించి ఎడమకాలితో రాక్షసుణ్ణి అణచి, త్రిశూలంతో సంహరిస్తున్న ఉగ్రభయంకర స్వరూపిణి ఈ అవనాక్షమ్మ! ఆ జగన్మాత కాళ్లక్రింద వున్న ఒక రాక్షసుడు అమె త్రిశూలంతో వధింపబడుతున్నట్లు (సంహారం చేస్తున్నట్లుగా) ఉన్నాడు. వాడూ ఖడ్గం, డాలును ధరించి వున్నాడు. ఆమె సాక్షాత్తు "మహిషాసుర మర్దిని", గాను, మరికొందరు, వేదాలను దొంగిలించిన సోమకాసురుణ్ణి మర్ధించే దేవతగాను చెప్తారు.

కాలాంతరంలో ఏపేరుతో పిలువబడినా, బ్రహ్మదేవుడు ఆజ్ఞాపించగా శ్రీమహాకాళి చంద్రవంశరాజుల రాజధాని అయిన నారాయణవర నగరం కోటలో రాజ్యరక్షణార్థం చిన్న శిలామూర్తిగా స్వయంభువుగా ఆవిర్భవించింది. ఆ చిన్నమూర్తికి ప్రతిరూపంగా అష్ట భుజాలతో ఎనిమిది చేతుల్లో ఎనిమిది



**శ్రీ అవినాక్షమ్మ దేవి(మూలమూర్తి)**



ఆయుధాలతో వున్న ఎత్తైన శిలామూర్తి అయిన ఈ ఆమ్నాయాక్షి అమ్మవారిని మాత్రం ఆకాశరాజు, పరాశరమహర్షి, అగస్త్యమహర్షుల పర్యవేక్షణలో ప్రతిష్ఠించాడని స్థలపురాణం. సుమారు10 అడుగుల ఎత్తైన ఈ ప్రతిష్ఠిత విగ్రహం ముందు స్వయంభువుగా వెలిసివున్న సుమారు రెండు అడుగుల చిన్న అమ్మవారి శిలా విగ్రహాన్ని కూడ భక్తులు దర్శించవచ్చు. జగద్గురువు శ్రీ శంకరాచార్యులవారు ప్రతిష్ఠించిన శ్రీ చక్రం కూడా ఈ ఆలయంలో దర్శించవచ్చు.

మహాశక్తి స్వరూపిణి అయిన నారాయణవర గ్రామదేవతగా విరాజిల్లుతున్న ఆమ్నాయాక్షి ఆలయానికి, పెండ్లి కూతురైన శ్రీ పద్మావతి అమ్మవారు తన వివాహ సమయంలో వేంచేసి ముందుగా అవనాక్షమ్మ ఆలయంలో పురోహితుల పర్యవేక్షణలో, పుణ్య సువాసినుల మంగళగీతికలతో శుభప్రదంగా మంగళ గౌరీపూజను నిర్వహించుకుని ముత్తైదువులకు వాయన దానాలిచ్చిన తర్వాతనే వివాహమండపానికి తరలి వెళ్లింది.

వివాహం అయిన తర్వాత నూతన కల్యాణ దంపతులైన శ్రీపద్మావతీశ్రీనివాసులు అవనాక్షమ్మను దర్శించి విశేషంగా అర్చించి మొక్కులు సమర్పించుకొన్నారని స్థలపురాణం.

వీరశైవాగమం ప్రకార పూజలు జరుగుతున్న శ్రీ ఆమ్నాయాక్షి అమ్మవారికి ప్రతిరోజు ఉదయం పుష్పాలంకరణ జరిగిన తర్వాత శుద్ధాన్నాన్ని నివేదిస్తారు.

ప్రతి ఆదివారం, మంగళవారం, శుక్రవారం నాళ్లలో మాత్రం ఉదయం 8.30 గం॥ నుండి 9.00 గం॥లకు నువ్వులనూనె తైలకాపు అయిన తర్వాత, పాలు, పెరుగు, తేనె, పచ్చి బియ్యపు పిండి కలిపిన నీళ్లు, పంచామృతం, కొబ్బరినీరు, పసుపు, శుద్ధజలం మున్నగు ద్రవ్యాలతో శ్రీ అవనాక్షమ్మ అమ్మవారికి నయన మనోహరంగా మంగళప్రదంగా అభిషేకం జరుగుతుంది.

వారంలో మూడు రోజులుమాత్రం అమ్మవారి మూలమూర్తికి జరిగే ఈ మంగళాభిషేకంలో భక్తులు నిర్ణీత రుసుమును చెల్లించి పాల్గొని దర్శించవచ్చు. పాలు, పెరుగు మున్నగు పూజా ద్రవ్యాలు, అభిషేక ద్రవ్యాలను సమర్పించుకోవచ్చు. అభిషేకం అయిన వెంటనే పుష్పాలంకరణ జరుగుతుంది. లలితా సహస్రనామాలతో అర్చన, దధ్యోదనం, చక్కరపొంగలి నివేదన, ఆ సాయంత్రం అష్టోత్తరశతనామ పూజ, అర్చనలతో ముళహోర నివేదింపబడుతుంది.

## ఉత్సవాలు
## బ్రహ్మోత్సవాలు (జాతర్లు)



**అవనాక్షమ్మ (ఉత్సవమూర్తి)**

ఆమ్నాయాక్షి అమ్మవారికి ప్రతి సంవత్సరం తమిళ ఆవణినెల (శ్రావణమాసంలో) (ఆగష్టు - సెప్టెంబరు) మూడవ మంగళవారం మొదలుకొని శుక్రవారం వరకు నాలుగురోజులపాటు ఉత్సవాలు



జరుగుతాయి. వీటిని వార్షిక బ్రహ్మోత్సవాలు అనీ, జాతర్లు అని అంటారు. ఈ నాలుగు రోజులపాటు వేలాది మంది భక్తులు పాల్గొంటారు. తమకు ఇష్టమైన రీతిలో మొక్కులు చెల్లించుకుంటారు. కొందరు గుడి ముందు పొర్లుదండాలు పెడతారు, కొందరు నేతితో జ్యోతులు వెలిగిస్తారు, పిండి దీపాలు వెలిగిస్తారు. అభిషేకంలో పాల్గొంటారు, పొంగళ్లు వండి నివేదిస్తారు.

ఈ మూడు రోజులపాటు ప్రతి సాయంత్రం 6 గం॥ అవనాక్షమ్మ అమ్మవారికి సింహవాహనంపై ఉత్సవం జరుగుతుంది. పూర్వపు ఆనవాయితీ ప్రకారమే నేటికి ఈనాటికి కూడా నారాయణవరం, కీలగరం, సముదాయం, బబ్రాసపాళెం, కెంపరపాళెం, పరమేశ్వరమంగళం మున్నగు పదికి పైగా ఊళ్లల్లో ఉత్సవం జరుగుతుంది. అంటే శ్రీనారాయణవరం పూర్వం చాల పెద్ద నగరంగా ఉండేదని, రాను రాను ప్రస్తుతకాలానికి అది చిన్న చిన్న పల్లెలుగా విడిపోయి వుందని తెలియ వస్తున్నది. అందువల్లే ఈ గ్రామాలన్నింటికీ ప్రధాన గ్రామదేవత ఈ ఆమ్నాయాక్షి నేటికి అన్ని గ్రామాల ప్రజలు ఈ 'అవనాక్షమ్మ' జాతర్లలో భయభక్తులతో చిన్న పెద్ద తేడా లేకుండా పాల్గొంటారు.

## దసరానవరాత్రి ఉత్సవాలు

ఇవే గాకుండ, దేవీనవరాత్రులయిన దసరాపండుగ సందర్భంలో పదిరోజులపాటు పల్లకిలో ఆమ్నాయాక్షమ్మకు భక్తులు తమకు నచ్చిన విధంగా, తాము మెచ్చిన విధంగా అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటారు. అమ్మవారికి చీరసారె పసుపు కుంకుమలతో ప్రత్యేకపూజలు విశేషంగా చేయించుకుంటారు.

ఆమ్నాయాక్షి అమ్మవారి పంచలోహ ఉత్సవ విగ్రహం మాత్రం ఊరేగింపు సమయాల్లో మాత్రమే ఈ ఆలయానికి తెస్తారు. దేవీనవరాత్రుల సమయాల్లో పదిరోజులపాటు శ్రీ అవనాక్షమ్మ తిరుచ్చి(శ్రీపీఠం)లో



**సింహవాహన అయిన అవనాక్షమ్మ**

ఊరేగింపబడతారు. మిగిలిన సమయాల్లో నారాయణవరంలోని శ్రీ పరాశరేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారి ఉత్సవమూర్తిని భద్రపరుస్తారు.

నారాయణవరంలోని అనేక ఆలయాలతోపాటు శ్రీ అవనాక్షమ్మ అమ్మవారి ఆలయాన్ని తి.తి.దేవస్థానం వారు 1967లో స్వీకరించారు.

ప్రతిరోజు ఉదయం 6 గంటల నుండి 11 గంటల వరకు సాయంత్రం 4 గంటల నుండి 7 గంటల వరకు మాత్రమే ఈ ఆలయాన్ని తెరచి ఉంచుతారు. నారాయణవరంక్షేత్ర గ్రామదేవతగా, స్వయంగా శ్రీపద్మావతి అమ్మవారు అర్చించిన శ్రీఅవనాక్షమ్మ దేవతను దర్శించడం సకల శ్రేయోదాయకం, ఇష్టార్థప్రదం కూడా!

అవనాక్షమ్మ గుడి ఇటీవల 1967లో తి.తి.దేవస్థానం తీసుకొన్న తర్వాత జీర్ణోద్ధరణ నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ, గోపుర నిర్మాణాలు చేయబడ్డాయి. శ్రీఅవనాక్షమ్మ గర్భాలయంపైన ఐదు రాగి కలశాలతో విమానగోపురం, మూడు అంతస్థులుగా నిర్మింపబడింది. గర్భాలయం ముందు అంతరాళం ఉంది. అంతరాళం ముందు ఇనుప కటాంజనంతో కూడిన ముఖమండపం,



ముఖమండపం ముందు భాగంలో ఎదురుగా రాతి సింహవాహనం ప్రతిమ, దాని వెనుక ధ్వజస్తంభం, దాని వెనుక బలిపీఠం వెనుక త్రిశూలపీఠాలు ఏర్పాటు చేయబడినాయి.

ప్రధాన ఆలయం చుట్టూరా ఎత్తైన ప్రాకారంతో కూడిన ప్రవేశద్వారం నిర్మింపబడింది. ప్రవేశద్వారం పైన ఎలాంటి గోపురం లేదు. కేవలం ప్రవేశద్వారమండపం నిర్మింపబడి అమ్మవారి శిల్పాలతో విరాజిల్లుతోంది.

ఆలయం బయట విశాలమైన ప్రాంగణం వుంది. ఈ ప్రాంగణంలోనే అవనాక్షమ్మ జాతర్లలో గుడిముందర చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పొయ్యిలు వెలిగించి పొంగళ్లను వండి నివేదించుకొంటారు. మొక్కులు చెల్లించుకుంటారు.

ప్రతిసంవత్సరం భాద్రపమాసం శుద్ధచతుర్దశికి పూర్తి అయ్యేట్లుగా మూడు రోజులపాటు పవిత్రోత్సవాలు జరుగుతాయి.

**శ్లో ॥ సర్వమంగళమాంగల్యే శివే సర్వార్థసాధికే**
**శరణ్యే త్ర్యంబకే దేవి నారాయణి నమోస్తుతే**

**ఓం శ్రీమాత్రే నమః**

## శ్రీ మరకతాంబా సమేత శ్రీ అగస్త్యేశ్వరస్వామి ఆలయం



శ్రీ ఆమ్నాయాక్షి అమ్మవారి ఆలయానికి దక్షిణంగా చాలదగ్గర్లోనే దివ్యమైన ప్రశాంత ధామంగా చాలా ప్రాచీనమైన శివాలయం దర్శనమిస్తుంది.

అదే శ్రీమరకతాంబికా సమేత శ్రీ అగస్త్యేశ్వరస్వామివారి ఆలయం. అరుణానదికి పడమటితీరంలో వున్న ఈ ఆలయం ప్రస్తావన "శ్రీవేంకటాచలమాహాత్మ్యం" గ్రంథంలో కూడ కనపడుతుంది.

వనవిహారం కోసం వచ్చిన పద్మావతి, వేటకై వచ్చిన శ్రీనివాసుడు ఒకరినొకరు చూసుకొని మోహించుకొంటారు. మోహితురాలైన పద్మావతి తాపజ్వర పీడితురాలు అవుతుంది. ఆమె తాపజ్వరం తగ్గడానికి అగస్త్యేశ్వరస్వామికి అభిషేకం చేసి ఆ తీర్థాన్ని పద్మావతికి ఇస్తే బాగుంటుందన్నారు పురోహితులు. ఆకాశరాజు అభిషేకాన్ని ఏర్పాటు చేస్తాడు. ఆ తీర్థంకోసం పద్మావతి చెలికత్తెలు వస్తారు. సరిగ్గా అదే సమయానికి వకుళమాత నారాయణవరంలోని ఈ ఆలయాన్ని దర్శించిన తర్వాత చెలికత్తెలద్వారా పద్మావతిని శ్రీనివాసునికి అడగటానికి రాజమందిరానికి వెళుతుందని పై గ్రంథంలో పేర్కొనబడింది.



## స్థలపురాణం

ఆకాశరాజు వంశీయుల ఇలవేల్పుగా విరాజిల్లిన శ్రీఅగస్త్యేశ్వరస్వామివారి ఆవిర్భావగాథ ఆసక్తి కరం!

ఒకప్పుడు ఇక్కడ ఒక అద్భుతమైన కొలను ఉండేది. దాని చుట్టూరా ప్రకృతి రమణీయంగా ఉండే ఆహ్లాదకరమైన వాతావరణానికి పరవశించిన అగస్త్యుడు ఆ సరోవర తీరంలో తపస్సు చేసేవాడు. ఒకప్పుడు ఎనిమిది మంది దేవకన్యలు ఆ కొలనులో జలక్రీడలాడుతూ! అగస్త్యుణ్ణి చూచినారట! పొట్టివాడైన అగస్త్యమునిని చూస్తూ ఎగతాళిగా "పొట్టివాడు" అంటూ పరిహసించినారట. అందుకా మహర్షి కోపించి వారిని కుబ్జలై (గూనివారై) భూలోకంలోనే పడి వుండండి అని శపించాడట. వెంటనే వాళ్లందరూ, అగస్త్యుని కాళ్లమీద పడి పశ్చాత్తాపంతో క్షమించమని వేడినారు. ఆయన పరమేశ్వరుణ్ణి ఆరాధించి శాపవిముక్తిని పొందండి అని చెప్పాడు. ఆ కన్యలు అక్కడే శివుణ్ణి ధ్యానించగా ఆ కొలను మధ్యలో ఒక శివలింగం ఉద్భవించింది! స్వయంవ్యక్తమైన ఆ శివలింగాన్ని అగస్త్యేశ్వరుని ఆధ్వర్యంలో పూజించి నందువల్ల వాళ్లకు శాపవిముక్తి లభించింది. ఆ శివలింగమే స్వయంభువు అయిన అగస్త్యేశ్వరస్వామివారి మహాశివలింగం.

అరుణానదీ తీరాన పశ్చిమంగా శ్రీ అగస్త్యేశ్వరస్వామివారి ఆలయం తూర్పుముఖంగా నిర్మింపబడింది. ప్రధాన ఆలయం చుట్టూరా ప్రాకారం నిర్మింపబడింది. పశ్చిమముఖంగా ఎలాంటి గోపురశిఖరాలు లేకుండా కేవలం అలంకార శిల్పాలతో వున్న ప్రవేశద్వారమండపం నిర్మింపబడింది.

## ఆలయ ప్రాంగణం

ప్రాకార ప్రవేశద్వారంలో ప్రవేశించగానే తూర్పుముఖంగా నిర్మింపబడిన ఆలయానికి ప్రదక్షిణంగా వెళ్లితే ప్రాంగణంలో వాయువ్యమూలలో

దక్షిణముఖంగా చండికేశ్వరుని సన్నిధి, ఈశాన్యమూలలో దక్షిణముఖంగా కాలభైరవుని సన్నిధి, ఆ పక్కనే పశ్చిమముఖంగా శ్రీసూర్యభగవానుని సన్నిధి, ఆ తర్వాత ఆలయానికి తూర్పు భాగంలో బలిపీఠం, దానికి ముందు ధ్వజస్తంభం – దానికి ముందు నందీశ్వరుని విగ్రహ మండపం ఉన్నాయి. నందీశ్వరుని విగ్రహం ముందు ఆలయ ప్రాకారంలో నిర్మింపబడిన చిన్న కిటికీ ద్వారా లోపల గుడిలోని శ్రీఅగస్త్యేశ్వరలింగం తూర్పుముఖంగా దర్శనమిస్తుంది. నందీశ్వరుని దగ్గరి నుంచి అగస్త్యేశ్వరుని దర్శించిన తర్వాత ముందుకు వెళితే ఆగ్నేయంలో చిన్నబావి, వంటశాల వున్నాయి. దక్షిణ దిక్కున వెళితే శ్రీఅగస్త్యేశ్వరస్వామి ఆలయం ప్రధాన ప్రవేశద్వారం ఉంది. ఆలయంలో ఉత్తరాభిముఖంగా ప్రవేశిస్తే లోపల శ్రీ అగస్త్యేశ్వరస్వామివారి శివలింగం తూర్పుముఖంగా దర్శనమిస్తున్న గర్భాలయం కనపడుతుంది. గర్భాలయంపైన ఏక కలశ గోపురం త్రితలంగా నిర్మింపబడింది. గర్భాలయం ముందు ఇరువైపులా చాల ప్రాచీనమైన శిలామూర్తులు ప్రతిష్ఠింపబడి భక్తి చైతన్యంతో మనస్సు ఆహ్లాదంతో నిండుతుంది. గర్భాలయానికి ద్వారంలో ఎడమవైపు సప్తమాతృకలు, గణపతి; కుడివైపున, సుబ్రహ్మణ్యస్వామి ఎడమవైపున పెద్ద కాశీవిశ్వేశ్వరలింగం, దాని ముందు నందీశ్వరుని విగ్రహం ఆ తర్వాత అన్నపూర్ణాదేవి, ఆ తర్వాత కార్తికేయుడు ఇలా అన్ని మూర్తులు తూర్పుముఖంగా ప్రతిష్ఠింపబడి నిత్య పూజలందుకుంటున్నాయి.

శ్రీ అగస్త్యేశ్వరస్వామి వారి పక్కనే ఆనుకొనివున్న ప్రత్యేక గర్భాలయ సన్నిధిలో ''మరకతాంబ'' పేరుతో పార్వతీదేవి విగ్రహమూర్తి ప్రతిష్ఠింపబడింది. మరకతాంబ లేక, మరకతాంబిక లేదా మరకతవల్లి అనే పేర్లతో పిలువబడుతున్న పార్వతీ అమ్మవారు కూడ అగస్త్యేశ్వరస్వామి వారి మాదిరే తూర్పుముఖంగా వేంచేసి వున్నారు.

శ్రీ అగస్త్యేశ్వర, శ్రీ మరకతాంబిక గర్భాలయాలమీద ఏకకలశగోపురాలు నిర్మింపబడినాయి.



వీరిని దర్శించి బయటికి వచ్చిన తర్వాత బయట నైరుతిమూలలో శ్రీ డుంఠివినాయకుడు తూర్పుముఖంగా దర్శనమిస్తాడు. ఇక్కడితో ఆలయం ప్రదక్షిణం పూర్తి అవుతుంది.

శ్రీ మరకతాంబికా సమేత శ్రీ అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ప్రతిరోజు ఉదయం క్షీరంతోనూ, శుద్ధజలంతో అభిషేకం జరుగుతుంది. అర్చన అయిన తర్వాత దధ్యోజనం నివేదింపబడుతుంది. సాయంత్రం పూట 'ఏకాంతసేవ' తీర్మానంలో (ఆస్థానంలో) శుద్ధాన్నం 'పాయసం' నివేదింపబడతాయి.

శ్రీ అగస్త్యేశ్వరస్వామి శివలింగానికి ప్రతి సోమవారంనాడు మాత్రం విశేషంగా పంచామృతంతో అభిషేకం జరుగుతుంది. భక్తులెవరైనా అభిషేక ద్రవ్యాలను పాలు, పెరుగు, పంచామృతం, విభూది, కుంకుమ, పన్నీరు, కొబ్బరినీరు మున్నగు ద్రవ్యాలను సమర్పించి, శ్రీమరకతాంబికా సమేత శ్రీఅగస్త్యేశ్వరస్వామివారలకు ఏ రోజైనా ఉదయంపూట అభిషేకం చేయించుకోవచ్చు.

శ్రీమహాశివరాత్రి సందర్భంగా ఈ ఆలయంలో ఘనంగా అభిషేకాలు, అర్చనలు జరుగుతవి.

## బ్రహ్మోత్సవాలు

అంతేగాక చైత్రపున్నమినాటికి ముగిసేట్లుగా శ్రీ అగస్త్యేశ్వరస్వామి వారికి పదిరోజులపాటు బ్రహ్మోత్సవాలు జరుగుతవి. ఈ పదిరోజుల్లో రాత్రిపూట చంద్రప్రభ, సింహం, హంస, శేష, నంది, గజం, రథోత్సవం, సాయంత్రం కల్యాణోత్సవం, రాత్రి అశ్వవాహనం జరుగుతవి. చివరి రోజున త్రిశూలస్నానం జరుగుతుంది. 5 కిలోమీటర్ల దూరంలోవున్న **'కైలాస కోన'** అనే క్షేత్రానికి ఊరేగింపుగా వెళ్లి అక్కడ త్రిశూలస్నానం జరగడంతో బ్రహ్మోత్సవాలు పూర్తి అవుతాయి.

ప్రతి సంవత్సరం జనవరిలో కనుమ పండుగనాడు శ్రీఅగస్త్యేశ్వరస్వామి వారు, శ్రీపరాశరేశ్వరునితో కలిసి గిరి ప్రదక్షిణం చేస్తారు. ఆ రోజు సాయంత్రం 5 గంటలకు ప్రారంభమైన ఈ ఉత్సవం, అర్ధరాత్రి వరకు కొనసాగుతుంది. ఈ ఉత్సవంలో చుట్టుపక్కల ఊళ్లలోని 16 ఆలయాలనుంచి ఆ యా దేవుళ్లు నగరి "కొండచుట్టు" మండపానికి చేరుకొంటారు. పిదప పూజానివేదనలు అయింతర్వాత తిరిగి వచ్చేస్తారు.

## పవిత్రోత్సవాలు

శ్రీ అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ఏడాదిపొడవునా జరిగే అర్చనల్లో, ఉత్సవాల్లో ఏవైనా లోపాలు, పొరపాట్లు చోటు చేసుకోవచ్చు. అంతేగాక, ఆలయ ప్రవేశనిషిద్ధవేళల్లో, తెలియకుండా భక్తులుగాని, ఆలయసిబ్బందిగాని ఆలయానికి వెళ్లవచ్చు. ఇలాంటి పొరపాట్లవల్ల ఆలయ పవిత్రతకు కొంత భంగం వాటిల్లవచ్చు. దానివల్ల కలిగిన దోషనివారణార్థం శైవాగమం ప్రకారం ప్రతి ఏటా భాద్రపదమాసంలో శుద్ధషష్ఠి, సప్తమి, అష్టమి మూడు రోజులపాటు పవిత్రోత్సవాలు నిర్వహింపబడతవి.

శ్రీ మరకతాంబికా శ్రీ అగస్త్యేశ్వరస్వామి ఆలయంలోని ఉత్సవ మూర్తులన్నీ నారాయణవరంలోని శ్రీ పరాశరేశ్వరస్వామి ఆలయంలో భద్ర పరచబడి వుంటాయి. బ్రహ్మోత్సవాలు, మహాశివరాత్రి వంటి ఉత్సవాల వేళల్లో మాత్రమే ఆ యా ఉత్సవమూర్తులను ఇక్కడికి తెచ్చి ఉత్సవాలను నిర్వహిస్తారు.

**శ్లో ॥ నమశ్శివాభ్యాం వృషవాహనాభ్యాం**
**విరించి విష్ణీంద్ర సుపూజితాభ్యామ్**
**విభూతి పాటీర విలేపనాభ్యాం**
**నమో నమ శ్శంకర పార్వతీభ్యామ్**

**ఓం నమశ్శివాయ!**

## శ్రీ సొరకాయలస్వామి సమాధి మందిరం


నారాయణవరంలో శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారి ఆలయ ప్రధాన రాజగోపురం ఎదురుగావున్న వీధిని సన్నిధి వీధి అంటారు. ఆ వీధి చివర్లో శ్రీఆంజనేయస్వామివారి ఆలయానికి ఆనుకొని ఉత్తరం పక్కన మహనీయుడైన ఒక అవధూత సమాధి మందిరం, అవశ్యం దర్శనీయమైన దివ్యమందిరంగా విరాజిల్లుతోంది.

"శ్రీ సొరకాయలస్వామి మందిరం" తి.తి.దేవస్థానంవారి అనుబంధ ఆలయం కాదు. "శ్రీ సొరకాయలస్వామి కైంకర్య సమాజం" ప్రైవేటు ట్రష్టు అధీనంలో నిర్వహింపబడుతున్నది.

ఆ అవధూతను శ్రీ సొరకాయలస్వామి అని, శ్రీ సొరకాయలతాత అని అంటారు. ఆయన అసలు పేరేమిటో, కులమేమిటో ఎవరికీ తెలియదు. ఎక్కడి నుంచి వచ్చినాడో కూడా అంతకంటే తెలియదు. ఎప్పుడూ భుజంపైన వేలాడే సొరకాయలతో, వుండే స్వామి కనుక భక్తులు ఆయనకు "సొరకాయలస్వామి" అని పేరు పెట్టుకున్నారు.

తలపైన బరువైన తలపాగా, తెల్లగా నెరసిన జుట్టు, గడ్డంతో నొసటన తెల్లని నామాలు, మధ్య ఎర్రనినామం భుజాలకు తాళ్లతో వేలాడదీసిన రెండు మూడు సొరకాయల బూరలు, జోలెలు మురికితో జిడ్డు బట్టిన మూటలతో దర్శనమిచ్చేవాడు. ఆయన వెంట చిన్న గొడ్డలి వుండేది. దాంతో ఎండుకట్టెలు కొట్టుకొని వచ్చి అగ్నిగుండం (ధుని) వెలిగించేవాడు. ఆ ధునిలోని విభూదే భక్తులకు దివ్యౌషధం.

ఇలాంటి రూపంతో పొట్టివాడుగా కనపడే సొరకాయలతాత వెంట ఎప్పుడు రెండుమూడు కుక్కలు కూడ వుండేవి. అందువల్ల దత్తాత్రేయస్వామి అవతారంగా భావించే సొరకాయలస్వామి, భౌతిక శరీరంతో సుమారు 200 ఏండ్లకు పైగా జీవించినవున్నారట! శ్రీ సొరకాయలతాత పుత్తూరు,



శ్రీ సొరకాయలస్వామి



చిత్తూరు, తిరుపతి, తిరుమల, మద్రాసు (చెన్నై) తమిళనాడులో కొన్ని ప్రాంతాల్లో తిరిగే వారట! ఎక్కడ తిరిగినా ఆయన ప్రధాన స్థావరం మాత్రం నారాయణవర క్షేత్రంలోని పురవీధులు మాత్రమే. అందులోను శ్రీకల్యాణ వేంకటేశ్వరుని సన్నిధి వీధిలోనే ఎక్కువగా సంచరించే వాడని అంటారు.

సొరకాయలతాత ఎక్కడుంటే అక్కడికి భక్తులు వెళ్లి తమ కష్టాలను చెప్పుకొని నమస్కరించేవాళ్లు.

వాళ్ల కోరికలను బట్టి ఆ స్వామి సొరకాయ బుర్రలో చెయ్యిపెట్టి గలగల లాడిస్తూ అప్పులతో బాధపడేవారికి, ఆర్థిక ఇబ్బందులున్నవారికి నాణాలు ఇచ్చి దగ్గర పెట్టుకోమనేవారు. వారికి దరిద్రం పోయేది. రోగాలు పోవలసిన వాళ్లకు, తన కాలికింది మట్టి లేదా విబూదీ ఇచ్చేవాడు. వాళ్ల రోగాలు ఇట్టే మాయమయ్యేవి. కొందరు పెళ్లికోసం, సంతానం కోసం వచ్చి ఆయనను దర్శించేవాళ్లు. ఎవరైనా ప్రయాణమై పోతుంటే వాళ్లు అడగకపోయినా, ఇప్పుడు పోతే పని గాదు. పో అని గొణిగేవాడు. అది విని ఆగితే సరి. వినక పోయినవాళ్లు, అయ్యో స్వామిమాట వినివుంటే బాగుండేది కదా! అని బాధపడేవాళ్లు. కొందరుభక్తులు తెచ్చిన పండ్లు, పూలు, దక్షిణ తీసుకొనేవాడు, కొందరు ఏమిచ్చినా తాకేవాడు కాదు.

కొందరు ఆయనను దర్శిస్తే చాలు. ఆయన చూపులు పడితే చాలు. వాళ్ల వాళ్ల కోరికలు నెరవేరేవి. వాళ్ల సమస్యలు తీరేవి. ఆయనను దర్శించడానికి వచ్చిన వాళ్లలో కొందరికి ఆయన దర్శనమే దొరికేది కాదు. ఊరంతా వెదికినా కొందరికి ఆయన కనపడేవాడే కాదు. వాళ్లు అటు వెళ్లగానే విచిత్రంగా ఎక్కడినుండో వచ్చినట్లుగా ప్రత్యక్షమయ్యేవాడు.

ఒకసారి సొరకాయలస్వామి పుత్తూరులో మద్రాసుకు వెళ్లే రైల్లో ఎక్కినారట! ఆ పెట్టెలోవున్న టికెట్ కలెక్టరుగా వున్న తెల్లదొర (బ్రిటిషువాడు) ఈయన్ను బలవంతంగా దించివేశాడట! నేను లేకుండా నీ రైలు ఎట్లా

పోతుందో చూస్తానంటూ, సొరకాయలస్వామి పుత్తూరురైలు స్టేషనులోని ఒక బల్లపై కూర్చుని గడ్డం క్రింద కర్రను పెట్టుకొని నేలపై గట్టిగా ఒత్తుతూ ఆనించినాడట! అంతే రైలు కొంచం కదలి ఆగిపోయింది. రైలు అధికారులంతా అనేక విధాలుగా పరిశీలించినారు. ఏ లోపం లేకున్నా ఎందుకు కదలలేదని ఆందోళన పడినారు. ఇంతలో కొందరు భక్తులు "తాతను బండినుంచి దింపిన సంగతి చెప్పి, ఆయన మళ్లీ రైలెక్కితేకాని బండి కదలదన్నారు! అదీ పరిశీలించి చూస్తాం అని తెల్లదొరలు ఆయనను రైలెక్కించారు. వెంటనే రైలు కదిలిందట! దాంతో తెల్లవారు స్వామివారికి దాసోహమ్మని సెల్యూట్ చేశారు.

ఆ సమయంలోనే నారాయణవరంలోని శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామి వారికి రథాన్ని తయారు చెయ్యడానికి తగిన కలపకోసం ఆలయ అధికారులు చాలప్రయత్నించారట! వాళ్లు నానా అవస్థలు పడి చివరకు ఎదురుగావుండే "శ్రీసొరకాయలస్వామికి" నమస్కరించి అడిగారట! అడవిలో పలానిచోటుకు వెళ్లండని చెప్పారట! స్వామి! చక్కని రథం తయ్యారయిందట!

ఇలాంటి అద్భుతమైన మహిమలుకల యోగి శ్రీసొరకాయలస్వామి. శ్రీశుకమహర్షి అంశగా అవతరించినాడని కొందరు ఆ ఊరు పెద్దలు అనుకొనే మాట!

సొరకాయలస్వామి ప్రతిరోజూ, అరుణానది నుండి ఒక గులకరాయిని తెచ్చి, శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారి ఆలయం ఎదురుగా ఒక స్థలంలో వేసేవాడట! చిన్న రాళ్లగుట్టగా తయారయిన ఆ స్థలమే తనను సమాధి చేయవలసిన చోటు అని అందరితో చేప్పేవాడు సొరకాయల తాత! ఆయన కోరిక ప్రకారమే ఆ స్థలంలో శ్రీ సొరకాయలస్వామి భౌతిక శరీరం సమాధి చేయబడింది. 1902 ఆగష్టు నెల 9వ తేదీ శ్రావణ శుద్ధ పంచమి (నాగపంచమి, గరుడపంచమి) శనివారం రోజున సమాధిగతులైనారు.

శ్రీ పద్మావతి అమ్మవారు బంగారుపద్మంలో ఆవిర్భవించిన పవిత్ర స్థలంలోనే ఆయన సమాధి వెలసిందని కొందరంటారు. ఆయన సమాధిపైన



అద్భుతమైన మందిరం నిర్మింపబడింది. సమాధికి ఎదురుగా సొరకాయలస్వామి వెలిగించిన ధుని (అగ్నిగుండం) వుంది. భక్తులు టెంకాయలు, కర్పూరం, ఊదిబత్తి మున్నగువాటిని ఈ ధునిలో సమర్పిస్తుంటారు. ఆయన సమాధిమందిరం చుట్టూ సొరకాయల్ని భక్తులు వేలాడదీయడం చూడవచ్చు.

ప్రతి సంవత్సరం శ్రావణమాసం శుద్ధపంచమినాడు జరిగే శ్రీసొరకాయల స్వామి ఆరాధనోత్సవాలు అభిషేక అర్చనలతో ఘనంగా జరుగుతవి. భక్తులకందరికీ అన్న సంతర్పణ సేవ జరుగుతుంది. విశేషంగా భక్తులు పాల్గొంటారు.

ఇప్పటికీ ప్రతిరోజు శ్రీ సొరకాయలస్వామివారి సమాధికి అభిషేకార్చనలతోపాటు ప్రతి పున్నమి, అమావాస్య నాళ్లలో ఘనంగా పూజలు జరుగుతవి.

శ్రీసొరకాయలస్వామి సమాధి మంధిరం పూజలు, నిర్వహణ మున్నగునవి "శ్రీసొరకాయలస్వామి కైంకర్య సమాజం" అనే పేరుతో కొందరి భక్తమండలి ఆధ్వర్యంలో నిర్వహింపబడుతున్నది.

ఈ మందిరానికి తి.తి.దేవస్థానంవారికి ఎలాంటి సంబంధము లేదు.


నారాయణవరం శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారిని సందర్శించే భక్తులకు, అవధూత శ్రీ సొరకాయలస్వామి మందిరం కూడ దర్శనీయ స్థలంగా అలరారుతోంది. తప్పక దర్శించి తీరవలసిన పవిత్ర గురుసన్నిధి కూడ!

**శ్లో ॥ శ్రీపాదస్వామినే నిత్యం**
**నృసింహ గురు యోగినే**
**దత్తాత్రేయాయ నాథాయ**
**మంగళం దీనబాంధవే**

**శ్రీగురుదత్త - జయగురుదత్త**

## అన్నమయ్య అధ

## అన్నమాచార్య చరిత్ర పీఠికనుండి



పొడఁగంటిమయ్యా! మిమ్ము పురుషోత్తమా! మమ్ము
నెడయకవయ్యా! కోనేటిరాయఁడా!

కోరి మమ్ము నేలినట్టి కులదైవమా! చాల
నేరిచి పెద్ద లిచ్చిన నిధానమా!
గారవించి దప్పి దీర్చు కాలమేఘమా! మాకు
చేరువఁజిత్తములోని శ్రీనివాసుఁడా!!

భావింపఁగైవసమైన పారిజాతమా! మమ్ము
చేవదేరఁగాచినట్టి చింతామణీ!
కావించి కోరిక లిచ్చే కామధేనువా! మమ్ము
తావై రక్షించేటి ధరణీధరా!!

చెడనీక బ్రదికించే సిద్ధమంత్రమా! రోగా -
లడఁచి రక్షించే దివ్యౌషధమా!
బడిఁబాయక తిరిగే ప్రాణబంధుఁడా! మమ్ము
గడియించినట్టి శ్రీ వేంకటనాథుఁడా!!

